శుక్రవారం
10-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 110
పేజీలు : 8, వెల:రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికా చేతిలో 'టెలిగ్రామ్' డేటా

వాషింగ్టన్: గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్' నుంచి అమెరికా ప్రభుత్వం పెద్ద ఎత్తున డేటాను సేకరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు టెలిగ్రామ్ తన పారదర్శక నివేదికలో వెల్లడించింది. గతేడాది 900 రిక్వెస్టులు పెట్టి... 2,253 మంది యూజర్ల డేటాను అమెరికా ప్రభుత్వం సేకరించిందని అందులో పేర్కొంది. తొలి 9 నెలల్లో 14 రిక్వెస్టులు రావడంతో 108 మంది డేటాను ప్రభుత్వానికి అందజేసినట్లు టెలిగ్రామ్ తెలియజేసింది. గతేడాది టెలిగ్రామ్ సీఈవో పావెల్ దురోవ్ అరెస్టయిన తర్వాత అమెరికా ప్రభుత్వం చేసిన దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2024 ఆగస్టులో పావెల్ దురోవ్ ఫ్రాన్స్‌లో అరెస్టయిన సంగతి తెలిసిందే.

సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి

విశాలాంధ్ర-హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 13 నుంచి 23 వరకు విదేశీ పర్యటనకు వెళ్లేందుకు ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి తన పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కోర్టును ఆయన అభ్యర్థించారు. బ్రిస్బేన్, దావోస్, ఆస్ట్రేలియా, సింగపూర్, స్విట్జర్లాండ్ పర్యటనలకు వెళ్లాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఇందుకోసం ఆరు నెలల పాటు తన పాస్‌పోర్టు ఇవ్వాలని కోరారు. రేవంత్ రెడ్డి అభ్యర్థనను అంగీకరించిన న్యాయస్థానం... జులై ఆరో తేదీలోగా పాస్‌పోర్టును తిరిగి అప్పగించాలని ఆదేశించింది.

చత్తీస్‌గఢ్‌లో భీకర ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టుల మృతి

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో మరోసారి భీకర ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. సుక్మా జిల్లాలో బీజాపూర్ సరిహద్దు వద్ద అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య గురువారం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. భద్రతా సిబ్బంది గురువారం ఉదయం సుక్మా-బీజాపూర్ సరిహద్దులోని అటవీప్రాంతంలో నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు నేలకొరిగారు. ఆ ప్రాంతంలో గాలింపు కొనసాగుతున్నట్లు సుక్మా ఎస్పీ

- మిగతా 2 లో

ఉచితాలపై నిర్ణయం ప్రజలదే: పనగాడియా

న్యూఢిల్లీ: ఉచితాలు కావాలా లేదా మెరుగైన సౌకర్యాలు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని ప్రముఖ ఆర్థికవేత్త, 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగాడియా అన్నారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం కేటాయించిన నిధులను రాష్ట్రాలు ఉచితాల కోసం వినియోగిస్తున్నాయనే ఆరోపణలపై ఆయన స్పందించారు. 'అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేటాయించిన డబ్బును ఆ పనులకు మాత్రమే వినియోగించాలి. అయితే... ఈ డబ్బును ఎలా ఖర్చు చేయాలనే తుది నిర్ణయం మాత్రం ప్రజాస్వామ్యంలో ఎన్నికైన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కేటీఆర్‌పై ప్రశ్నల వర్షం

- ఫార్ములా ఈ-రేసు కేసులో ఆరున్నర గంటల విచారణ
- ఇరుకునపెట్టిన దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్
- ఎప్పుడు పిలిచినా హాజరు కావాలి: ఏసీబీ

విశాలాంధ్ర-హైదరాబాద్: ఫార్ములా ఈ- రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ఆరున్నర గంటల పాటు విచారించారు. ఈ కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్... విచారణలో భాగంగా కేటీఆర్‌ను వివిధ ప్రశ్నలు అడిగారు. విచారణను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షించారు. విచారణను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాది రామచంద్రరావును అనుమతించారు. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరుకావాలని ఏసీబీ అధికారులు సూచించారు.

అన్ని విధాలా సహకరించా...

మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ...

- మిగతా 2 లో

తిరుపతి తొక్కిసలాట ఘటన
ఇద్దరు అధికారులపై వేటు

- మరో ముగ్గురి బదిలీ
- న్యాయ విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశం
- దుర్ఘటన ప్రాంతం పరిశీలన
- అధికారులపై తీవ్ర ఆగ్రహం
- క్షతగాత్రులకు పరామర్శ
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, ఇంటికో ఉద్యోగం
- గాయపడ్డ వారికి రూ.2 లక్షల పరిహారం

విశాలాంధ్ర బ్యూరో- తిరుపతి: తిరుపతిలో బైరాగి పట్టెడ పార్కు వద్ద బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. అక్కడ విధుల్లో నిర్లక్ష్యం వహించిన డీఎస్పీ రమణ కుమార్, గోశాల ఇంఛార్జ్ హరినాథ్‌రెడ్డి లను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దుర్ఘటనలో పర్యవేక్షణ లోపాన్ని గుర్తించి... ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈఓ గౌతమి, సీవీఎస్ఓ శ్రీధర్ లను బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం రాత్రి పద్మావతి పార్క్ వద్ద తిరుమలలో వేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల కోసం జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీనిపై తొలుత అమరావతి నుంచే సమీక్షించిన సీఎం చంద్రబాబు గురువారం మధ్యాహ్నం తిరుపతికి వచ్చారు. రేణిగుంట విమానాశ్రయం నుండి నేరుగా తొక్కిసలాట జరిగిన పద్మావతి పార్క్ వద్దకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం నేరుగా పద్మావతి వైద్య కళాశాల వద్దకు వెళ్లి గాయపడిన వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం టీటీడీ పరిపాలన భవనంలో మంత్రులు,

- మిగతా 2 లో

రోదనలతో మిన్నంటిన రుయా

పద్మావతి, స్విమ్స్ ఆస్పత్రుల్లోనూ కన్నీటి వ్యధ

తొక్కిసలాట మృతుల బంధువుల బాధ వర్ణనాతీతం

8 లో

రుయా ఆస్పత్రి ఆవరణలో మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. పద్మావతి, స్విమ్స్ ఆస్పత్రుల్లోనూ ఇవే కన్నీటి వ్యధలు కనిపించాయి.

డీఎస్పీ, డ్రైవర్ నిర్లక్ష్యం...

తిరుపతి ఘటనపై సీఎం చంద్రబాబుకు నివేదిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద తొక్కిసలాట జరిగి పెనువిషాదం చోటుచేసుకోవడానికి అక్కడున్న డీఎస్పీ, అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆ జిల్లా కలెక్టర్ ప్రాథమిక నివేదిక సమర్పించారు. అక్కడున్న డీఎస్పీ రమణకుమార్ అత్యుత్సాహం వల్ల ఒక్కసారిగా భక్తులు రావడంతో తొక్కిసలాట జరిగిందని పేర్కొన్నారు. తొక్కిసలాట జరిగిన తర్వాత డీఎస్పీ సరిగా స్పందించలేదు. ఎస్పీ

- మిగతా 2 లో

ముంచుకొస్తున్న
ఆహార కొరత

10 శాతం తగ్గనున్న వరి, గోదుమ దిగుబడి

వాతావరణశాఖ డీజీ మృత్యుంజయ్ మహాపాత్ర హెచ్చరిక

న్యూఢిల్లీ: వాతావరణ మార్పుల కారణంగా భారత్‌లో వరి, గోదుమ దిగుబడులు 6 నుంచి10 శాతం తగ్గిపోయే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. లక్షలాది మంది ఆహార భద్రతపై ఇది ప్రభావం చూపనుందన్నారు. మరోవైపు తీర ప్రాంతాల్లో సముద్ర జలాలు వేడెక్కుతున్నాయని, దీంతో చేపలు తీరం నుంచి దూరంగా వెళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. ఫలితంగా చేపల వేటపైనా వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. 'వాతావరణ మార్పులతో వరి, గోదుమ ఉత్పత్తులు 6 నుంచి 10 శాతం తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇది రైతులు, ఆహార భద్రతపై గణనీయమైన ప్రభావం చూపిస్తుంది' అనిభారత వాతావరణ శాఖ డీజీ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. భూతాపం ప్రభావం ఉంటుందని, దీంతో హిమాలయాలతోపాటు దిగువ మైదానాల్లో నివసిస్తున్న కోట్లాది మంది నీటి కొరతతో ఇబ్బందిపడుతారని భూశాస్త్ర మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ ఆందోళన వ్యక్తంచేశారు. వాతావరణ మార్పుల ప్రభావంపై మృత్యుంజయ్, రవిచంద్రన్ పీటీఐ వార్తా సంస్థకు గురువారం ఇచ్చిన వేర్వేరు ఇంటర్వ్యూలో కీలక అంశాలు వెల్లడించారు. 'మానవుల మాదిరిగానే చేపలు కూడా చల్లని నీటికి ప్రాధాన్యం ఇస్తాయి. సముద్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ అవి తీరం నుంచి దూరంగా వెళ్లిపోతాయి. ఈ పరిణామం చేపల వేటపై, దానిపై ఆధారపడిన మత్స్యకారులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది' అని రవిచంద్రన్ పేర్కొన్నారు. వాతావరణ మార్పుల్లో అస్థిరత కారణంగా ఈ పరిస్థితులను కచ్చితంగా అంచనా వేయడం ఇబ్బందిగా మారిందన్నారు. తక్కువ విస్తీర్ణంలో, స్వల్ప వ్యవధిలోనే అనేక వాతావరణ సంఘటనలు

- మిగతా 2 లో

శంభు సరిహద్దులో
రైతు ఆత్మహత్య

- ఖనౌరీ సరిహద్దులో పేలిన గీజర్... రైతుకు గాయాలు
- క్షీణిస్తున్న దలేవాల్ ఆరోగ్యం... 45వ రోజుకు ఆమరణదీక్ష
- నేడు ప్రధాని దిష్టిబొమ్మలు దగ్ధం చేయాలని రైతుల సంఘాల పిలుపు

2 లో

పంజాబ్-హర్యానా మధ్య శంభు సరిహద్దు వద్ద రైతులు చేస్తున్న ఆందోళనలో అపశృతి చోటుచేసుకుంది. గురువారం రేషమ్ సింగ్ అనే 55ఏళ్ల రైతు విషపూరిత పదార్థం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

సమన్వయ లోపంతోనే దుర్ఘటన

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- బాధిత కుటుంబాలకు పరామర్శ

విశాలాంధ్ర-బ్యూరో తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానం, పోలీసు అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగానే తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు జారీ కౌంటర్ల వద్ద తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు దుర్మరణం చెందారని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అభిప్రాయపడ్డారు. తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడి ఆస్పత్రిలో చికిత్స

- మిగతా 2 లో

మోహన్‌బాబుకు సుప్రీంలో ఊరట

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రముఖ సినీనటుడు, విద్యాసంస్థల అధినేత మంచు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ముందస్తు బెయిల్‌పై విచారణ జరుగుతోందని, ఆ విచారణ ముగిసేంతవరకు మోహన్‌బాబును అరెస్ట్ చేయవద్దని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. జర్నలిస్టుపై దాడి కేసులో మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది. దీనిపై ముందస్తు బెయిల్ కోసం మోహన్‌బాబు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. పోలీస్ విచారణకు హాజరు కావడానికి తనకు కొంత సమయం కావాలని కోర్టును అభ్యర్థించారు. దీనిపై డిసెంబర్ 24న పోలీసుల ముందు విచారణకు హాజరు

- మిగతా 2 లో

కమ్యూనిస్టు నేతల మృతి
సమాజానికి తీరని లోటు

'అమరుల సంతాప సభ'లో వక్తలు

విశాలాంధ్ర-హైదరాబాద్: సమాజహితం కోరుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టు నేతల మృతి సమాజానికి, ప్రజలకు తీరని లోటు అని పలువురు వక్తలు అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దివంగత ఎన్.బాలమల్లేష్, ఖమ్మం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోటు ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యాలయ మాజీ కార్యదర్శి డి.ఎస్. రామచంద్రరావులకు పార్టీ రాష్ట్ర కౌన్సిల్ అధ్వర్యంలో 'అమరుల సంతాప సభ' జరిగింది. వక్తలు మాట్లాడుతూ... పదవుల కోసం రాత్రికిరాత్రి పార్టీలు, జెండాలు మారుస్తున్న ప్రస్తుత తరుణంలో నిబద్ధతతో నిరంతరం ప్రజల కోసం పరితపించే నాయకులను కోల్పోవడం బాధాకరమన్నారు. ఇటువంటి నాయకులు మళ్లీ రావడం చాలా అరుదు అని అన్నారు. బాలమల్లేష్, పోటు ప్రసాద్, రామచంద్రరావు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీరి మరణం ఉద్యమానికీ తీరని లోటన్నారు.

పార్టీకి జీవితాలు త్యాగం: కూనంనేని

బాలమల్లేష్, పోటు ప్రసాద్, రామచంద్రరావు... కమ్యూనిస్టు పార్టీకి తమ జీవితాలను అంకితం చేశారని కూనంనేని అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగలేదన్నారు. రాజకీయ అవకాశాలు వచ్చినా కమ్యూనిస్టు పార్టీలోనే కొనసాగారని కొనియాడారు. బాలమల్లేష్ విద్యార్థి, యువజన సంఘం నుంచి, బీసీ హక్కుల సాధన సమితి, బీకేఎంయు, జిల్లా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, జాతీయ సమితి సభ్యులుగా ఎదిగారన్నారు. పోటు ప్రసాద్ బలమైన ఉద్యమాన్ని నిర్మించారని, ఖమ్మం జిల్లాలో న్యాయవాదులు, వైద్యుల అనుబంధ సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. విద్యుత్ పోరాటంలో ప్రసాద్ ముందు నిలిచారని, లాఠీ దెబ్బలకు కూడా భయపడలేదని చెప్పారు. రామచంద్రరావు చిన్న వయసులోనే రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా సుదీర్ఘకాలంగా పని చేశారని గుర్తు చేశారు.

కార్యకర్తలను కాపాడుకోవాలి: కోదండరామ్

ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ పార్టీలో చేరిన మరుసటి రోజే పదవులు

- మిగతా 2 లో

రెండువేల మందిని నియంత్రించలేరా?

- టీటీడీ అధికారుల వైఫల్యంపై డిప్యూటీ సీఎం పవన్ విస్మయం
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున క్షమాపణ

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: తిరుపతిలో జరిగిన దుర్ఘటన తనను కలిచివేసిందని... మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పక్షాన క్షమాపణ కోరుతున్నానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న పవన్... నేరుగా తిరుపతిలోని తొక్కిసలాట జరిగిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ బన్సల్, డీఎస్పీ చెంచు బాబు లు ఉప ముఖ్యమంత్రికి దుర్ఘటన వివరాలను

- మిగతా 2 లో

హాలీవుడ్‌ను దహిస్తున్న రాకాసి మంటలు

2లో

ఆంధ్రలో తొలితరం కమ్యూనిస్టులు - 1

మహాత్మా గాంధీ 1920 లో ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం, 1930లో ప్రారంభించిన శాసనోల్లంఘన ఉద్యమ ప్రభావం ఆంధ్ర ప్రాంతంపై ఎక్కువగా ఉండేది. తొలి తరం కమ్యూనిస్టుల్లో ఎక్కువ మంది ఈ రెండు ఉద్యమాలలో పాల్గొన్నవారే. సామ్రాజ్యవాద వ్యతిరేకత యువతరాన్ని బాగా ఆకర్షించింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

హాలీవుడ్‌ను దహిస్తున్న రాకాసి మంటలు

- వెయ్యికిపైగా నిర్మాణాలు అగ్నికి ఆహుతి
- ఇళ్లు ఖాళీ చేసిన సెలబ్రిటీలు
- లాస్‌ఏంజిల్స్‌లో ఆగని కార్చిచ్చు

లాస్ ఏంజిల్స్: అమెరికాలోని లాస్ ఏంజిల్స్ లో కార్చిచ్చు ఆగడం లేదు. వరుసగా రెండో రోజు బుధవారం కూడా అక్కడి అడవులు అంటుకున్నాయి. దీంతో తీవ్ర నష్టం జరిగింది. ఐదు ప్రదేశాల్లో దావానలం చెలరేగుతున్నట్లు అధికారులు చెప్పారు. ఈ కార్చిచ్చు వల్ల ఇప్పటికి ఐదుగురు మృతిచెందారు. అయిదు చోట్ల మంటల వల్ల సుమారు 27 వేల ఎకరాల అడవి ప్రాంతం తగలబడి పోతోంది. పాలిసేడ్స్, ఈటాన్ వద్ద భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. ఈ రెండు చోట్ల మంటల్ని ఆర్పడం ఇబ్బందిగా మారింది. శాన్ ఫెర్నాండో వ్యాలీలో మాత్రం కార్చిచ్చును అదుపు చేయడంలో అగ్నిమాపక సిబ్బంది విజయవంతమైంది. ఈటాన్ సిటీలో ఐదుగురు మృతిచెందారు. నగరం నుంచి సుమారు 1.37 లక్షల మంది ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ ప్రాంతానికి కిలో మీటరు దూరంలో రునియన్ కానియన్ వద్ద దావానలం వ్యాపించడంతో.. హాలీవుడ్ కొండల్లోని వీధులన్నీ రద్దీగా మారాయి. జనం భయంతో పరుగులు తీశారు. అనేక మంది హాలీవుడ్ సెలబ్రిటీల ఇళ్లు కూడా కాలిపోయాయి. మంటలపై నీళ్లు పోయడానికి తక్కువ ఎత్తులో ఎగురుతున్న హెలికాప్టర్ల భారీ శబ్దాలతో అక్కడ పరిస్థితి గందరగోళంగా తయారైంది. ప్రజలు సూట్‌కేసులు పట్టుకుని హోటళ్లు, నివాసాల నుంచి బయటకు వచ్చి కాలినడకన సురక్షిత ప్రాంతాలకు బయలుదేరారు. 1000 కంటే ఎక్కువ నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అందులో ఎక్కువగా ఇళ్లు ఉన్నాయి. లాస్‌ఏంజిల్స్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో 1.3 లక్షల మందిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. బుధవారం గాలుల తీవ్రత కాస్త తగ్గినా పరిస్థితి ఇంకా అదుపులోకి రాలేదు. పక్కరాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది మంది అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. అయితే నాలుగు చోట్ల భారీగా మంటలు చెలరేగుతున్నాయి. అరడజనుకు పైగా పాఠశాలలు కార్చిచ్చు ధాటికి దగ్ధమయ్యాయి. లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌కు పశ్చిమాన ఉన్న పసిఫిక్ తీరంలోని నివాస ప్రాంతాలను కార్చిచ్చు నేలమట్టం చేసింది. పసిఫిక్ పాలిసాడ్స్‌లోని నిత్యావసరాల దుకాణాలు, బ్యాంకులను శిథిలాలుగా మార్చింది. కొండలతో ఉన్న ఈ ప్రాంతంలో సెలబ్రెటీలు ఎక్కువగా నివాసం ఉంటారు. లాస్‌ఏంజిల్స్ చరిత్రలో ఇది అత్యంత విధ్వంసకరమైన అగ్నిప్రమాదంగా ఎల్‌ఏ కౌంటీ అగ్నిమాపక చీఫ్ ఆంథోనీ మర్రోన్ పేర్కొన్నారు. మంటలు చాలా వేగంగా విస్తరిస్తుండటంతో చాలా మంది తప్పించుకోవడానికి సమయం కూడా లేని పరిస్థితి ఏర్పడింది. కొందరు పోలీసుల పెట్రోలింగ్ కారులో ఆశ్రయం పొందారు. వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వారిని వీల్ ఛైర్లలో బయటకు తీసుకువచ్చారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్‌కు చెందిన మాలిబులోని అత్యంత విలాసవంతమైన మాన్షన్ పూర్తిగా దగ్ధమైపోయింది. ఇంటి ముందు ఉన్న ఖరీదైన కారు సైతం కాలి బూడిదైంది. ఈ మాన్షన్ ఖరీదు 15,800 అమెరికా డాలర్లుగా తెలుస్తోంది.

ఫెడరల్ ఎమర్జెన్సీ

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గవర్నర్ గవిన్ న్యూసమ్‌తో భేటీ అయ్యారు. శాంటా మోనికా అగ్నిమాపక కేంద్రానికి చేరుకున్న బైడెన్, కార్చిచ్చు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఫెడరల్ ఎమర్జెన్సీ ప్రకటనపై సంతకం చేశారు. అంతేకాకుండా సహాయక చర్యలు మరింత ముమ్మరం చేయడానికి నేషనల్ గార్డ్ దళాలను పంపించారు. అయితే, లాస్

ఏంజిల్స్‌లో అగ్నికీలలను అదుపు చేయడంలో విఫలమైన కాలిఫోర్నియా గవర్నర్ గవిన్‌న్యూసమ్ రాజీనామా చేయాలని కాబోయే అధ్యక్షుడు ట్రంప్ డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి వాటర్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన లోపాలను ఈ అగ్ని ప్రమాదాలు తెలియజేస్తున్నాయన్నారు.

మంటల్లో కాలిపోయిన ప్రముఖ ప్రాంతాలు

కార్చిచ్చు వ్యాప్తిస్తున్న నేపథ్యంలో అనేక హాలీవుడ్ స్టూడియోలు, ప్రొడక్షన్‌ను నిలిపివేశాయి. పసాదేనా, పసిఫిక్ పాలిసాడ్స్ మధ్య ఉన్న తమ థీమ్‌పార్క్‌ను యూనివర్సల్ స్టూడియోస్ మూసివేసింది. అధ్యక్షుడిగా జోబైడెన్ ఇటలీ, రోమ్‌లలో పర్యటించాల్సి ఉంది. తన పదవీకాలంలో చివరిదైన ఈ విదేశీ పర్యటనను రద్దు చేసుకొన్నట్లు శ్వేత సౌధం ప్రకటించింది. ఆయన లాస్‌ఏంజిల్స్‌లో పరిస్థితిని ప్రత్యక్షంగా సమీక్షిస్తుండటంతో విదేశీ పర్యటన రద్దు చేసుకున్నారు.

మెరుగైన రెవెన్యూ సేవలందిస్తాం: పొంగులేటి

'భూ భారతి'కి గవర్నర్ ఆమోద ముద్ర

విశాలాంధ్ర-హైదరాబాద్: చరిత్రాత్మక 'భూ భారతి-2024' చట్టానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోద ముద్ర పడటంతో వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మంత్రికి గురువారం అందజేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ చట్టాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ఈ చట్టానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు విస్తరించడానికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లపై ఫిర్యాదులకు ప్రత్యేక వెబ్ సైట్

ఇందిరమ్మ ఇళ్లపై ఫిర్యాదులకు ఏర్పాటు చేసిన indirammaindlu.telangana.gov.in ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రి మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 95శాతం పూర్తయిందని మంత్రి తెలిపారు. జీహెచ్‌ఎంసీలో 88శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి వివరించారు.

ఉచితాలపై నిర్ణయం ప్రజలదే: పనగాడియా

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వానిదే. ఆర్థిక సంఘం దీనికి సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాకపోతే స్థూల ఆర్థిక స్థిరత్వం ప్రయోజనాల దృష్ట్యా సమస్యకు సంబంధించిన అంశాన్ని లేవనెత్తవచ్చు. అంతే తప్ప రాష్ట్రాలు ఆ మొత్తాన్ని ఎలా ఖర్చు చేయాలో నియంత్రించే అధికారం కమిషన్‌కు లేదు' అని విలేకరుల సమావేశంలో ఎదురైన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.

ముంచుకొస్తున్న ఆహార కొరత

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడుతున్నాయన్నారు. భవిష్యత్తులో నీటి లభ్యత బాగా తగ్గుతుందని ఆయన చెప్పారు. భారత్, చైనా దేశాల్లో కోట్లాది మందికి ఇది ఆందోళనకర అంశమన్నారు. 140 కోట్లకు పైగా జనాభా కలిగిన భారత్‌లో వరి, గోధుమలు ప్రధాన ఆహారం. సగానికిపైగా పౌరులకు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ఈ ఆహార ధాన్యాలు చౌక ధరలో లభిస్తున్నాయి. దేశంలో 2023-24లో గోధుమ ఉత్పత్తి 113.9 మిలియన్ టన్నులుగా ఉంది. ఇది ప్రపంచ ఉత్పత్తిలో 14 శాతం. వరి ఉత్పత్తి 137 మిలియన్ టన్నులు. అయితే, నేషనల్ ఇన్నోవేషన్స్ ఇన్ క్లైమేట్ రెసిలియంట్ అగ్రికల్చర్ ప్రకారం 2100 నాటికి గోధుమ దిగుబడిలో 6-25 శాతం తగ్గుదల కనిపించే అవకాశముంది. వరి దిగుబడి 2050 నాటికి 7 శాతం, 2080 నాటికి 10 శాతం తగ్గుతుందని అంచనా వేసింది.

మోహన్‌బాబుకు సుప్రీంలో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆ ఆదేశాలను ఆయన పాటించలేదు. ఈ క్రమంలో మోహన్‌బాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ మెహన్‌బాబు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తన వయసు 78 ఏళ్లని, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నానని, అందువల్ల తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. దీనిపై గురువారం జస్టిస్ సుధాంశు ధులియా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ముందస్తు బెయిల్‌పై విచారణ పూర్తయ్యే వరకు మోహన్‌బాబును అరెస్టు చేయవద్దంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

రెండువేల మందిని నియంత్రించలేరా?

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేశారు. ఈ సందర్భంగా పద్మావతి పార్క్ ను పరిశీలిస్తూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్క్ లో లైటింగ్ సదుపాయం లేదని గుర్తించి అధికారులను నిలదీశారు. అక్కడనుండి పద్మావతి వైద్య కళాశాల వద్దకు చేరుకొని తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న భక్తులను పరామర్శించారు. ప్రతి ఒక్కరి దగ్గరకు వెళ్లి వారు చెప్పిన బాధలు విని ప్రతి ఒక్కరికీ క్షమాపణలు చెప్పారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులు చేసిన తప్పిదానికి మేమందరం నింద పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం దుర్ఘటన పట్ల ఎంతో కలత చెందారన్నారు. గరుడ సేవ రోజు 4 లక్షల మంది వస్తే సదుపాయాల కల్పిస్తున్న టీటీడీ అధికారులు... 2వేల మంది ఒకచోట చేరితే వారిని ఎందుకు నియంత్రించలేకపోయారో అర్థం కావడం లేదన్నారు. ఈ విషయమై కొందరు పోలీసులపై ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించారు. కొందరు కావాలని ఇలా చేశారని కూడా అనుమానాలు ఉన్నాయని...ఇవన్నీ విచారణలో వెల్లడవుతాయన్నారు. దానిని బట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు పోలీసులు బాగా పనిచేస్తే మరికొందరు నిర్లక్ష్యంగా పనిచేయడం వల్లే ఈ ఘటన జరిగిందని చెప్పారు. టీటీడీ అధికారులు బాధ్యతలు తీసుకొని మృతి చెందిన కుటుంబాలను స్వయంగా పరామర్శించి క్షమాపణ చెప్పి ఓదార్చాలని సూచించారు. టీటీడీ అధికారులు వీఐపీల మీదే కాదు సామాన్య భక్తుల పైన దృష్టి పెట్టాలని హితవు పలికారు. టీటీడీ అధికారులు, పాలకమండలి మధ్య సమన్వయ లోపం ఉందనే వాదన ఉందని, దీనిపై దృష్టి పెడతామని తెలిపారు. పవన్ కల్యాణ్ తో పాటు స్థానిక శాసనసభ్యులు శ్రీనివాసులు, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

చత్తీస్‌గఢ్‌లో భీకర ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

కిరణ్ చావన్ తెలిపారు. డీఆర్‌ఎస్ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), స్పెషల్ టాస్క్ ఫోర్స్, కోబ్రా సిబ్బంది ఉమ్మడిగా ఈ ఆపరేషన్ చేపట్టారని వివరించారు. కాగా, మూడు రోజుల క్రితం చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని పేలుళ్లకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లా భేద్రే కుట్రు రహదారిలో ఐఈడీలతో 15మంది డీఆర్‌జీ జవాన్లు ప్రయాణిస్తున్న పోలీస్ వాహనాన్ని పేల్చివేయడంతో 8 మంది జవాన్లతో పాటు డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి.

సమన్వయ లోపంతోనే దుర్ఘటన

(మొదటిపేజీ తరువాయి)

పొందుతున్న వారికి రూ.5 లక్షలు వంతున పరిహారం చెల్లించాలని రామకృష్ణ డిమాండు చేశారు. వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు కోసం వచ్చి... తిరుపతి నగరం బైరాగపట్టెడలో పద్మావతి పార్క్ వద్ద భక్తుల మధ్య జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన వారి భౌతికకాయాలకు రుయా ఆస్పత్రి శవాగారంలో నివాళులు అర్పించారు. మృతుల బంధువులతో రామకృష్ణ మాట్లాడారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. తొక్కిసలాటలో గాయపడి పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. తిరుపతి కలెక్టరు డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో మాట్లాడారు. తొక్కిసలాటకు సంబంధించి పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. పద్మావతి ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. వైద్యులు అందిస్తున్న సేవలు బాగున్నాయని రామకృష్ణ సంతృప్తి

వ్యక్తం చేశారు. అనంతరం రామకృష్ణ పాత్రికేయులతో మాట్లాడుతూ పవిత్ర హృదయంతో దేవుడి దర్శనానికి వచ్చి భక్తులు దుర్మరణం చెందడం బాధాకరమన్నారు. అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని ఉంటే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. టీటీడీ, పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపమే ఈ దుర్ఘటనకు కారణమన్నారు. ఈ దుర్ఘటన జరగకుండా చేయడానికి అన్ని రకాల అవకాశాలు ఉన్నాయన్నారు. టీటీడీ, పోలీసులు సకాలంలో సరైన చర్యలు చేపట్టకపోవడం వలనే ఆరుగురు ప్రాణాలు కోల్పోవలసి వచ్చిందని రామకృష్ణ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు బొల్లినేని రాజగోపాల్ నాయుడు సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నారని, అదే నిజమైతే ఈ దుర్ఘటన ఎలా జరిగిందని రామకృష్ణ ప్రశ్నించారు. సాధారణ భక్తులకు సరైన ప్రాధాన్యత లేదని భక్తులే చెబుతున్నారన్నారు. ప్రముఖులకే తిరుమలలో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. టీటీడీ అధికార యంత్రాంగం వీఐపీల సేవలో తరిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రణాళికాబద్ధంగా వైకుంఠ ద్వారదర్శనం టికెట్లు సామాన్య భక్తులకు అందచేసి ఉంటే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదని రామకృష్ణ అన్నారు. తిరుపతి దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జోక్యం చేసుకుని... సమగ్ర విచారణ జరిపి... బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు. లోపాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించాలన్నారు. తిరుమలకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నందున ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రామకృష్ణ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, రాష్ట్ర సమితి సభ్యులు డాక్టర్ జనార్దన్, తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, తిరుపతి నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌పై ప్రశ్నల వర్షం

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి స్థాయిలో ఏసీబీ విచారణకు సహకరించానన్నారు. 'నాకున్న అవగాహన మేరకు ఏసీబీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా. విచారణకు ఎప్పుడు పిలిచినా, ఎన్ని సార్లు పిలిచినా వచ్చి సహకరిస్తానని చెప్పా. మరలా ఎప్పుడు పిలుస్తారో తెలియదు. ఇది ఒక చెత్త కేసు. రాజకీయ ఒత్తిడితో మీరు ఏం చేస్తున్నారో కూడా మీకే తెలియడంలేదు, పూర్తిగా అసంబద్ధమైన కేసు అని అధికారులకు చెప్పా. నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు. కొత్తగా అడిగిందేమీ లేదు. పైసలు పంపాను అని నేనే చెబుతున్నాను. డబ్బులు వచ్చాయని వాళ్లు చెబుతున్నారు. ఇందులో అవినీతి ఎక్కడ జరిగిందని అడిగా' అని కేటీఆర్ తెలిపారు. మీడియాతో మాట్లాడుతుండగా డీసీపీ విజయ్ కుమార్ అభ్యంతరం తెలిపారు. మీడియాతో మాట్లాడితే భయమెందుకని కేటీఆర్... డీసీపీని ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని సూచించారు. పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టుకోవాలన్నారు. మీడియా ప్రతినిధులను పోలీసులు తోసేయడంతో... కేటీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఉదయం 10.10కి ఏసీబీ కార్యాలయానికి

ఫార్ములా-ఈ రేసులో తనపై నమోదైన కేసులో కేటీఆర్ ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఉదయం 10.10 గంటలకు ఆయన ఏసీబీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన వెంట న్యాయవాది రామచంద్రరావు ఉన్నారు. దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్ విచారిస్తుండగా ... జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షిస్తున్నారు. విచారణను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాదికి ఏర్పాట్లు చేశారు. ఫార్ములా ఈ- రేసు నిర్వహణకు అర్వింద్ కుమార్ ఇచ్చిన ఆదేశాలపై కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఇచ్చిన స్టేట్‌మెంట్, రికార్డ్ చేసిన అంశాల ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఒప్పందంలో కేటీఆర్ పాత్ర, విదేశీ సంస్థకు నగదు చెల్లింపుల్లో ఇచ్చిన ఆదేశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. కేటీఆర్ విచారణ దృష్ట్యా అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయం వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు.

ఇంకో వెయ్యి కేసులు పెట్టినా ఎదుర్కొంటాం

హైదరాబాద్ ప్రతిష్ఠను పెంచడానికి, బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర మంత్రిగా ఎన్నో ప్రయత్నాలు చేశానని కటీఆర్ అన్నారు. ఫార్ములా ఈ-రేస్ కేసులో ఏసీబీ విచారణకు హాజరయ్యేందుకు వెళ్లే ముందు నందినగర్‌లోని తన నివాసం వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. 'హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలపడానికి మంత్రిగా ఎన్నో ప్రయత్నాలు చేశాను. అవి చాలావరకు ఫలించాయి. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా మా బావమరుదులకు రూ.1,137 కోట్ల కాంట్రాక్టులు ఇచ్చే దౌర్భాగ్యపు పని చేయలేదు. మంత్రిగా ఉంటూ కుమారుడి కంపెనీకి కాంట్రాక్టులు ఇవ్వలేదు. దానికి ప్రతిఫలంగా ల్యాండ్ క్రూజర్ కార్లు కొనలేదు. ఆ తెలివితేటలు సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులకే ఉన్నాయి. నేను నిఖార్సయిన తెలంగాణ బిడ్డను... ఏ పని అయినా రాష్ట్రం కోసం, హైదరాబాద్ ప్రతిష్ఠ పెంచేందుకే చేశా. అరపైసా అవినీతి చేయలేదు... చేయబోను. కొంతమంది కాంగ్రెస్ నేతలు నాపై బురద చల్లి పబ్బం గడుపుకొంటున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై మేం మాట్లాడుతూనే ఉంటాం. కొట్లాడుతూనే ఉంటాం. లగచర్లలో రైతులను జైల్లో పెట్టినా... హైడ్రా పేరిట ఇళ్లు కూలగొట్టినా... ఆరు గ్యారంటీలు అమలు చేయకపోయినా అడుగడుగునా మేం నిలదీశాం. కేసులు పెట్టి ఆ అంశాలను పక్కదోవ పట్టిస్తున్నామనుకోవడం రేవంత్‌రెడ్డి వల్ల కాదు. ఎన్నికల్లో మీరిచ్చిన 420 హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటాం. ఇది కాదు.. ఇంకో వెయ్యి కేసులు పెట్టినా ఎదుర్కొంటాం. న్యాయస్థానాలు, చట్టాలు, రాజ్యాంగంపై మాకు సంపూర్ణ విశ్వాసం, గౌరవం ఉంది' అని కేటీఆర్ అన్నారు.

సుప్రీంలో కేటీఆర్‌కు చుక్కెదురు

ఫార్ములా-ఈ రేసు కేసు వ్యవహారంలో కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీనిపై తక్షణ విచారణ అవసరం లేదని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. ఈనెల 15న క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుపుతామని వెల్లడించింది.

ఈడీ విచారణకు అర్వింద్‌కుమార్

ఫార్ములా ఈ-రేసు కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ హాజరయ్యారు. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి ఆయన వెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈవో) సంస్థకు రూ.45.71 కోట్ల బదిలీపై అధికారులు ఆయనను ప్రశ్నించినట్టు తెలిసింది. మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అధికారులు భావిస్తున్నారు. ఆ కోణంలో అర్వింద్‌కుమార్‌ను విచారించారు.

ఇద్దరు అధికారులపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు ఆర్థిక సాయం, కాంట్రాక్టు ప్రాతిపదికన ఇంటికొక ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరికీ రూ.5 లక్షలు వంతున, స్వల్పంగా గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున సాయం అందిస్తామన్నారు. గాయపడిన వారందరికీ వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోలీసులు, టీటీడీ అధికారులు సమన్వయంతో పనిచేసుంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పద్మావతి పార్కు లోపల భక్తులను ఉంచడం సరైన నిర్ణయం కాదన్నారు. ఒకరోజు వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజుల పాటు కల్పించడం పై ఆగమ పండితులు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లోనూ క్యూ లైన్లు, వసతులు, ప్రసాదాలు వంటి వాటిపై సమీక్షిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా టీటీడీ సమీక్ష సమావేశాలు నిర్వహించి భవిష్యత్తులో కొన్ని కీలక నిర్ణయాలు చేయాలని సూచించారు. భక్తుల దర్శనం మరింత సులభతరం చేసుకునేందుకు సాంకేతికతను ఉపయోగిస్తామన్నారు.

బాధితులకు పరామర్శ

సీఎం చంద్రబాబు...తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరి దగ్గరికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే తొక్కిసలాటకు గల కారణాలను ఆరా తీశారు. వైకుంఠ ఏకాదశి టోకెన్లు తిరుపతిలో ఇవ్వడం బాగుందా? తిరుమలలో ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన సందర్భంగా సీఎం చంద్రబాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా ఏర్పాట్లపై టీటీడీ ఈవో శ్యామలరావు, ఎస్పీ సుబ్బరాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ లపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. పరిమితికి మించి పార్కు లోపలికి భక్తులను ఎలా అనుమతించారంటూ అధికారులను నిలదీశారు. టికెట్ల కోసం వచ్చే భక్తులు ఆత్రుతగా ఉంటారనే విషయాన్ని గ్రహించలేక పోవడం బాధాకరమన్నారు. ఇది క్షమించాల్సిన తప్పు కాదన్నారు. కొత్త పద్ధతులతో పనిచేస్తారని పంపిస్తే... ఇదేనా మీరు చేసేది అంటూ అధికారులపై సీరియస్ అయ్యారు. ఆన్‌లైన్‌లో ఎన్ని టోకెన్లు ఇచ్చారు, ఆఫ్ లైన్ లో ఎన్ని కేటాయించారు జాబితా ఇవ్వండి అంటూ ముఖ్యమంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతిగా పనిచేయడం నేర్చుకోవాలంటూ చురకలు అంటించారు. భక్తుల రద్దీ పెరుగుతుంటే టీటీడీ అధికారులు ఏం చేస్తున్నారు? ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకున్నప్పుడు దాన్ని సక్రమంగా నెరవేర్చాలని... తమాషా అనుకోవద్దు అంటూ అధికారులను హెచ్చరించారు. జేఈఓ గా మీ బాధ్యత ఏంటి? ఏం చేస్తున్నారు అంటూ జేఈవో గౌతమిని నిలదీశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలన్నారు. ముఖ్యమంత్రి తో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, సత్య కుమార్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

శంభు సరిహద్దులో రైతు ఆత్మహత్య

చండీగఢ్: పంజాబ్-హర్యానా మధ్య శంభు సరిహద్దు వద్ద రైతులు చేస్తున్న ఆందోళనలో అపశృతి చోటుచేసుకుంది. గురువారం రేషమ్ సింగ్ అనే 55ఏళ్ల రైతు విషపూరిత పదార్థం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రేషమ్ సింగ్‌ను పాటియాలాలోని రాజీంద్ర ఆసుపత్రిలో చేర్పించగా... అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఉదయం నిరసన స్థలంలోని లంగర్ సమీపంలో సింగ్ సల్ఫా విషపూరిత ద్రవం తాగాడు. ఇతర రైతులు ఈ విషయం తెలుసుకున్న వెంటనే సింగ్ కు అక్కడికక్కడే ప్రథమ చికిత్స అందించారు. ఆ తర్వాత ఆసుపత్రికి తరలించగా, అక్కడ మరణించారు. రేషమ్ సింగ్ తరన్ తరన్ జిల్లాలోని పహువింద్ నివాసి. శంభు, ఖనౌరి సరిహద్దులలో 11 నెలలుగా ఆందోళన జరుగుతున్నప్పటికీ రైతుల సమస్యలకు పరిష్కారం చూపకపోవడంతో రేషమ్‌సింగ్ కేంద్రప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారని రైతు నాయకుడు తేజ్‌వీర్ సింగ్ తెలిపారు. గత ఏడాది డిసెంబరు 18న కూడా ఇదే రీతిలో రంజోద్ సింగ్ అనే రైతు ఆత్మ హత్యకు పాల్పడ్డారు. మరోపక్క గురువారం ఖనౌరి సరిహద్దులో జరిగిన వేరొక ఘటనలో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డారు. భారీ గీజర్ పేలడంతో ఆ రైతు చేతులు, కాళ్లపై కాలిన గాయాలయ్యాయి. సమనాకు చెందిన గుర్దియాల్‌గా గుర్తించబడిన సదరు రైతును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నాడని ఓ రైతు నాయకుడు తెలిపారు. కాగా ఖనౌరీ సరిహద్దులో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దలేవాల్ పరిస్థితి విషమంగా ఉందని రైతు నాయకులు తెలిపారు. దలేవాల్ ఆమరణ నిరాహార దీక్ష గురువారం 45వ రోజుకు చేరుకుంది. ఆయన రక్తపోటు (బీపీ) నిరంతరం తగ్గుతోంది. బుధవారం దలేవాల్ ఆరోగ్యంపై బులెటిన్ విడుదల చేసిన వైద్యులు...ఆయన రక్తపోటు గణనీయంగా తగ్గుతోందని తెలిపారు. రక్తపోటును కొద్దిగా స్థిరీకరించడానికి, ఆయన కాళ్లను ఎత్తులో ఉంచాలని, ఆయన మాట్లాడటం కూడా కష్టంగా ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా జగ్జీత్ సింగ్ దలేవాల్ దీక్షకు సంఘీభావంగా జనవరి 10, శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలు దగ్ధం చేయాలని రైతు సంఘాలు పిలుపునిచ్చాయి.

డీఎస్పీ, డ్రైవర్ నిర్లక్ష్యం...

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే సిబ్బందితో వచ్చి భక్తులకు సాయం చేశారు. అంబులెన్స్ వాహనాన్ని టికెట్ కౌంటర్ బయట పార్క్ చేసి డ్రైవర్ వెళ్లిపోయాడు. సుమారు 20 నిమిషాల పాటు డ్రైవర్ అందుబాటులోకి రాలేదు. తొక్కిసలాటలో గాయపడ్డవారిని తరలించడానికి ఆలస్యమైందని తెలిపారు. డీఎస్పీ, అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు భక్తులు చనిపోయారు, మరి కొందరు గాయపడ్డారని ఆ నివేదికలో వెల్లడించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం ఉండవల్లి నివాసంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎస్ విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ ఘటనకు కారణమైన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశామని అధికారులు తెలిపారు. బాధ్యులు ఎవరనేది వెంటనే నిర్ధారణ చేయాలని ఆదేశించారు. బైరాగిపట్టెడ వద్ద లోపల ఉన్న ఒక మహిళకు గాలి ఆడక స్పృహ తప్పి పడిపోయిందని, ఆమెను కాపాడేందుకు అక్కడి డీఎస్పీ గేటు తీశారని పోలీసులు తమ నివేదికలో తెలిపారు. దర్శనం టికెట్లు కోసం గేటు తీశారని భావించి ఒక్కసారిగా భక్తులు బయటకు వచ్చారని చెప్పారు. సాయంత్రం 5 గంటల సమయంలో భక్తులు ఎక్కువ మంది వస్తున్నారని అధికారులకు స్థానిక జర్నలిస్టులు చెప్పారని, తొక్కిసలాట జరిగే ప్రమాదముందని చెప్పినప్పటికీ అధికారుల నుంచి సరైనరీతిలో ఎందుకు స్పందించలేదని సీఎం అధికారులను ప్రశ్నించారు. టీటీడీ ఈఓకు సమాచారం ఎప్పుడు వచ్చిందని చంద్రబాబు ప్రశ్నించారు. భక్తులకు ఏర్పాట్లపై మీ ప్లానింగ్ ఏమిటని అడిగారు. భక్తులు వస్తారని తెలిసి కూడా ముందు జాగ్రత్త చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారని నిలదీశారు. సమన్వయ కమిటీ సమావేశం ఎందుకు పెట్టలేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమాజానికి తీరని లోటు

(మొదటిపేజీ తరువాయి)

కావాలని అడిగే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రజలే ప్రధానమని ఆలోచించే కమ్యూనిస్టులు ఉండడం సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తిరగడమే కమ్యూనిస్టు కార్యకర్తల లక్షణమని, వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. రూ.రెండు కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టిన తర్వాతనే ఆహారపు అలవాట్లలో , వ్యవసాయ రంగంలో మార్పులు వచ్చాయని అన్నారు.

ఉద్యమం పునరేకీకరణ కావాలి: చాడ వెంకట్ రెడ్డి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టుల ఉద్యమం పునరేకీకరణ కావాలని, లేదంటే భవిష్యత్తు ఉండబోదన్నారు. కమ్యూనిస్టులే దేశానికి భవిష్యత్తు అని, వారు లేకుండా ప్రపంచమే లేదని అన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో విలువలు పడిపోయాయని, అంకితభావం లేదని, సేవా భావం అసలే లేదని, డబ్బులే పారిపాలిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏకమై ఉద్యమించాలి: జూలకంటి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులు ఏకమవ్వాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ దేశాల్లో కూడా వామపక్ష నాయకులు గెలుస్తున్నారని, పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎర్రజెండా, కమ్యూనిస్టు పార్టీలే ప్రత్యామ్నాయమని తెలిపారు. తెలంగాణలో బలమైన ఉద్యమాలను నిర్మించేందుకు సిద్ధమవ్వాలన్నారు. ఆర్‌ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ ఉన్న నాయకులు పోటు ప్రసాద్, బాలమల్లేష్ మరణం కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటు అని అన్నారు. సీపీఐ లిబరేషన్ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యంగా ఉద్యమించాలన్నారు. బాలమల్లేష్ సతీమణి వందన మాట్లాడుతూ బాలమల్లేష్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, కీసర వద్ద ఉన్న భూదాన్ బోర్డ్ భూముల సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలని కోరారు. పోటు ప్రసాద్ కుమారుడు సాకేత్ మాట్లాడుతూ కుటుంబం కంటే ఎక్కువగా ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతానికే 'నాన్న' ఎంతో కృషి చేశారన్నారు. ఐటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఒక ఇంజినీరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తొలుత సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్ రావు సభకు స్వాగతం పలికారు.

కూనంనేని చిత్రపటానికి పాలాభిషేకం

కార్పొరేషన్ ఏర్పాటుతో నియోజకవర్గ అభివృద్ధి : పల్లపోతు సాయి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : కొత్తగూడెం కార్పొరేషన్‌గా ఏర్పాటు అవడానికి కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నిలువెత్తు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. గురువారం పట్టణంలోని పెద్దబజారు లో మర్చంట్ అసోసియేషన్, హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేశారు. పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలతోపాటు సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామపంచాయతీలతో కలిపి కార్పొరేషన్ ఏర్పాటు కావడంతో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని యునైటెడ్ మర్చంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పల్లపోతు సాయి అన్నారు. కొత్తగూడెం ప్రాంత ప్రజలకు, వ్యాపారులకు ఊహించని కానుక అన్నారు. అభివృద్ధి కాముకుడు కూనంనేని ముందుగానే ఇక్కడి విభిన్న పరిస్థితులను గమనించి కార్పొరేషన్ సాధించిపెట్టారని తెలిపారు. అనతి కాలంలో కొత్తగూడెం ప్రాంతం నగరాలకు ధీటుగా అభివృద్ధి సాదిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో విమానాశ్రయం, హరిత హోటల్ అందుబాటులోకి రానున్నాయని సంతోషం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో వ్యాపార ప్రముఖులు చారుగుండ్ల మురళి, ప్రేమ్ కుమార్ కాండేల్వాల్, దామోదర్ దాస్ అతసీనియా, మనీష్ అగ్రవాల్, పల్లపోతు శ్రీనివాస్, కాపుగంటి శ్రీనివాస్, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, తరాల రాజు, మొగలి పాల్గొన్నారు.

అప్రెంటీస్ అభ్యర్థులకు స్థానికంగా సీట్లు కేటాయించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి సంస్థలో అప్రెంటిస్ శిక్షణ కోసం ఎంపిక చేస్తున్న అభ్యర్థులను ఏ ఏరియాకు చెందిన వారికి అదే ఏరియాలో సీట్లు కేటాయించాలని ఐఎన్టీయూసీ నేతలు కోరారు. గురువారం కొత్తగూడెంలో డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్ రెడ్డిని నాయకులు కలిసి మెమోరాండం సమర్పించారు. సింగరేణిలో అప్రెంటిస్ కోసం నియమిస్తున్న అభ్యర్థులను ఎక్కడి ఏరియా వాళ్ళకు అక్కడే కేటాయించడం పేద, మధ్యతరగతి విద్యార్థులకు వ్యాయాభారం తగ్గుతుందన్నారు. తమ సంఘం సెక్రటరీ జనరల్ ప్రసాద్ ఇప్పటికే ఉన్నతాధికారులు కలిసి చెప్పారని గుర్తు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డైరెక్టర్ పా ను కలిసి మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థులకు శిక్షణ సమయంలో కేవలం రూ.8 వేలు ఇస్తారని దూర ప్రాంతాల్లో నియమించడం వల్ల ఆర్థిక భారం అధికంగా పడుతుందన్నారు. తాము వివరించిన విషయాలపై డైరెక్టర్ సానుకూలంగా స్పందిచారని రజాక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతంబర్రావు, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ నాయకులు అభిషేక్, కలవలశ్రీనివాస్, సంజిత్, నక్కి, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

విశాలాంధ్ర - వనపర్తి : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డినీ, రావుల చంద్రశేఖర్ రెడ్డిని కొమ్ముల గట్టు శ్రీశ్రీశ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆహ్వానించారు. పెద్దమందడి మండలం జంగమయ్యపల్లి కొమ్ముల గట్టు శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుండి 19 వరకు జరుగుతాయని ఆలయ కమిటీ అర్చకులు, సభ్యులు తెలియజేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్యఅతిథిగా నిరంజన్‌రెడ్డిని రావుల చంద్రశేఖర్‌రెడ్డిని ఆహ్వానించారు. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు హాజరు అవుతానని అన్నారు. వాకిటి శ్రీధర్, చిట్యాల రాము పూజారి శ్రీనివాసులు, సరేష్ కుమార్, వార్డ్ మెంబెర్స్ యాదగిరి, రాములు యాదవ్, అబ్బా.కృష్ణయ్య, ఉండే కోటి నాగేంద్రం తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు లక్ష డప్పులు వేల గొంతులు పిలుపులో భాగంగా కొండమల్లేపల్లి మండలం వివిధ గ్రామాలలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలు వేస్తూ గురువారం కొండమల్లేపల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఎదుల ఎల్లయ్య మాదిగ ఆధ్వర్యంలో పెండ్లిపాకుల గ్రామంలో కమిటీ వేయడం జరిగింది. అధ్యక్షులుగా మాజీ ఎంపీటీసీ వస్కుల మహేష్ గ్రామ శాఖ అధ్యక్షులు వస్కుల కృష్ణయ్య ఉపాధ్యక్షులు వస్కుల చింటూ కార్యదర్శి కూర అనిల్ సహాయ కార్యదర్శి కోకల ఉపేందర్ మాదిగ, కోశాధికారి వసుకుల అనిల్ మాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి ఆదిరాల రమేష్, మండల సహాయ కార్యదర్శి కూర సాలయ్య, ఇద్దయ్య, శ్రీకాంత్, రవి, శేఖర్, వినోద్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - నల్లగొండబ్యూరో : మొదటిసారి ప్రసవం అయిన కేసుల విషయంలో ప్రసవం తర్వాత కూడా వైద్యులు వారిని పరీక్షిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి డాక్టర్లకు సూచించారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా, మర్రిగూడ 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి ఔట్ పేషెంట్ల వివరాలు, స్టాఫ్ వివరాలు, మందులు, ఆస్పత్రి ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు తదితర అంశాలను పరిశీలించారు. ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ప్రసవాలు, ఇమ్యునైజేషన్ వంటి వాటిపై అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో తగినంత మంది డాక్టర్లు, సిబ్బంది లేనందున ఇబ్బందిగా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ జిల్లా కలెక్టర్ దృష్టి తీసుకు రాగా, సాధ్యమైనంత త్వరగా ఖాళీలన్నింటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రసవమైన తర్వాత మొదటి కాన్పుల కేసుల విషయంలో పూర్తి జాగ్రత్తగా చూసుకోవాలని, ప్రసవం తర్వాత సైతం డాక్టర్లు ఫాలో చేయాలని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరిజన బాలర వసతి గృహాన్ని తనిఖీ చేయగా వార్డెన్ అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శించి 7వ తరగతి విద్యార్థులతో సైన్స్‌పై ప్రశ్నలు, జవాబులను అడిగారు. జిల్లా కలెక్టర్ వెంట చండూరు ఆర్డీవో శ్రీదేవి, సిహెచ్‌సి హాస్పిటల్ సూపరింటెండెంట్, ఇతర అధికారులు ఉన్నారు.

సీపీఐ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి: అయోధ్య

విశాలాంధ్ర - పినపాక : సీపీఐ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య కోరారు. సిపిఐ ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిందని దీనిని ఎవరు మర్చిపోకూడదని ఆయన గుర్తు చేశారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలు విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శిలు, మణుగూరు మండల పట్టణ, కార్యవర్గ సమావేశం రాయల బిక్షం అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా బి.అయోధ్య హాజరై మాట్లాడారు. పార్టీ వద్దేళ్ల నుంచి పేద ప్రజల పక్షపాతి పనిచేస్తున్నారు. కార్మిక, కర్షక, అనగారిన వర్గాల కోసం నిరంతరం పాటుపడేది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల కోసం వారి అభ్యున్నతి కోసం నిరంతరం వారితో ఉంటూ వారి కష్టసుఖాలలో భాగస్వామ్యం అవుతూ పోరాటం నిర్వహిస్తున్న సిపిఐ (ఎర్రజెండా) శతజయంతి ఉత్సవాలు దేశ వ్యాప్తంగా జరపడం మామూలు విషయం కాదన్నారు. అధికారం లేకుంటే కనుమరుగైపోతున్న అనేక పార్టీలు ఈ రోజు మనం చూస్తున్నామని అయోధ్య గుర్తు చేశారు. రాష్ట్రంలో నిజాం నవాబును ఎదురించి దొరల గడీలను బద్దలు కొట్టి, తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన సిపిఐ పది లక్షల ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీలు మనుగడలో ఉన్నంతవరకే పేదలకు న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీకుమారి, మణుగూరు నాయకులు దుగ్యాల సుధాకర్, ఎస్కే సర్వర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, అనంతనేని సురేష్, ముప్వ వెంకటేశ్వరరావు, పద్మనాభ రాజు, పేరాల శ్రీనివాస్, గడ్డం మనోహరా చారి, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, కామిశెట్టి రామారావు, రాయల బిక్షం, రాములు, రాజబాబు, బి.ప్రసాద్, వి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన గురుకుల ప్రిన్సిపాల్ కృష్ణయ్య

విశాలాంధ్ర - ఇల్లందు : ఇల్లందులోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ భీమనపల్లి కృష్ణయ్య, అటెండర్ రామకృష్ణలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ రమేష్, బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ టీచర్ సంధ్యారాణి నుంచి లంచం డిమాండ్ చేసి తీసుకునే క్రమంలో గురువారం ఏసీబీ అధికారులు వల పన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సుమారు రూ.లక్షన్నర వరకు జీతం పొందుతున్న కృష్ణయ్య కేవలం రూ.2 వేల కోసం ఏసీబీకి చిక్కటం భవిష్యత్తులో పెద్ద మచ్చగా మారింది. ఇటీవల కాలంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా లంచావతారాలు అనేక మందిని ఏసీబీ అధికారులు వరుసగా పట్టుకుంటున్న నేపథ్యం ఉంది. ఈ క్రమంలో ఆదర్శవంతమైన గౌరవప్రద వృత్తిలో ఉన్న ప్రిన్సిపాల్ లంచగొండిగా దొరకటం ఉపాధ్యాయ వర్గాల్లో విస్మయానికి గురి చేసింది. గురుకులంలో ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయురాలిగా అరకొర జీతం పై పని చేస్తున్న సంధ్యారాణి తన జీతం విడుదల చేయాలని ప్రిన్సిపాల్ కృష్ణయ్య ను అనేక దఫాలు అడిగింది. రూ.10 వేలు ఇస్తేనే బిల్లు చేస్తానని చెప్పడంతో ఆర్థిక పరిస్థితి బాగాలేని ఆ టీచర్ 2 వేలు వరకు ఇస్తానని బ్రతిమలాడి ఒప్పించింది. అతని అవినీతిపై ఆమె సాహసంగా ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. తొలుత ఆమె రూ.2వేలు నేరుగా ఇవ్వబోయింది. అటెండర్ రామకృష్ణకు ఇవ్వమని చెప్పడంతో ఆమె అటెండర్‌కు ఇస్తుండగా సమీపంలో ఉన్న ఏసీబి అధికారులు పట్టుకున్నారు. అవినీతిలో అటెండర్‌కు సంబంధం లేకపోయినా తనపై అధికారి కోసం బలయ్యాడని సమాచారం.

సీపీఐ శతవార్షికోత్సవ సభ విజయవంతం చేయాలి : విజయసారథి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్: ఈనెల 25న సిపిఐ శత వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో జనవరి 25న మానుకోట జిల్లా కేంద్రంలో వేలాది మందితో సిపిఐ శత వార్షికోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శత వార్షికోత్సవాల సందర్భంగా మానుకోట జిల్లా కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట స్మృతి చిహ్నం మరియు తీగల సత్యనారాయణ విగ్రహం ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్రానికి పూర్వం నుండి ఈ దేశంలో పేద ప్రజల కోసం కొట్లాడిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. ఈ సందర్భంగా ఈ దేశంలో 100 సంవత్సరాల గల ఏకైక పార్టీ సిపిఐ అన్నారు భారతదేశంలో త్యాగాలు చేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది సిపిఐ అన్నారు. పేద ప్రజల కోసం దోపిడీ లేని సమ సమాజ స్థాపన కోసం సిపిఐ పోరాటాలు చేసిందన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్మృతి చిహ్నాన్ని ఈ సందర్భంగా మానుకోట జిల్లా కేంద్రంలో ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వేలాదిమందిగా సిపిఐ శ్రేణులు శ్రేయోభిలాషులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వరిపల్లి వెంకన్న, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, ఆబోతు అశోక్, మాలోతు రవీందర్, వికాస్ అనిల్ పాల్గొన్నారు.

ఫెయిర్ అండ్ హ్యాండ్‌సమ్‌ను ప్రారంభించిన ఇమామి

కోల్‌కతా: పురుషులకు ముఖ, చర్మ సౌందర్యానికి అత్యద్భుతమైన బ్రాండ్ అనగానే మన అందరికి గుర్తుకు వచ్చేది ఫెయిర్ అండ్ హ్యాండ్ సమ్. ఈ ఫెయిర్ అండ్ హ్యాండ్ సమ్ బ్రాండ్ ఇమామి వారిది. ఇప్పుడు ఇమామి లిమిటెడ్ తన ఐకానిక్ మెన్స్ బ్రాండ్ అయిన ఫెయిర్ అండ్ హ్యాండ్ సమ్‌కు సరికొత్త గుర్తింపుని ఇచ్చేందుకు ఈ ఉత్పత్తిని స్మార్ట్ అండ్ హ్యాండ్ సమ్‌గా రీబ్రాండింగ్ చేస్తున్నట్లు ప్రకటించింది. బాలీవుడ్ హార్ట్ త్రోబ్ కార్తీక ఆర్యన్ ఇప్పుడు దీనికి కొత్త అంబాసిడర్‌గా మారాడు. ఈ కీలకమైన మార్పు చాలా సాహసోపేతమైన ముందడుగును సూచిస్తుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా పురుషుల సౌందర్య సాధనాల మార్కెట్లో బ్రాండ్ నాయకత్వాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. అంతేకాకుండా మరింత సమగ్రమైన సౌందర్య పద్ధతుల వైపు సాంస్కృతిక మార్పును ఇది స్వీకరించింది. మారుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలతో, నేటి యువకులు చర్మ ఆరోగ్యానికి మరియు సంపూర్ణ ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నారు. స్మార్ట్ అండ్ హ్యాండ్ సమ్ ఇప్పుడు వారి అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చేందుకు సిద్ధంగా ఉంది. ఈ బ్రాండ్‌కు సంబంధించిన కొత్త పొజిషనింగ్ స్టేట్‌మెంట్ 'హర్ రోజ్ హ్యాండ్సమ్ కోడ్'.

జీ తెలుగులో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - వరంగల్: జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా జీ వినియోగదారులకు సరికొత్త కార్యక్రమాలను సిద్ధమైందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతి సంబరాలకు వస్తున్నాం సినిమాను, 12వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పాన్ ఇండియా బిగ్గెస్ట్ బ్లాక్బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాను, 13 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమాలను ప్రసారం చేయనున్నామన్నారు. కాకినాడ వేదికగా జరిగిన 'సంక్రాంతి సంబరాలకి వస్తున్నాం' కార్యక్రమంలో జీ తెలుగు తారలతో పాటు ' విక్టరీ వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి పాల్గొని అభిమానులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన మోస్ట్ అవైటెడ్ గ్లోబల్ బ్లాక్ బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాని జీ తెలుగు అందిస్తోందన్నారు. ఈ సినిమా చూసే ప్రేక్షకులకు జీ తెలుగు వాచ్ అండ్ విన్ కాంటెస్ట్ని నిర్వహిస్తోందన్నారు. సంక్రాంతి సంబరాలకి కొనసాగింపుగా సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమం జరుగుతుంది. యాంకర్ రవి, వర్షిణి వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు, జీ తెలుగు తారలు అత్తలు, కోడళ్ల పేరున రెండు టీమ్‌లుగా ఏర్పడి వినోదం పంచేందుకు పోటీపడ్డారన్నారు.

సింగరేణి పాఠశాలల్లో ఆధునిక ప్రమాణాలు ఏర్పాటు చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి విద్యాసంస్థలు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తూ విద్యా ప్రమాణాలు పెంచడం ద్వారా ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని సింగరేణి వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకట్ అన్నారు. గురువారం వెంకట్ తోపాటు కార్పొరేట్ బ్రాంచ్ సెక్రటరీ యస్ వి.రమణ మూర్తి, ఇటీవల బాధ్యతలు చేపట్టిన సింగరేణి ఎడ్యుకేషన్ సెక్రటరీ గుండ శ్రీనివాస్‌తో కలసి కొత్తగూడెంలోని సింగరేణి హై స్కూల్ ని సందర్శించారు. వారు చాలా సేపు విద్యార్థులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎడ్యుకేషన్ సెక్రటరీగా శ్రీనివాస్ పదవి చేపట్టినప్పుడి నుండి తన వంతుగా సింగరేణి విద్యాసంస్థల అభివృద్ధికి చేస్తున్న కృషి గురించి అధ్యాపకులను వంగా వెంకట్ అడిగి తెలుసుకున్నారు. గతంలో కన్నా సింగరేణి హై స్కూళ్లలో మెరుగైన సౌకర్యాలను గుర్తించడం జరిగిందన్నారు. సింగరేణి యాజమాన్యం అమలు చేయబోతున్న సిబియస్‌సి పాఠశాల పురోగతి గురించి శ్రీనివాస్ ఈ సందర్భంగా వివరించారు. ఈ అకాడమిక్‌లో గోదావరిఖనిలో ప్రవేశపెట్టడానికి అన్ని చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. సత్తుపల్లిలో పని చేస్తున్న కార్మికుల పిల్లల విద్యావసరాల కోసం అక్కడ ఒక హై స్కూల్ని ఏర్పాటుకు సూచన చేయడం జరిగిందన్నారు. కొత్తగూడెం స్కూల్‌లో పిల్లల భోజనశాలను, గార్డెన్‌ని అభివృద్ధి చేయాలని, ఇంకా సిబ్బందిని పెంచి రోజు చెత్తను, మురికి కాలువలను శుభ్రం చేయించాలని కోరగా శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన ప్రభుత్వం

విశాలాంధ్ర - గార్ల : అధికారం కోసం ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయడంలో విఫలమైందని సిపిఎం పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట పథకాల అమలుకై సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యారెంటీలను క్షేత్ర స్థాయిలో అమలు చేసేంత వరకు పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రజా పోరాటాల ఫలితంగా కోట్లు వెచ్చించి నిర్మించిన ఇక్కడి 30 పడకల అప్ గ్రేడ్ ఆసుపత్రిలో సరైన వైద్యం అందక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గార్ల, రాంపురం పాకాల వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని, గార్ల రైల్వేస్టేషన్‌లో శాతవాహన, ఇంటర్ సిటీ, లింకు ఎక్స్ప్రెస్ రైళ్లను ఆగేలా ఏర్పాటు చేయాలనీ కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ మంగమ్మలకు అందజేశారు. మండల నాయకులు కె.ఈశ్వర్ లింగం, వి.పి వెంకటేశ్వర్లు, ఎ.వీరాస్వామి, యం.నాగమణి, బి.లోకేశ్వరావు, ఎస్.కె. మౌలానా, జె.సత్యం, కై.బాబు, వి.కొండయ్య, వి.పద్మ,ఎస్. నాగరాజు, వెంకటరెడ్డి, వీరభద్రం, మల్లయ్య, ప్రవీణ్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ-ఎఫిషియెంట్ గల 5 బజాజ్ వాటర్ హీటర్లు విడుదల

ముంబయి: బజాజ్ విద్యుత్ భారం కాకుండా, హాయిగా వెచ్చదనాన్ని అందించేందుకు తయారు చేసిన ఎనర్జీ-ఎఫిషియెంట్, సమర్థవంతమైన వాటర్ హీటర్ల శ్రేణిని అందిస్తున్నది. బజాజ్ వాటర్ హీటర్‌లు స్థిరమైన సౌకర్యాన్ని అందిస్తాయి. అదే సమయంలో విద్యుత్తును ఆదాచేయడంలో సహాయపడతాయి. శీతాకాలాన్ని వెచ్చగా, బడ్జెట్‌కు అనుకూలంగా మారుస్తాయి. మన్నిక లేదా స్థోమతపై రాజీపడకుండా విభిన్న అవసరాలను తీర్చేలా తయారయ్యాయి. ఈ సీజన్‌లో పరిగణించవలసిన అత్యుత్తమ వాటర్ హీటర్ల నమూనాలు విడుదలయ్యాయి. వాటిలో మొదటిది బజాజ్ ఎటర్నల్ సిరీస్ పెంటకిల్ డిజి 15లీ. ఇది డిజిటల్ ప్రెసిషన్‌తో కూడిన స్మార్ట్ వాటర్ హీటర్. రెండోది బజాజ్ ఆర్మర్ సిరీస్ కాంటెంపో. ఇది స్టైలిష్ ప్యాకేజీలో వేగవంతమైన వేడిని అందిస్తుంది. మూడోది బజాజ్ ఎండ్యూర్ సిరీస్ గ్రాసియో స్టోరేజ్ వాటర్ హీటర్. ఇది స్టైలిష్, ఎఫిషియెంట్ వాటర్ హీటర్‌గా గుర్తింపు పొందింది. నాల్గవది బజాజ్ షీల్డ్ ఇమ్మోర్టో స్టోరేజ్ వాటర్ హీటర్. ఇది దీర్ఘకాలికసామర్థ్యం కలిగి ఉంటుంది. ఐదవది బజాజ్ షీల్డ్ సిరీస్ క్రెస్ట్ ప్లస్ వాటర్ హీటర్. ఇది ప్రతి ఇంటికి అవసరమైన సామర్థ్యం కల్పిస్తుంది.

నష్టాల కారణంగానే టీజీబీసీఎల్‌కు యుబిఎల్ సరఫరా నిలిపివేత

హైదరాబాద్: తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్)కి తమ సరఫరాలను నిలిపివేయడం గురించి నిన్న విడుదల చేసిన ప్రకటన గురించి యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ ప్రతినిధులు గురువారం మరింత స్పష్టతనిచ్చారు. రాష్ట్రంలో స్థిరంగా పెరుగుతున్న తమ నిర్వహణ నష్టాల కారణంగా మా ప్రస్తుత ప్రాథమిక ధరలు టీజీబీసీఎల్ కి 2019 లో మేము సమర్పించిన ఖర్చులపై ఆధారపడి ఉన్నాయన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఈ ప్రాథమిక ధరలలో తదుపరి సవరణలు లేవని, గత 5 సంవత్సరాలుగా మేము నిత్యావసరాలు మరియు కార్యకలాపాల ఖర్చులో అధిక వార్షిక ద్రవ్యోల్బణాన్ని చూశాము ఫలితంగా మేము గత చాలా నెలలుగా నష్టాలతోనే టీజీబీసీఎల్ కి కి సరఫరా చేస్తున్నామన్నారు. గత సంవత్సర కాలంగా మేము టీజీబీసీఎల్ తో అనేక సమావేశాలలో ధర సవరణల ఆలస్యం గురించిన సమస్యను తెలియజేసాము ప్రభుత్వానికి అధికారికంగా ఈ సమస్య గురించి యు బీఎల్ నుంచి అభ్యర్థనలను కూడా అందించామని చెప్పారు. ప్రస్తుత ప్రాథమిక ధరల స్థాయిల క్రింద మా కార్యకలాపాల నిర్వహణ లో లాభదాయకత లేకపోవడం తో పాటుగా ధరల సవరణ తక్షణ అవసరాన్ని సైతం వెల్లడించామన్నారు.

ఇమ్‌టెక్స్, టూల్‌టెక్ ఎక్స్‌పోలకు రంగం సిద్ధం

బెంగళూరు: భారతదేశంలో తయారీ వ్యవస్థ ప్రాముఖ్యమైన పురోగతిని అనుభవిస్తోంది, ఇది భవిష్యత్తును ఆకృతులు చేస్తున్న అధునాతన టెక్నాలజీలతో ప్రయోజనపడుతోంది. ఇమ్‌టెక్స్ 2025, టూల్‌టెక్ 2025, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ 2025, 23 నుంచి 29 జనవరి 2025 వరకు బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగనుంది. ఈ కార్యక్రమం పరిశ్రమ నాయకులు, టెక్నాలజీ అభిరుచి గల వారి కోసం అత్యుత్తమ వేదికను అందిస్తుంది. అక్కడ వారు మెషీన్ టూల్ పరిశ్రమలోని తాజా అభివృద్ధులను ప్రదర్శిస్తారు. 90,000 చదరపు మీటర్ల ప్రదర్శనస్థలంతో 8 హాళ్లలో ఇమ్‌టెక్స్ 2025 ఇప్పుడు వరకు అత్యంత పెద్ద ఆవృతిగా ఉండబోతుంది. ఈ ప్రదర్శన 23 దేశాల నుండి 1,100కి పైగా ప్రదర్శకులను అందిస్తుంది. వారు మెషీన్ల ప్రత్యక్ష ప్రదర్శనలను, కొత్త ఉత్పత్తి లాంచ్లను, మెషీన్ టూల్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు సంబంధించిన టెక్నాలజీ ప్రదర్శనలను చూపిస్తారు. జర్మనీ, ఇటలీ, జపాన్, కొరియా, స్పెయిన్, తైవాన్, అమెరికా వంటి దేశాలు వారి టెక్నాలజీ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ప్రత్యేక పవిలియన్లతో పాల్గొంటున్నాయి.

జనవరి 16న సోనీ లివ్‌లో జోజు జార్జ్ చిత్రం 'పానీ'

ముంబయి: జోజు జార్జ్ తొలిసారిగా దర్శకత్వం వహించిన చిత్రం 'పానీ'. ఒక సంఘటన సాధారణ జీవితాన్ని ఛిన్నాభిన్నం చేస్తుంది, దాచిన రహస్యాలను బహిర్గతం చేస్తుంది, విధేయతలను పరీక్షిస్తుంది మరియు వారి లోతైన భయాలను ఎదుర్కొనేందుకు అద్భుతమైన పాత్రలతో ప్రేక్షకులను గ్రిప్పింగ్ జర్నీలో తీసుకువెళుతుంది. నీడల నుండి నిజం బయటపడుతుందా లేదా దానిని బహిర్గతం చేసి సమయంలో వారు ప్రియమైన వారిని దూరం చేస్తుందా? థియేటర్లలో విజయవంతమైన తర్వాత, పానీ ఇప్పుడు జనవరి 16 నుండి ప్రత్యేకంగా సోనీ లివ్‌లో ప్రదర్శించబడుతుంది. దర్శకుడు, రచయిత, నటుడి పాత్రలను పోషిస్తున్న జోజు జార్జ్‌తో పాటు, సాగర్ సూర్య, జునైజ్ వీపీ, బాబీ కురియన్, అభినయ, అభయ హిరణ్మయి, సీమా, చాందిని శ్రీధరన్, ప్రశాంత్ అలెగ్జాండర్, సుజిత్ శంకర్, రినోష్ జార్జ్‌లతో సహా ఆకట్టుకునే సమిష్టి తారాగణం కీలక పాత్రలలో నటించింది.

టాటా మోటార్స్ గ్రూప్ గ్లోబల్ హోల్‌సేల్స్ 341,791

ముంబయి: జాగ్వార్ ల్యాండ్ రోవర్‌తో సహా టాటా మోటార్స్ గ్రూప్ గ్లోబల్ హెూల్‌సేల్స్ 341,791గా ఉన్నాయి, ఇది క్యూ3 ఎఫ్‌వై24తో పోలిస్తే 1% ఎక్కువ. 2025 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో టాటా మోటార్స్ వాణిజ్య వాహనాలు, టాటా దేవూ శ్రేణి గ్లోబల్ హెూల్‌సేల్స్ 97,535గా ఉన్నాయి, ఇది క్యూ3 ఎఫ్‌వై24తో పోలిస్తే 1% తక్కువ. 2025 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహనాల గ్లోబల్ హెూల్‌సేల్స్ 139,829గా ఉన్నాయి, ఇది క్యూ3 ఎఫ్‌వై24తో పోలిస్తే 1% ఎక్కువ. 2025 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహనాల గ్లోబల్ హెూల్‌సేల్స్ 104,427 వాహనాలు, ఇది క్యూ3 ఎఫ్‌వై24తో పోలిస్తే 3% ఎక్కువ. ఈ త్రైమాసికంలో జాగ్వార్ హెూల్‌సేల్స్ 5,604 వాహనాలు కాగా, ఈ త్రైమాసికంలో ల్యాండ్ రోవర్ హెూల్‌సేల్స్ 98,823 వాహనాలు. టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహనాలలో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు కూడా ఉన్నాయి.

సిబిడిటి ప్రత్యక్ష పన్ను వసూలు వ్యవస్థలోకి ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్

ముంబయి: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సిబిడిటి), భారత ప్రభుత్వం తరపున ప్రత్యక్ష పన్ను వసూలు చేయడానికి ఆదాయపు పన్ను పోర్టల్‌తో తమ ఏకీకరణ పూర్తయినట్లు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ వెల్లడించింది. డౌన్‌లోడ్ చేయగల చలాన్‌లు, సులభమైన చెల్లింపులు, తక్షణ చెల్లింపు నిర్ధారణలకు సులభంగా పొందటంతో పాటుగా బ్యాంక్ కస్టమర్‌లు ఇప్పుడు వారి ప్రత్యక్ష పన్నులను చెల్లించడం కోసం స్పష్టమైన, సౌకర్యవంతమైన చెల్లింపు అనుభవం నుండి ప్రయోజనం పొందవచ్చు. బ్యాంక్ కస్టమర్లు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ వినియోగదారు-స్నేహపూర్వక రిటైల్, కార్పొరేట్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించవచ్చు లేదా నగదు, చెక్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ఉపయోగించి ఏదైనా ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ శాఖలో పన్నులు చెల్లించవచ్చు. ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ రిటైల్ లయబిలిటీస్ కంట్రీ హెడ్ చిన్మయ్ ధోబ్లే మాట్లాడుతూ, తాము యూనివర్సల్ బ్యాంకింగ్‌కు ప్రాతినిధ్యం వహించడానికి పూర్తి స్థాయి ఉత్పత్తులు, సేవలను రూపొందిస్తున్నామని అన్నారు.

రెడ్‌మీ 14సీ 5జీ ఆవిష్కరణ

ముంబయి: దేశంలో అత్యంత విశ్వసనీయ స్మార్ట్‌ఫోన్ ఎక్స్ అలాట్ బ్రాండ్ షౌమీ ఇండియా బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లో ఆవిష్కరణలను పునర్‌నిర్వచిస్తూ అంతర్జాతీయంగా సరికొత్త ఫోన్ రెడ్‌మీ 14సీ 5జీని ఆవిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. అత్యాధునిక ఫీచర్లు, నిరంతరాయ పనితీరు, అత్యంత వేగవంతమైన 5జీ కనెక్టివిటీ అందించేలా డిజైన్ చేసిన రెడ్‌మీ 14సీ 5జీ పెరుగుతున్న భారతీయ వినియోగదారుల అవసరాలు తీర్చేందుకు సిద్ధంగా ఉంది. భారత్‌లో రెడ్‌మీ నోట్ 14 5జీ సిరీస్ ఆవిష్కరించిన కేవలం రెండు వారాల్లోపే రూ.1000 కోట్ల ఆదాయ మైలురాయిని దాటి తిరుగులేని విజయం సాధించిన సందర్భంగా దానికి అనుబంధంగా ఈ రెడ్‌మీ 14సీ 5జీ విడుదల జరుగుతోంది. ధర, లభ్యత: రెడ్‌మీ 14సీ 5జీ జనవరి 10, 2025 నుంచి ఎంఐ.కామ్, అమెజాన్.ఇన్, ఫ్లిప్ కార్ట్, అధీకృత షౌమీ రిటెయిల్ భాగస్వాముల దగ్గర లభిస్తుంది. 4జీబీ+64జీబీ రకం రూ.9,999కి, 4జీబీ+128జీబీ రకం రూ.11,999కి, 6జీబీ+128జీబీ రకం రూ.11.999కి లభిస్తుంది.

డ్రైవర్ల ఆరోగ్యం, శ్రేయస్సుకు 5 ఆరోగ్య శిబిరాలు

ముంబయి: కోటక్ మహీంద్రా బ్యాంక్ దేశ వాణిజ్య ఆరోగ్యాన్ని శ్రేయస్సును ప్రోత్సహించడానికి అంకితమైన దాని ప్రభావంతమైన సీఎస్ఆర్ చొరవ 'సెహత్ కా సఫర్' మూడవ ఎడిషన్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ఏడాది చొరవ మునుపటి ఎడిషన్‌లోని 30 స్థానాల నుండి 45 వ్యూహాత్మక స్థానాలకు విస్తరించింది. ఉచిత ఆరోగ్య తనిఖీ శిబిరాలతో సుమారు 4000 ట్రక్ డ్రైవర్లకు ప్రయోజనం చేకూరుతుంది. దుదియాజన్, దుర్గాపూర్, పాట్నా, ఢిల్లీ, కోయంబత్తూరు, భోపాల్, మరిన్ని కీలక నగరాల్లో అధిక సాంద్రత కలిగిన రవాణా కేంద్రాల్లో నిర్వహించిన ఈ శిబిరాలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న డ్రైవర్ల జీవితాలను మెరుగుపర్చడంలో కోటక్ నిబద్ధతను బలపరుస్తాయి. ఆరోగ్య పరీక్షలతో పాటు శిబిరాల వద్ద కౌన్సిలర్లు రోజువారీ ఆరోగ్య పద్ధతులపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తారు.

25 కోట్ల కిలోమీటర్ల దూరం ప్రయాణించిన టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ బస్సులు

ముంబయి: భారతదేశంలోని అతిపెద్ద వాణిజ్య వాహనాల తయారీ సంస్థ టాటా మోటార్స్ 10 నగరాల్లో సురక్షితమైన, సౌకర్యవంతమైన, సులభమైన ప్రజా రవాణాను అందించే 3,100 ఎలక్ట్రిక్ బస్సుల సముదాయం మొత్తం చుట్టుకొలతతో సమానమైన 25 కోట్ల కిలోమీటర్లకు పైగా ప్రయాణించినట్లు ప్రకటించింది-ఇది భూమి చుట్టూ 6,200 సార్లు ప్రయాణించడానికి సమానం! రోజుకు సగటున 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ-బస్సులు వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో, ప్రతి నగరంలో హరిత సామూహిక చలనశీలతను అందించడంలో అపారమైన సహకారాన్ని అందించాయి. మొత్తంమీద, టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ బస్సులు 25 కోట్ల కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేస్తూ 1.4 లక్షల టన్నుల సీఓ2 టెయిల్ పైప్ ఉద్గారాలను ఆదా చేయడంలో సహాయపడ్డాయని టీఎంఎల్ స్మార్ట్ సిటీ మొబిలిటీ సొల్యూషన్స్ లిమిటెడ్ సీఈవో అసిమ్ కుమార్ ముఖోపాధ్యాయ తెలిపారు.

టాటా ప్లే 'సిర్ఫ్ లగే మెహెంగా' క్యాంపెయిన్ ప్రారంభం

ముంబయి: భారతదేశంలోని ప్రముఖ డైరెక్ట్ టు హెూమ్ (డీటీహెచ్) ప్రొవైడర్ టాటా ప్లే, కొత్త ఏడాది, పంటల, పండగల సీజన్‌ను పురస్కరించుకుని 'సిర్ఫ్ లగే మెహెంగా' (అనుకునేందుకే ధర ఎక్కువ) కేవలం అనే సరికొత్త క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. కుటుంబంలోని ప్రతి సభ్యుని ఎంపికలకు అనుగుణంగా, వినోదం, వార్తలు, క్రీడలు, సంగీతం, సినిమాలు, భక్తి, కిడ్స్, తదితర కళా ప్రక్రియలతో సహా విస్తృతమైన, బడ్జెట్-ఫ్రెండ్లీ, అధిక నాణ్యతతో కూడిన వినోద అనుభవాన్ని టాటా ప్లే తెలుగు సూపర్ వాల్యూ ప్యాక్ అందిస్తుంది. ఓగిల్వీ తెరకెక్కించిన 'సిర్ఫ్ లగే మెహెంగా' క్యాంపెయిన్‌ను డీటీహెచ్ సేవలు ఖరీదైనవి అనే అపోహను హాస్యాస్పదంగా తొలగించే ఓవర్ స్టేట్‌మెంట్ పేరడీ చిత్రాల శ్రేణిని ప్రదర్శిస్తుంది. టాటా ప్లే ప్రపంచ స్థాయి వినోదాన్ని సరసమైన ధరకు ఎలా అందజేస్తుందో, రాజీలేని వీక్షణ అనుభవాన్ని ఎలా అందజేస్తుందో ఈ వాణిజ్య ప్రచార చిత్రాలు హైలైట్ చేస్తాయి.

సంపాదకీయం

నిర్లక్ష్యపూరితం

'ఇప్పటికిప్పుడు చింతించడం తప్ప చేసేదేమీ లేదు' అని తిరుపతి బైరాగిపట్టెడలో బుధవారం రాత్రి సంభవించిన తొక్కిసలాట ఘటనపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు చేసిన వ్యాఖ్యలు తన నిర్లక్ష్యపూరిత వైఖరికి నిదర్శనం. సహజంగా ఇలాంటి ఉదంతాల్లో బాధ్యులు, అధికారులు అనవసర హైరానా చేస్తూ ఉంటారు. దాన్నే చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమని పిలుస్తారు. కానీ ఇక్కడ టీటీడీ వాళ్లు ఆకులు కాలాక చేతులు దులుపుకునే పనిలో పడ్డారు. పొరపాటు జరిగిపోయిందని చెపుతున్నా, ఘటనకు నైతిక బాధ్యత మాత్రం వహించడం లేదు. పైగా పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని ప్రత్యారోపణలు చేస్తున్నారు. పోలీసులు కూడా టీటీడీ అలసత్వమే ఈ ఘటనకు కారణమని నిందించారు. నిజానికి ఈ ఘటనకు ఇటు టీటీడీ, అటు పోలీసులూ... ఇరువురూ బాధ్యులే. వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శన కౌంటర్లలో అరకొర ఏర్పాట్లతో టీటీడీ అలక్ష్యం ప్రదర్శించగా, డీఎస్పీ దగ్గరుండి భక్తులను సినిమా టిక్కెట్ల కోసం విడిచిపెట్టినట్లు ఒక్కసారిగా కౌంటర్‌లోకి వదిలేయడం తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు తమ తోటిభక్తుల పాదాల కింద నలిగిపోయి ప్రాణాలు కోల్పోగా, సుమారు 50 మంది గాయపడ్డారు.

భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రాతిపదికగా చూసుకుంటే, అత్యధికంగా పుష్కరాలు, కుంభమేళాలు, తిరునాళ్లు, జాతరలు, గుళ్లు గోపురాల వద్దనే జనసందోహం పెద్దసంఖ్యలో ఉంటుంది. వాస్తవానికి ఇవేవీ కొత్తగా వచ్చే కార్యక్రమాలు కావు. ఇలాంటివి ప్రతియేటా ఉంటాయి. కొన్ని కార్యక్రమాలు నిర్దిష్ట కాలవ్యవధిలో వస్తూ ఉంటాయి. అయినా వాటి నిర్వహణలో ప్రభుత్వాలు నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తూనే ఉంటాయి. కుంభమేళాలు ప్రతి మూడేళ్లకో, ఆరేళ్లకో వస్తూ ఉంటాయి. నక్షత్రాల కదలిక, కలయికకు దైవత్వాలను జోడించి, సందర్భం వచ్చిన ప్రతిసారీ కుంభమేళా నిర్వహిస్తారు. ఇప్పటివరకు 9 కుంభమేళాల్లో భారీ తొక్కిసలాటలు సంభవించాయి. ఇవన్నీ భక్తుల మూఢత్వం వల్లనే జరిగాయని నిందించడం కన్నా ప్రభుత్వాల ఏర్పాట్లలో వైఫల్యం కారణంగానే జరిగాయని చెప్పడం సబబు. వందకోట్ల మంది భక్తులను ఇప్పటికిప్పుడు చైతన్యపరిచి ఇలాంటి సామూహిక సందర్భాలకు, గంపగుత్త కార్యక్రమాలకు వెళ్లవద్దని చెప్పలేం, వారిని నివారించలేం. కనీసం సరైన ఏర్పాట్లు నిర్వహించి, ప్రాణనష్టం కలగకుండా చేయగలిగితే గొప్ప విషయమే అవుతుంది. ప్రకృతిని నిందించడానికి ఇదేదో భూకంపమో, సునామీనో, గాలివానో, తుఫానో కాదు. పక్కా మానవ తప్పిదం వల్ల జరిగే మానవ హననాలివి.

2013లో కేదార్‌నాథ్ ఆలయం వద్ద సంభవించిన తొక్కిసలాటలో అత్యధికంగా 6 వేల మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. 70 ఏళ్ల క్రితం 1954లో అలహాబాద్ కుంభమేళా తొక్కిసలాటలో 800 మంది భక్తులు మరణించారు. అంతకుముందు, 1820, 1840లలో హరిద్వార్, అలహాబాద్ కుంభమేళాల్లో వరుసగా 430 మంది, 50 మంది మరణించారు. అప్పటినుంచి ప్రతి కుంభమేళాలోనూ చిన్నదో పెద్దదో తొక్కిసలాట జరుగుతూనే ఉంటుంది. మహారాష్ట్రలోని సతారాలో గల మంధేర్‌దేవి ఆలయంలో 2005లో 291 మంది భక్తులు నుగ్గునుగ్గు అయిన ఉదంతం ఇంకా మన కళ్లముందు కదలాడుతూనే ఉంది. జోధ్‌పూర్ (రాజస్థాన్)లో చాముండీదేవి గుడిలో 2008లో భయానక తొక్కిసలాటలో 224 మంది చనిపోయారు. రతంగఢ్ మాతా మందిరం (2013) ఘటనలో 115 మంది, శబరిమల (2011) దుర్ఘటనలో 102 మంది, నైనా దేవి మందిరం (2008) ఉదంతంలో 146 మంది.. ఇలా ఒకటేమిటి, అతిభక్తితో పారవశ్యంలో భక్తులు మునిగిపోయే ప్రతి సందర్భంలోనూ తొక్కిసలాట జరుగుతూనే ఉంది. 2015 జులై 14వ తేదీన రాజమండ్రిలో గోదావరి పుష్కరాల సందర్భంలో జరిగిన తొక్కిసలాటలో 29 మంది మరణించగా, 60 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరు నేటికీ వికలాంగులుగా కాళ్లీడుస్తూ బతుకుబండి సాగించడం బాధాకరం. అంతెందుకు? సరిగ్గా 16 ఏళ్ల క్రితం 2008 జనవరి 4వ తేదీన విజయవాడ కనకదుర్గ గుడిపై జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, 20 మంది గాయపడ్డారు. చరిత్ర తిరగేసేకొద్దీ, మనకు కనిపించే భక్తసమూహ జాతరలన్నీ రక్తంతో తడిసి ముద్దయినవే. దుర్ఘటనలు జరిగిన ప్రతిసారీ పాలకులూ, పాలక మండళ్లూ నష్టపరిహారం చెల్లించి చేతులు కడుక్కోవడమే తప్ప పటిష్టమైన, ప్రణాళికాబద్ధమైన ఏర్పాట్లు చేసిన సందర్భాలు చాలా అరుదు.

తిరుపతి బైరాగిపట్టెడ తొక్కిసలాట ఘటన సైతం ఈ కోవకే చెందుతుంది. ఈ ఘటన వివరాల పొందికను సాంతం పరిశీలిస్తే టీటీడీ ఏర్పాట్లలో లొసుగులు, భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. టీటీడీ పాలకమండలి నిర్లక్ష్య వైఖరిని ఇది తేటతెల్లం చేస్తుంది. ప్రతియేటా తిరుమలలో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీకి 9 కేంద్రాల్లో 10 కౌంటర్లు చొప్పున ఏర్పాటు చేస్తారు. ఇవి స్థానికుల కోసం ఉద్దేశించినవి. ఇతర ప్రాంతాలవారు వచ్చి అడిగినా టిక్కెట్లు ఇస్తారు. కానీ ఈసారి టికెట్లు లేనివారిని కొండపైకి అనుమతించబోమని టీటీడీ ప్రకటించడంతో తమిళనాడు, ఏపీ, తెలంగాణ భక్తులంతా తిరుపతి టికెట్ల కేంద్రాలపైనే ఆధారపడ్డారు. గంటగంటకూ భక్తులు పెరిగినా టీటీడీ పట్టించుకోలేదు. 3000 మంది పోలీసులు, 1500 మంది విజిలెన్స్ సిబ్బందిని మోహరించామని చేసిన ప్రకటన పచ్చి అబద్ధం. టికెట్ల కేంద్రాల వద్ద ఎక్కడా 50 మందికి మించి పోలీసులు కనబడరు. జనం ఎంతమంది వచ్చినా లైను కదులుతూ ఉంటే నిర్వహణ సుసాధ్యమయ్యేది. అలా చేయకపోగా, కౌంటర్లకు తాళాలు వేసి జనంలో ఆందోళన రేకెత్తించారు. జనసమ్మర్దం ఉన్న ప్రాంతాల్లో టికెట్ల కేంద్రాలు ఏర్పాటు చేయడం ఒక తప్పిదమైతే, అక్కడ కనీసం నీరు, ఆహారం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం ఇంకో తప్పిదం. టికెట్లు లేకపోయినా సర్వదర్శనానికి అనుమతిచ్చే టీటీడీ ఈసారి అలా చేయకపోవడం అనాలోచిత నిర్ణయమే. పైగా దర్శనం జరిగే పదిరోజులూ టికెట్లు ఇచ్చేవారు. ఈసారి దాన్ని 3 రోజులకే కుదించడంవల్ల భక్తుల్లో ఒత్తిడి పెరిగింది. ఇలా భక్తుల మనోభావాలతో ఆటలాడుకున్న టీటీడీ, భద్రతా సిబ్బంది బైరాగిపట్టెడ తొక్కిసలాట దుర్ఘటనకు పూర్తిగా నైతిక బాధ్యత వహించి తీరాల్సిందే. వీఐపీ దర్శనాలు, సిఫార్సు లేఖలపై ఆసక్తిచూపినంతగా భద్రతా ఏర్పాట్లపై దృష్టిపెట్టకపోవడం ముమ్మాటికీ టీటీడీ వైఫల్యమే.

రాజకీయ సంస్కృతి

ఈ సంస్కృతి చాలా బాగుంది. వ్యతిరేకి బాధల్లో ఉంటే చూసి సంతోషపడే సంస్కృతి. నాకు చాలా బాగా నచ్చింది. ఏం సంస్కృతి అది బాగా నచ్చిందని లొట్టలేస్తూ వస్తున్నావు. అదేంటో నాకు కూడా చెప్పవయ్యా బావ. నేను కూడా ఆనందపడతా. భలేవాడివయ్యా ఆ ఆనందం అందరికి దక్కదు. అది దక్కాలంటే రాజకీయాల్లో మునగాలి. నీవు రాజకీయాలకు దూరం కదా అందుకని నీకు ఆనందం దక్కదు. సరేపోనీ అదేంటో చెప్పవయ్యా విని ఆనందపడతాను. అసలు ఒక్కో భాషకు ఒక్కో సంస్కృతి. అలాగే ఒక్కో రాష్ట్రానికి ఆ భాషను బట్టి వారి సంస్కృతి వేరుగా ఉంటుంది. ఆయా సంస్కృతిని బట్టి వారి ఆలోచనలు, ఆచారాలు ఉంటాయి. వాటిని బట్టి వారు మనుగడ సాగిస్తారు. ఈమధ్య మన వాళ్లకు మాతృభాష తెలుగుపై మమకారం హఠాత్తుగా పెరిగి ఆనందంలో మునిగి ఇతర భాషలు అనవసరమని, వాటిలో ముఖ్యంగా ఇంగ్లీషును ప్రభుత్వ స్కూళ్లలో ఎత్తి వేయాలని గాండ్రించి ప్రభుత్వానికి ఒక వినతి పత్రం సమర్పించారట. రాష్ట్రమంతా మాట్లాడే భాష ఒకటైనా యాసలు వేరు. ఉత్తరాది వారి యాస వేరు. సర్కారు జిల్లాల యాస వేరు. అలాగే రాయలసీమ వాసుల యాస వేరు. ఇక తెలంగాణ తెలుగులో కొన్ని ఉర్దూ పదాలతో కూడిన యాసవేరు. అలాగే వారి అలవాట్లనుబట్టి వారి సంస్కృతి కూడా భిన్నంగా ఉంటుంది. కాని రాజకీయ సంస్కృతి మాత్రం దేశమంతా ఒకేలాగ ఉంది.

నిజమే అదేమిటంటే ప్రత్యర్థులైన ఇతర పార్టీల నాయకులపై దాడులు



చేయడం. మనది ప్రపంచంలో కెల్లా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకుని గర్వపడతాం. రాచరిక పాలన అనంతరం ఆంగ్లేయుల పాలనలో ఎన్నో పోరాటాలు చేసి, ఎన్నో ప్రాణాలు అర్పించి స్వాతంత్ర్యం సంపాదించుకుని మనల్ని మనమే పరిపాలించుకునే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. ప్రజలందరూ స్వేచ్ఛా వాయువులు పీల్చుకుని కుల,మత రహితంగా ఉండాలని అంబేద్కరు రాజ్యాంగాన్ని రూపొందించారు. కాని కులమత ఘర్షణలతో సంస్కర్తల ప్రాణాలు తీస్తూ అందలమెక్కిన నాయకులు స్వార్థంతో అవినీతిపరులుగామారి అమరుల త్యాగాలకు విలువ లేకుండా చేస్తున్నారు. అమరులు కోరిన శాంతి లేకపోగా అలజడులతో అశాంతితో జీవితం గడపడం నేటి పరిస్థితి. ప్రతి నాయకుడు సమతావాదినని, ప్రజలకు సేవ చేయడానికి భగవంతుడు తనకు ఈ జన్మ ప్రసాదించాడని చెబుతాడు. కాని ఆ మాటకు స్వస్తి పలికి అవినీతిపరుడుగా మారుతున్నాడు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్ష నాయకులపై ఆర్థికపరమైన దాడులు జరపడం ఆనవాయితీగా మారింది. గతంలో రాజశేఖరరెడ్డి మరణం అనంతరం చనిపోయినవారిని పరామర్శించడానికి వెళ్లిన వ్యక్తి కాంగ్రెసులో చేరలేదని ఆయనపై ఆర్థికపరమైన దాడులు జరిపి జైల్లో పెట్టించారు.

ఆ కేసులు ఇంతవరకు తేలలేదు. అప్పట్లో సంతోషంతో రాష్ట్రంలోని ప్రతిపక్ష నేత తన పార్టీ నాయకుడితో ఎ యింప్లీడ్ పిటీషను ఆ వ్యక్తికి వ్యతిరేకంగా వేయించాడు. ఆ వ్యక్తి అధికారంలోకి వచ్చిన తరువాత 50 రోజులు యింప్లీడ్ పిటిషన్ వేయించిన ప్రతిపక్ష నేత జైలులో ఉన్నారు. టీడీపీ ఎంపీపై సి.బి.ఐ దాడి జరిగితే అది అన్యాయమని కడకు ఉక్కు ఫ్యాక్టరీ అడిగినందుకే ఎంక్వయిరీ వేయించిందని ఆ పార్టీ వారన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే కాంగ్రెసు హయాంలో జరిగిన బోఫోర్సు అవినీతిపై యుద్ధం ప్రకటించింది. ఇప్పుడు అనిల్ అంబాని విషయంలో బీజేపీ ముఖ్యంగా ప్రధాని మోదీ అవినీతికి పాల్పడినట్లు కాంగ్రెసు అంటోంది. అసలు ప్రజలతో సంబంధంలేని వేల కోట్లు గడించినవారు హఠాత్తుగా రాజ్యసభలో కూర్చుంటున్నారు. ఆ అధికారంతో వేలకోట్లు సంపాదిస్తుంటే నిత్యం ప్రజాసమస్యలపై పోరాడి జైలుపాలయిన వారు చట్ట సభలలో అడుగుపెట్టలేక పోతున్నారు. అసలు కొంతమంది నాయకుల మాటలు వింటుంటే మనది ప్రజాస్వామ్య దేశమేనా అని అనుమానం కలుగుతోంది. ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసం దంచి మరునాడు మా పార్టీ మేముండగా మరోపార్టీ ఎందుకంటున్నారు. ప్రజాస్వామ్య వాదులు ప్రజల కోసం చట్టసభలలో ప్రతిపక్షం బలంగా ఉండాలని కోరుకుంటారు, ప్రభుత్వంలో ఉన్నవారు ప్రతిపక్షం దేనికంటున్నారు. దాంతో సరిపెట్టక ప్రతిపక్ష నాయకులపై కేసులు బనాయించి జైలుపాలు చేయడం నేటి రాజకీయ సంస్కృతిగా మారింది. గతంలో ఓటుకు నోటు కేసులో ఇరుక్కుని చంద్రబాబు కేంద్రానికి తలవొంచాడని జగన్ పార్టీ అంటే ఆర్థిక నేరాలు చేసి జగన్ మోదీకి తలవంచాడని దేశం నాయకులంటున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు ప్రతిపక్ష నాయకులపై సి.బి.ఐ ని ఉసిగొల్పడం రాజకీయంగా మారింది. చంద్రబాబు గత ప్రభుత్వంలో అవినీతి జరిగినా కేంద్రానికి మద్దతు పలికినంత కాలం ఎంక్వయిరీ వేయలేదు. అలాగే జగన్ మద్దతు ఇవ్వడం వలన జగన్ కేసులు వాయిదాలు తప్ప తేల్చడంలేదు. అంటే అధికారం నిలుపుకోవడానికి రాష్ట్ర నాయకుల అవినీతిని పాతి పెడుతున్నారు. ఎదురు తిరిగితే ఆ మరునాడు కేసులు పుంజుకుంటాయి. ఇటువంటి ద్వంద్వ నీతితో బీజేపీ అధికారం నిలుపుకుంటోంది. నిజం పలికే సంఘ సంస్కర్తలను మాత్రం బలి తీసుకోవటంలో చాలా వేగంగా బీజేపీ ప్రభుత్వం పని చేస్తోంది. ఈ స్థితిలో ప్రభుత్వం ప్రజల కోసమా లేక ప్రత్యర్థులను లొంగదీసుకోవడానికా అని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధినేతలు ప్రతిపక్షంపై దాడులపై పెట్టిన శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, ప్రస్తుత దాడుల రాజకీయ సంస్కృతికి స్వస్తి పలకాలని ప్రజలు కోరుతున్నారు.

సెల్: 98855 69394

మానవ తప్పిదం వల్లే తిరుపతి విషాదం

కందారపు మురళి

మానవ తప్పిదం కారణంగానే తిరుపతి నగరంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారని స్పష్టమవుతున్నది. వెంకటేశ్వర స్వామి వారిని ఏకాదశి నాడు దర్శించుకుంటే మంచి జరుగుతుందని భావించి తిరుమలకు వైకుంఠ ఏకాదశి నాడు భక్తులు పోటెత్తడం ఆనవాయితీగా వస్తున్నది. క్రౌడ్ మేనేజ్మెంట్ విషయంలో టీటీడీ ఉద్యోగులకు ఉన్న అనుభవం దేశంలో మరే ఆధ్యాత్మిక సంస్థలకు లేదనేది కూడా సుస్పష్టం. అయితే ఈ పరిస్థితి ఎందుకు తలెత్తింది? అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా చర్చ జరుగుతున్నది. జరిగిన ఘటనలో వ్యక్తులకు, సంస్థలకు దురుద్దేశాలు ఆపాదించలేం. ఏ ఒక్కరూ ఇలాంటి ఘటనలు జరగాలని భావించరు. కాకపోతే ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవటం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం తదితర కారణాలతో తిరుపతిలో ఆరుగురు భక్తులు చనిపోయారు. 40 మంది క్షతగాత్రులు అయ్యారనే వాస్తవాన్ని సాధారణ జనం, భక్తులు జీర్ణించుకోలేక పోతున్నారు. వైకుంఠ ఏకాదశి నాడు లక్షల సంఖ్యలో జనం తిరుమలకు వస్తారన్న అంచనాలు ఉన్నప్పటికీ దానికై చేపట్టాల్సిన ఏర్పాట్లపై స్పష్టత లోపించడం వైఫల్యంగా కనిపిస్తున్నది.

తిరుపతిలో ఏర్పాటు చేసే టికెట్ కేంద్రాలు స్థానికులకు మాత్రమేనని గతంలో ప్రకటించేవారు. ఎవరైనా ఇతర ప్రాంతాల భక్తులు కౌంటర్ల వద్దకు వచ్చినా టికెట్లు ఇచ్చేవారు. ఈ దఫా లోపమేమంటే... టికెట్ లేని వారిని తిరుమల కొండకు అనుమతించబోమని యాజమాన్యం చేసిన ప్రకటన వల్ల ముఖ్యంగా తమిళనాడు ప్రాంతం నుంచి చాలా పెద్ద సంఖ్యలో ఎలాగైనా వైకుంఠ ఏకాదశి నాడు దేవున్ని దర్శించుకోవాలి, వైకుంఠ ద్వారాలలో ప్రవేశం పొందాలి. అనే ఆతృతతో పెద్ద సంఖ్యలో భక్తులు తిరుపతి చేరుకున్నారు. బుధవారం నాటి ఉదయానికి దూర ప్రాంతాల నుంచి రాత్రంతా ప్రయాణం చేసి అలసిపోయిన భక్తులు టికెట్ కౌంటర్ల వద్దకు చేరుకున్నారు. గురువారం ఉదయం ఐదు గంటల నుంచి టికెట్లు ఇస్తారని ముందస్తుగా అధికారులు ప్రకటన చేసినా బుధవారం ఉదయం 10 గంటలకే కౌంటర్ల దగ్గరకు భక్తులు చేరుకోవడం ప్రారంభమైంది. ప్రతిగంటకు భక్తుల సంఖ్య పెరగడం ఉదయం నుంచి కనబడుతూనే ఉంది. పెరుగుతున్న సంఖ్యను దృష్టిలో పెట్టుకొని పోలీసు యంత్రాంగం తగిన జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఈ ఘటన జరిగేది కాదు. భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, అన్ని ఏర్పాట్లు చేపట్టామని 3,000 మంది పోలీసులు, 1500 మంది విజిలెన్స్ సిబ్బందితో ప్రశాంతమైన వాతావరణంలో దర్శన ఏర్పాట్లు చేశామని టీటీడీ ఉన్నతాధికారులు, బోర్డు చైర్మన్ అనేకసార్లు ప్రకటించారు. ఇన్ని వేలమంది పోలీసులను కేటాయించామని చెబుతున్నా కౌంటర్లు దగ్గర భక్తులను నియంత్రించడానికి, క్రమబద్ధీకరించడానికి పోలీసులు పరిమిత సంఖ్యలో ఉండటం ఈ దుస్థితికి కారణంగా ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

టికెట్ కౌంటర్లను టీటీడీ తిరుపతిలోని మూడు చోట్ల నిర్వహిస్తున్నది. వేల సంఖ్యలో జనం రావడం, టికెట్లు పొందడం అనేది నిత్యం జరిగేదే. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మూడు కౌంటర్లకు అదనంగా మరో ఐదు కౌంటర్లని టీటీడీ ఏర్పాటు చేసింది. తిరుమలకొండపై స్థానికులకు కౌంటర్ బాలాజీ నగర్‌లో ఏర్పాటు చేశారు. మొత్తం తొమ్మిది కేంద్రాల్లో 90 కౌంటర్లని టీటీడీ ఏర్పాటు చేసింది. వాస్తవంగా ఒక్కో కౌంటర్ వద్ద పదివేల మంది జనం వచ్చినా లైన్ కదులుతూ ఉంటే మేనేజ్ చేయడం పెద్ద సమస్య ఏమి కాదు ఇది టీటీడీ ఉద్యోగులకు తెలిసిన విద్యే. వచ్చిన జనాన్ని నియంత్రించకపోగా కౌంటర్లకు తాళాలువేసి లైన్లోకి జనాన్ని పంపకపోవడం దారుణం. ఏర్పాటు చేసిన కేంద్రాలు కూడా జన సమ్మర్ధంగా ఉన్నటువంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం, నివాస ప్రాంతాల్లో సన్నని ఇరుకు దారులలో వీటిని ఏర్పాటు చేయడం, మలమూత్రాల విసర్జనకు కూడా అవకాశం లేకుండా ఉండటం ఆఖరుకు ఆహారం, నీరు వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం ఎక్కడి నుంచో దూరప్రాంతాల నుంచి వచ్చి గంటలు తరబడి వేచి ఉండటం అడుగడుగునా కనిపించింది. బైరాగిపట్టెడలోనైతే గడ్డి తొక్కేస్తారన్న కారణంతో పార్కులో నీళ్లు పట్టేయడంతో ఎక్కడ కూర్చోవాలో తెలియక బురద నీళ్లలోనే వేలమంది నిలబడి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. గంట గంటకు జనం విపరీతంగా పెరుగుతున్నా పోలీసుల సంఖ్యను పెంచాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్న ఆలోచన టీటీడీకి, ప్రభుత్వ యంత్రాంగానికి, పోలీసులకు రాకపోవడం అన్యాయం. తిరుపతిలో ఏర్పాటుచేసిన దాదాపు అన్ని కేంద్రాల్లో ఈ తొక్కిసలాటలు, ఘర్షణలు జరిగాయి. రెండు కేంద్రాల్లో భక్తులు మరణించారు. బైరాగిపట్టెడ కేంద్రంలో తొక్కిసలాట తర్వాత అంబులెన్స్ కోసం అరగంటకు పైగా నిరీక్షించాల్సి వచ్చిందంటే నిర్లక్ష్యం స్థాయి ఎలాఉందో అర్థమవుతుంది. దాదాపు అన్ని కేంద్రాల్లో గాయపడిన వారు, ఊపిరాడకుండా ఇబ్బందులు పడిన వారు, టికెట్లు వద్దని వెనక్కు వెళ్లిపోయిన వారు వందల సంఖ్యలో కనిపించారు. క్యూలైన్ల నిర్వహణలో అడుగడుగునా ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. గతంలో క్యూలైన్ల ఏర్పాటును తిరుమల జేఈఓ ఆధ్వర్యంలో కలెక్టర్, ఎస్పీ ఇతర ఉన్నతాధికారులు, టీటీడీ ఉద్యోగులు సమన్వయంతో నిర్వహించేవారు. ఈ దఫా ప్రతిరోజు సమీక్షలు చేయడం, గొప్పగా నిర్వహిస్తున్నామని ప్రకటనలు చేయడం వల్ల విపరీతమైన ప్రచారం లభించింది. ప్రచారానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. గతంలో వైకుంఠ ఏకాదశికి వచ్చే వాళ్లకి టికెట్ లేకపోయినా సర్వదర్శనానికి అనుమతించేవారు. ఈ దఫా టిక్కెట్ లేకపోతే తిరుమలకి రావడానికి వీల్లేదని ప్రకటన చేయడంతో ప్రతి

వారిలో ఏదో రకంగా టికెట్లు సంపాదించాలి... వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాలన్న ఆత్రుత ఈ తొక్కిసలాటకి కారణమైనట్టుగా కనిపిస్తున్నది. టీటీడీ యాజమాన్యం అనాలోచితంగా వ్యవహరించ బట్టే ఈ పరిస్థితి నెలకొందన్న విమర్శలు వచ్చాయి. దర్శనం జరిగే పది రోజులు కంటిన్యూగా టికెట్లు ఇచ్చే పద్ధతి గతంలో ఉండేది. ఇప్పుడు మూడు రోజులకు కుదించడం కూడా ఒత్తిడి పెరగడానికి కారణంగా కనిపిస్తున్నది. టీటీడీ ఉద్యోగులను భాగస్వామ్యం చేయడం కంటే శ్రీవారి సేవకులను, పోలీసుల్ని నమ్ముకోవటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని కొందరు ఉద్యోగులు వ్యాఖ్యానించారు. బుధవారం ఉదయం ప్రతి కేంద్రం వద్ద కిలోమీటర్ల కొద్దీ లైన్లో నిలబడిపోయి ఉండటం వల్ల ట్రాఫిక్‌కు విపరీతమైన అంతరాయం ఏర్పడింది. స్థానికేతరులు తిరుపతి నగరంలో ఎక్కడ చూసినా కనబడ్డారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోక పోవడం, ప్రత్యామ్నాయాలను ఆలోచించక పోవడం వంటి విషయంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. అంతా జరిగిపోయాక ఇప్పుడు లబోదిబోమంటూ నేతలు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. తిరుపతి నగరానికి 'క్యూ' కడుతున్నారు.

తిరుపతి ఘటన ఎవరికి ఎంత నష్టం? ఎంత లాభం? అనే లెక్కలు వేసుకుంటూ అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు పరస్పర విమర్శలు చేసుకోవడం విచారకరం. జరిగిన ఘటనలో బాధితులను ఆదుకోవడం, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన విధంగా వ్యవహరించాలన్న ఆతృత కంటే ఈ ఘటన నుంచి లాభం ఎంత పొందాలి? ఎదుటి వాళ్లకు నష్టం ఎంత చేయాలి? అన్న దానిమీద ఆత్రుత కనిపిస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి మరో ఆరుగురు మంత్రులు దాదాపు అన్నిపక్షాల నాయకులు బాధితుల పరామర్శకు బుధవారం పెద్ద సంఖ్యలో వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవహార శైలి అధికారుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జరిగిన తప్పులకు కారణాలేమిటో పరిశీలించకుండా... ప్రజల్లో సానుభూతికోసం బహిరంగంగా ఐఏఎస్ అధికారులను తూలనాడటం చర్చనీయాంశంగా మారింది. రానున్న పది రోజులలోను ఇదే రకంగా జనం వచ్చే పరిస్థితులు ఉన్నందున, మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వీఐపీ దర్శనాలు రద్దు చేశామని ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో తిరుమల కొండ మొత్తం వీఐపీలతోనే నిండిపోయింది. వీఐపీల సంస్కృతి విపరీతంగా పెరిగిపోవడం, ప్రతిదానికి లెక్కలు కట్టి డబ్బులు వసూలు చేయడం, దేవుడి దగ్గర సిఫార్సుల లేఖలు పెరిగిపోవడంపై సామాన్య భక్తుల్లో తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. దేవుడి దగ్గర సామాన్యుడికి సమానత్వం లేకపోతే ఎలా అనే ప్రశ్న అడుగడుగున సంధిస్తున్నారు. ఏ పాపం తెలియని అమాయకులైన భక్తులు వందల, వేల మైళ్ల దూరం నుంచి స్వామివారిని దర్శించుకోవాలన్న కాంక్షతో తమ జీవితాలకు మంచి జరుగుతుందన్న ఆశతో వచ్చి ప్రాణాలు కోల్పోయారు. ప్రాణాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం విషయంలో ప్రభుత్వ ప్రకటన సమంజసంగాలేదు. ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ పాతిక లక్షలు మృతులకి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ప్రతిపక్షాలు మృతులకు కోటి రూపాయలు, క్షతగాత్రులకు 25 లక్షల పరిహారం ఇవ్వాలని మృతుల కుటుంబాలకు శాశ్వత ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశాయి. చనిపోయిన వారిని కనీసం వారిని నమ్ముకున్న కుటుంబాల కైనా భరోసా కల్పించాల్సిన బాధ్యత టీటీడీపై, రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జరిగిన ఘటనలో బాధ్యుల పట్ల కఠినంగా వ్యవహరించి భవిష్యత్తులో ఇట్లాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా వ్యవహరించాలని కోరుకుందాం.

టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు

ఆంధ్రలో తొలితరం కమ్యూనిస్టులు-1

ఆర్వీ రామారావ్

మహాత్మా గాంధీ 1920 లో ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం, 1930లో ప్రారంభించిన శాసనోల్లంఘన ఉద్యమ ప్రభావం ఆంధ్ర ప్రాంతంపై ఎక్కువగా ఉండేది. తొలి తరం కమ్యూనిస్టుల్లో ఎక్కువ మంది ఈ రెండు ఉద్యమాలలో పాల్గొన్నవారే. సామ్రాజ్యవాద వ్యతిరేకత యువతరాన్ని బాగా ఆకర్షించింది. వీరిలో మొట్టమొదట చెప్పుకోవలసిన వారు కంభంపాటి సత్యనారాయణ (సీనియర్). బహుశ ఆయనే తెలుగువారిలో తొలి కమ్యూనిస్టు. ఆయన 1909లో జన్మించినా చిన్ననాటే సహాయ నిరాకరణోద్యమం ప్రభావం ఆయన మీద ఎక్కువగా ఉండేది. న్యాయవాద వృత్తి వదిలి స్వాతంత్ర్యోద్యమంలో దూకిన బులుసు సాంబమూర్తి, కుటుంబాన్ని త్యజించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వావిలాల గోపాల కృష్ణయ్య లాంటి వారి నిప్పులు చెరిగే ప్రసంగాలు కంభంపాటి సత్యనారాయణను బాగా ఆకట్టుకున్నాయి. 1928లో సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. అలాంటి ఒక సమావేశంలో స్వామి కుమారానంద అహింసా విధానాన్ని దుయ్యబడ్తూ మాట్లాడడం కంభంపాటికి బాగా నచ్చింది. కుమారానంద "ది మైండ్ అండ్ ఫేస్ ఆఫ్ బోల్షెవిజం" పుస్తకం కంభంపాటికి ఇస్తే రెండు రోజులు కాలేజీకి వెళ్లకుండా ఆ పుస్తకం చదివి ఉత్తేజితులయ్యారు. బి.ఎ.చదువుతుండగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకాలో ఒకరి దగ్గర సావర్కర్ రాసిన "ది ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్" సంపాదించి నాలుగు రోజుల్లో చదివేశారు. ఆ గ్రంథంలో 1857 నాటి ప్రథమ భారత సంగ్రామాన్ని ఒళ్లు జలదరించేట్టుగా సావర్కర్ వర్ణించారని కంభంపాటి చెప్పేవారు. 1929లో కంభంపాటి బి.ఎ. పూర్తి అయిన తరవాత ఉన్నత చదువుకోసం మద్రాసు వెళ్లారు. పుచ్చలపల్లి సుందరయ్య అప్పుడు అక్కడ ఇంటర్

చదువుతుండేవారు. సామ్రాజ్యవాద వ్యతిరేక భావాలను వ్యాప్తి చేసే "యంగ్ లిటరేటర్"కు చందాలు కట్టించేవారు. 1929 డిసెంబర్‌లో లాహోర్ కాంగ్రెస్ మహాసభలో సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం ఆమోదించింది. 1930 జనవరి 26న కంభంపాటి కొంతమంది మిత్రులతో కలిసి విద్యార్థులు క్లాసులు బహిష్కరించేట్టు చేశారు. ట్రిప్లికేన్ బీచ్ దాకా ఊరేగింపు కూడా నిర్వహించారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రజలందరితో కలిసి స్వాతంత్ర్య ప్రతిజ్ఞ చేశారు.

ఎం.ఎ. మొదటి సంవత్సరం అయిపోగానే పశ్చిమ గోదావరి జిల్లా వెళ్లి సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా వెళ్లి డా. చెలికాని రామారావుతో కలిసి జిల్లా కాంగ్రెస్ కమిటీ (కాకినాడలో) కొంత కాలం పనిచేశారు. ఆ సమయంలోనే "రణదుందుభి" అనే పేరుతో మిత్రులతో కలిసి రహస్యంగా సైక్లోస్టైల్ పత్రిక నడిపారు. దానికి సంపాదకుడు కంభంపాటే. ఆ తరవాత పశ్చిమ గోదావరి జిల్లాలో "వీరభారతి" పత్రిక ప్రారంభించారు. 1931 జనవరి 26న తనికెళ్ల చలపతితో కలిసి 144 వ సెక్షన్ ధిక్కరించి జైలుకెళ్లారు. ఒకటిన్నర నెలల కారాగార వాసం తరవాత గాంధీ-ఇర్విన్ ఒప్పందం కారణంగా విడుదలయ్యారు. గాంధీ హఠాత్తుగా ఉద్యమం విరమించడంతో అనేకమంది యువకుల్లాగే కంభంపాటి కూడా తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రజల త్యాగాలన్నీ వృథా అయినట్టు భావించారు.

జైలు నుంచి విడుదలైన వెంటనే భీమవరం వెళ్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఆదేశం మేరకు చలపతితో కలిసి కరాచీ కాంగ్రెస్‌కు హాజరయ్యారు. బొంబాయిలో ఓడ ఎక్కే ముందు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురును ఉరితీశారని తెలిసి తీవ్ర వ్యథకు గురయ్యారు. భగత్‌సింగ్ ప్రాణాలు కాపాడే అవకాశం ఉన్నప్పటికీ మహాత్మాగాంధీ ఆ పని చేయకపోవడం కంభంపాటిని కలవరపరిచింది. దానితో అహింసామార్గం మీద కంభంపాటికి విశ్వాసం సడలింది. ఆ సమావేశంలో భగత్‌సింగ్ మొదలైన వారి దేశభక్తిని ఖండిస్తూనే గాంధీ చేపట్టిన హింసాత్మక పద్ధతుల్ని ఖండిస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తీర్మానాన్ని వ్యతిరేకించిన వందలాదిమంది యువకుల్లో కంభంపాటి కూడా ఉన్నారు.కంభంపాటి అప్పటికే కమ్యూనిస్టు సాహిత్యం చదువుతూ ఉండేవారు. అప్పటికి కమ్యూనిస్టులెవరూ ఆయనకు తారసపడకపోవడంవల్ల గుంటూరులో ఒక వ్యక్తిగత విప్లవవాద గ్రూపులో చేరి పనిచేశారు. 1932 ఏప్రిల్ 24 న ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ సభలోనూ పాల్గొన్నారు. అది నిషిద్ధ సభ. విప్లవకారులతో సంబంధం పెట్టుకోవచ్చుననే ఉద్దేశంతో కంభంపాటి ఆ సభకు హాజరయ్యారు. ఢిల్లీ జైలులోని విప్లవకారులతో ఉత్తరప్రత్యుత్తరాలు నడిపారు. ఆంధ్ర దేశంలో హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ పార్టీ శాఖ నెలకొల్పడానికి అనుమతి సంపాదించారు. తిరిగి వచ్చేటప్పుడు అకోలాలో దిగి అక్కడి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఇంటికి వెళ్లి ఒక రివాల్వరు, ఒక తూటా సంపాదించారు. ఆ ఆయుధాన్ని ఉపయోగించే అవకాశమే రాలేదు. 1931 మధ్యలో మద్రాసు వెళ్లారు. అక్కడ అమీర్ హైదర్‌ఖాన్‌తో పరిచయం అయింది. ఆయన అప్పటికే కమ్యూనిస్టు. అమీర్ హైదర్‌ఖాన్ మీరట్ కుట్రకేసులో నిందితుడిగా ఉండవలసింది. కానీ తప్పించుకుని మాస్కో వెళ్లి 1932లో తిరిగి వచ్చారు.

కంభంపాటి సత్యనారాయణ



అప్పుడు కమ్యూనిస్టు పార్టీ బహిరంగంగా పని చేయడానికి వీలు ఉండేది కాదు. అందువల్ల అమీర్ హైదర్ ఖాన్ యంగ్ వర్కర్స్ లీగ్ అనే చట్టబద్ధ సంస్థ ఏర్పాటు చేశారు. అందులో కంభంపాటి పూర్తికాలం పనిచేసేవారు. మద్రాసులో కొద్ది నెలలు ఉండి ఆంధ్రదేశానికి తిరిగి వచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఉండగా పోలీసులు కంభంపాటిని అరెస్టు చేశారు. "వీర భారతి" పత్రిక ప్రతులను పంచి పెడుతున్నట్టు కేసు మోపారు. ఆరు నెలలు కఠిన జైలు శిక్ష విధించారు. జైలులో ఉండగా నూనెగానుగ తిప్పడానికి నిరాకరించినందువల్ల ఎ.కె.గోపాలన్‌కు, కంభంపాటికి కాళ్లకు బేడీలు వేశారు. మూడు నాల్గు నెలలు ఆ బేడీలతోనే ఉండాల్సి వచ్చింది. జైలు నుంచి విడుదలైన తరవాత మద్రాసులో కొన్ని వారాలు టంగుటూరి ప్రకాశం పంతులు నడుపుతున్న "స్వరాజ్య" పత్రికలో కంభంపాటి రిపోర్టర్‌గా పనిచేశారు. ఆ తరవాత 1933 నుంచి 1934 నవంబర్ దాకా హెచ్.డి.రాజా నడుపుతున్న "న్యూ ఏజ్" లో పనిచేశారు. 1930 లో వదిలి పెట్టిన ఎం.ఎ. 1935 ఏప్రిల్‌లో పూర్తి చేశారు. తరవాత పుచ్చలపల్లి సుందరయ్యతో కలిసి కూలీ రక్షణ సమితిలో పనిచేశారు. 1932 లోనే కంభంపాటి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు.

కంభంపాటి తండ్రి తుని దివాను. కంభంపాటి సత్యనారాయణ సీనియర్ మాత్రం జాతీయోద్యమంలో పాల్గొంటూనే ఉన్నారు. ఆ తరవాత ఆయన జీవితం కమ్యూనిస్టు పార్టీతో పెనవేసుకుపోయింది. కంభంపాటి కమ్యూనిస్టు పార్టీలో పూర్తికాలం పనిచేసేటప్పుడు నెలకు రూ.25 ఇచ్చేవారు. పైస, పైస లెక్కరాసి మిగిలిన డబ్బు పార్టీకి తిరిగి ఇచ్చేసేవారు. ఆంధ్రలో తొలి కమ్యూనిస్టు అయిన కంభంపాటి కమ్యూనిస్టు అంటే ఎలా ఉండాలో అలాగే ఉండేవారు.

రిటైర్డ్ జాగిలాలు ప్రజలకు దత్తత

సీఆర్‌పీఎఫ్ యోచన

న్యూదిల్లీ: దేశ రక్షణలో భాగమై ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న జాగిలాల విషయంలో సీఆర్పీఎఫ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వీటిని ప్రజలు దత్తత తీసుకునేందుకు వీలు కల్పిస్తోంది. అందుకోసం ఆన్‌లైన్ సేవలు ప్రారంభించింది. సాధారణంగా కేంద్ర, రాష్ట్రాల పోలీసులు తమ వద్ద రిటైర్డ్ అయిన శునకాలను సంరక్షణ కేంద్రాలు, రిజిస్టర్డ్ ఎన్‌జీవో, ప్రఖ్యాత సంస్థలకు అప్పగిస్తుంటారు. దేశరక్షణ కోసం పని చేసిన వీటిని సంరక్షణ కేంద్రాల్లో వదిలేయకుండా ప్రజలకు దత్తత ఇచ్చేందుకు సీఆర్పీఎఫ్ సిద్ధమైంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. దాదాపు 8 నుంచి 12 ఏళ్ల వయసున్న ఈ జాగిలాలు దేశవ్యాప్తంగా నక్సల్ వ్యతిరేక, ఉగ్రవాద వ్యతిరేక సాహస కార్యకలాపాల్లో పాల్గొన్నాయి. అయితే... వీటిని ఇతరులకు అప్పగించినట్లయితే దేశ వ్యతిరేక చర్యలకు ఉపయోగిస్తారనే అనుమానాలు ఉండడంతో ఇన్నాళ్లూ దత్తతకు ఇవ్వలేదని ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. కానీ, ప్రస్తుతం వీటిని దత్తత తీసుకోవాలంటే కఠిన నిబంధనలు ఉంటాయి. దీని ప్రకారం దత్తత తీసుకున్న జాగిలాలను దుర్వినియోగం చేయకూడదు. వాటిని విక్రయించడం, ఇతరులకు హాని కలిగించడం చేయకూడదు. ఇలా దత్తత తీసుకునే వ్యక్తి ఒప్పంద పత్రంపై సంతకం చేయాల్సి ఉంటుంది. శునకం ఆరోగ్యం, టీకా ఇలా దానికి సంబంధించిన వివరాలు అందిస్తారు. బెల్జియన్ షెఫర్డ్ మాలినోయిస్, జర్మన్ షెఫర్డ్, లాబ్రడార్, ముధోల్ హౌండ్ జాతులకు చెందిన 30 రకాల కుక్కలను ప్రజలకు ఇచ్చేందుకు సీఆర్పీఎఫ్ సిద్ధమైంది.

ఒక్కస్థానం నుంచే పోటీ

- బీజేపీ ప్రచారం అవాస్తవం
- జాట్లను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలి
- దిల్లీలో మూడోసారి ఆప్ విజయం ఖాయం
- ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో మరో నెల రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న క్రమంలో రాజకీయాలు వేడెక్కాయి. అన్ని పార్టీలు ప్రచారం దూకుడు పెంచాయి. నేతలు పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఓటమి భయంతో దిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారంటూ బీజేపీ ప్రచారం చేస్తున్న సంగతి విదితమే. న్యూ దిల్లీతోపాటు మరో స్థానం నుంచి కేజ్రీవాల్ పోటీ చేయబోతున్నారంటూ బీజేపీ నేతలు చెబుతుండగా... దీనిపై కేజ్రీవాల్ స్పందించారు. బీజేపీ నేతల ఆరోపణలను ఖండించారు. తాను కేవలం ఒక్క స్థానం నుంచే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మధ్య ప్రత్యక్ష పోటీ ఉన్నందున అసెంబ్లీ ఎన్నికలు ఇండియా ఐక్యసంఘటనకు సంబంధించినవి కాదని స్పష్టం చేశారు. న్యూదిల్లీ నుంచి తాను ఓడిపోతాననే భయంతో కేజ్రీవాల్ తన నియోజకవర్గంలోని ఓటర్ల జాబితా గురించి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, రెండు స్థానాల నుంచి పోటీ చేయడం గురించి మాట్లాడుతున్నారని బీజేపీ ఐటీ సెల్ అధ్యక్షుడు అమిత్ మాల్వియా 'ఎక్స్'లో పోస్ట్ చేసిన తర్వాత ఆప్ నేత ఈ వివరణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం జాట్ సమాజానికి రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైందని కేజ్రీవాల్ విమర్శించారు. దిల్లీలోని జాట్ సమాజాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లుచెప్పారు. దాదాపు దశాబ్ద కాలంగా కేంద్రం తన హామీలను నెరవేర్చకుండా ప్రజల్ని తప్పుదారి పట్టిస్తోందని ఆయన విమర్శించారు. '2015లో జాట్ నాయకులను ప్రధానమంత్రి నివాసానికి ఆహ్వానించి, దిల్లీలోని జాట్ సమాజాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చుతామని వారికి హామీ ఇచ్చారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా 2019లో ఈ హామీని పునరుద్ఘాటించారు. అయితే ఏమీ చేయలేదు' అని కేజ్రీవాల్ అన్నారు. దిల్లీలోని జాట్‌లను రాష్ట్రంలో ఓబీసీలుగా గుర్తించినప్పటికీ... జాతీయ స్థాయిలో వారికి ఆ ప్రయోజనాలను అందించడానికి కేంద్ర ప్రభుత్వం పదేపదే నిరాకరిస్తోందని ధ్వజమెత్తారు. 'ఇది పచ్చి ద్రోహం' అని కేజ్రీవాల్ అన్నారు. దిల్లీలో ఎంసీడీ, డీడీఏ, పీడబ్ల్యూడీ వంటి కేంద్ర సంస్థలు దిల్లీలో గణనీయ సంఖ్యలో ఉన్నాయని, జాట్లను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చినట్లయితే వారికి పెద్దఎత్తున అవకాశాలు వస్తాయని కేజ్రీవాల్ పేర్కొన్నారు. జాట్ల డిమాండ్లు నెరవేరే వరకు పోరాడుతూనే ఉంటానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఇక దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి ఆప్ విజయం సాధిస్తుందని కేజ్రీవాల్ ధీమా వ్యక్తపర్చారు. వేలాది మంది ఆప్ మద్దతుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడం కోసం బీజేపీ... న్యూదిల్లీతో సహా వివిధ నియోజకవర్గాల నుండి పెద్దఎత్తున దరఖాస్తులు దాఖలు చేసిందని ఆప్ నాయకులు ఆరోపించారు. కాగా 2013 మొదలుకొని మూడు దఫాలుగా న్యూదిల్లీ నుండి ఎమ్మెల్యేగా ఎన్నికైన కేజ్రీవాల్ ఈసారి దిల్లీకి చెందిన ఇద్దరు మాజీ ముఖ్యమంత్రుల కుమారులతో ముక్కోణపు పోటీలో ఉన్నారు. బీజేపీ... మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మను నిలబెట్టగా, కాంగ్రెస్ సందీప్ దీక్షిత్‌కు టికెట్ ఇచ్చింది. ఆయన తల్లి షీలా దీక్షిత్ దిల్లీకి మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు.

కాగా, న్యూ దిల్లీ స్థానం నుంచి కేజ్రీవాల్ వరుసగా నాలుగోసారి పోటీకి సిద్ధమయ్యారు. 70 మంది సభ్యులున్న దిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుంది. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

బూతుల పార్టీకి ప్రజలు ఓటెయ్యరు: ఆతిశీ

న్యూదిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో రాజకీయ పార్టీలు విమర్శలకు పదునుపెడుతున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్ష బీజేపీపై సీఎం ఆతిశీ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. రాబోయే ఎన్నికలు ఆమ్ ఆద్మీపార్టీకి, దుర్భాషలాడే సమూహానికి మధ్య జరుగుతున్నాయని బీజేపీని ఉద్దేశించి ఆమె అన్నారు. తనని, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకొని బీజేపీ విమర్శలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆమె ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ 'ఆతిశీ తన తండ్రిని మార్చేశారు' అంటూ ఇటీవల బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిధూరి చేసిన వ్యాఖ్యలను ఆమె ప్రస్తావించారు. బూతులు మాట్లాడేవారిని, ఆ పార్టీని ప్రజలు ఎన్నుకోబోరని, ఎవరైతే తమ కోసం పని చేస్తారో వాళ్లకే ఓటు వేస్తారని అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ కూడా ఇదే విషయాన్ని పదేపదే చెబుతారని ఆమె గుర్తు చేసుకున్నారు. దిల్లీ అభివృద్ధిపై బీజేపీకి ఎలాంటి విజన్ లేదని ఆతిశీ అన్నారు. ఆ పార్టీ అధికారంలోకి రాదు కాబట్టే... ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించలేదని ఎద్దేవా చేశారు. 'ఆప్ ప్రజల కోసం పని చేసింది. భవిష్యత్‌లోనూ చేస్తుంది. బీజేపీకి ఓ అజెండా లేదు. ముఖ్యమంత్రి అభ్యర్థి కూడా లేరు. వాళ్లకి తెలిసిందల్లా ఒక్కటే... కేజ్రీవాల్‌ను దూషించడం. ఎవరిని ఎన్నుకోవాలన్న దానిపై దిల్లీ ప్రజలు సులభంగానే నిర్ణయం తీసుకుంటారని అనుకుంటున్నా' అని ఆతిశీ పేర్కొన్నారు.

బీజేపీ మేనిఫెస్టోపై ఉత్కంఠ

న్యూదిల్లీ: ఆప్‌ని ఎలాగైనా గద్దె దించాలనుకుంటున్న బీజేపీ మేనిఫెస్టోపై ఉత్కంఠ నెలకొంది. అన్ని వర్గాలను ఆకర్షించేలా ఎన్నికల ప్రణాళిక ఉంటుందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు నగదు సాయం, బస్సు, మెట్రోల్లో ఉచిత ప్రయాణం పథకాలను మేనిఫెస్టోలో బీజేపీ చేర్చబోతున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో ఆప్ మళ్లీ అధికారంలోకి రావడానికి ఈ పథకాలే ప్రధాన కారణమయ్యాయి. ప్రస్తుతం 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి చార్జీలు విధించడం లేదు. దానిని 300కి పెంచే యోచనలో బీజేపీ ఉన్నట్లు తెలుస్తోంది. దేవాలయాలు, గురుద్వారాలు ఉన్న ప్రాంతాల్లో 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన' దిల్లీ మహిళలకు అక్కడి ప్రభుత్వం ప్రతి నెలా రూ.1000 ఆర్థిక సాయం చేస్తోంది. మళ్లీ అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని రూ. 2,100కి పెంచుతామని కేజ్రీవాల్ ఇటీవల హామీ ఇచ్చారు. దీంతో బీజేపీ ఎలాంటి ప్రకటన చేస్తుందన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో మహిళలకు నగదు బదిలీ పథకాలు కీలకంగా మారాయి. మహిళా ఓటు బ్యాంకును సాధించేందుకు దిల్లీలోనూ బీజేపీ ఈ తరహా వ్యూహాన్ని అమలు చేసే అవకాశముంది.

రాహుల్‌ను ఆహ్వానించింది కానీ...

న్యూదిల్లీ: కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ప్రజలతో మమేకమయ్యే ఏం సందర్భాన్ని వదులుకోరు. ఇటీవల ఆయన ఓ ప్రముఖ కాఫీ షాప్‌నకు వెళ్లి... యాజమాన్యంతో ముచ్చటించారు. వారి వ్యాపారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వినియోగదారులను పలకరించారు. దీనికి సంబంధించి రాహుల్ షేర్ చేసిన దృశ్యాల్లో ఓ సన్నివేశం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ షాప్‌లో రాహుల్ స్వయంగా కోల్డ్ కాఫీ తయారు చేశారు. తర్వాత అక్కడున్న ఓ వృద్ధురాలు రాహుల్‌ను ఇంటికి ఆహ్వానించింది. ఆమె అదే భవనంలో నివాసం ఉంటుంది. ఆమె ఆహ్వానంతో రాహుల్ ఆ ఇంటివద్దకు వెళ్లగా... ఆ మహిళ ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొన్నది. రాహుల్‌నైతే పిలిచింది కానీ... ఇంటి తాళంచెవి లేదన్న విషయాన్ని మర్చిపోయారు. తాళంచెవి కోసం గాబరాపడ్డారు. ఆమె పరిస్థితి అర్థం చేసుకొని రాహుల్... వారితో ఫొటోలు దిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

భవిష్యత్తు యుద్ధంలో కాదు... బుద్ధుడిలో ఉంది

ప్రధాని నరేంద్రమోదీ

భువనేశ్వర్: మానవుడి భవిష్యత్తు యుద్ధంలో లేదని, బుద్ధుడిలో ఉందని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. గురువారం ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాస భారతీయ దినోత్సవ కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. ఒడిశాలో అడుగడుగునా వారసత్వం కనిపిస్తుందని ప్రధాని మోదీ అన్నారు.. ఇక్కడినుంచి వ్యాపారులు సుమత్రా, బాలి, జావా వంటి ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారని గుర్తు చేశారు. 'భారతదేశం ప్రజాస్వామ్యానికి కేవలం తల్లి లాంటిది మాత్రమే కాదు. అది మన జీవితాల్లో భాగం. విదేశాల్లో జీవించేవారు భారత్‌కు రాయబారులుగా నేను చూస్తాను. భారత్ నుంచి యువత పూర్తి నైపుణ్యాలతో విదేశాలకు వెళ్లేలా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జీ20 సందర్భంగా దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహించి భారత్ వైవిధ్యాన్ని ప్రపంచానికి తెలియజేశాం. మన వారసత్వ, విభిన్న సంస్కృతులను ప్రపంచం గమనిస్తోంది. భారత్ స్వాతంత్ర్యం సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసులు కూడా తోడ్పడ్డారు. ప్రవాస భారతీయులు వచ్చే ఏడాది ఈ ఉత్సవానికి వచ్చే సమయంలో కనీసం ఐదుగురు విదేశీ మిత్రులను తమతోపాటు తీసుకురండి. భారత్ కేవలం యువ దేశమే కాదు. నిపుణులైన యువకుల దేశం. భారత్‌కు 'విశ్వబంధు'గా గుర్తింపు ఉంది. దానిని మరింత బలోపేతం చేయాలి' అని మోదీ ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. మహాకుంభ్, సంక్రాంతి, లోహిర్, మాగ్ బిహు వంటి పండుగల సీజన్‌లో ప్రవాస భారతీయ వేడుకలు జరగడం విశేషమన్నారు. రష్యా, ఇజ్రాయిల్ పేర్లను నేరుగా ప్రస్తావించకుండా భవిష్యత్తు యుద్ధంలో కాదని, బుద్ధుడిలో ఉందని మోదీ పేర్కొన్నారు. అశోకుడు ఖడ్గంతో సామ్రాజ్య విస్తరణకు అవకాశం ఉన్నా... బౌద్ధం స్వీకరించారని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మోదీ 'ప్రవాసి భారతీయ ఎక్స్‌ప్రెస్' రైలును భువనేశ్వర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఒడిశా సీఎం మోహన్‌చరణ్ మాఝీ తదితరులు పాల్గొన్నారు.

ఇక ఉమ్మడి పౌర స్మృతి అమలు

సీఎం పుష్కర్‌సింగ్

రాయ్‌బరేలీ: రాష్ట్రంలో ఈ నెల నుంచే ఉమ్మడి పౌరస్మృతి అమలు కానున్నట్టు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ థామి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2024, ఫిబ్రవరి ఏడో తేదీన ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతి బిల్లు ఆమోదం పొందింది. ఆ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. మార్చి 12, 2024లో నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి పౌర స్మృతి 2024 చట్టాన్ని రూపొందించారు. జనవరి 2025 నుంచి ఆ చట్టాన్ని పూర్తిగా అమలు చేయనున్నట్లు చెప్పారు. యూసీసీ అమలు కోసం ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్ అభివృద్ధి చేశారు. మహిళలు, పిల్లల సాధికారతే లక్ష్యంగా యూసీసీ అమలు ఉంటుందని సీఎం థామి గతంలో తెలిపారు.

ఆదివారమూ పనిచేయాలి

ఎల్ అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్

న్యూదిల్లీ: పరిశ్రమలు, కంపెనీల్లో పనిగంటలపై యజమానులు వేర్వేరు ప్రకటనలు చేస్తున్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే వారానికి 70 గంటలు పనిచేయాలని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అంటుంటే... ఆదివారాలు కూడా పనిచేయాలని ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చెబుతున్నారు. నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీశాయి. తాజాగా ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఆదివారాలు కూడా పనిచేయాలని ఆయన ఉద్యోగులకు సూచించారు 'ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు. వారానికి 90 గంటలు పనిచేయాలి. అవసరమైతే ఆదివారాలు కూడా వదులుకోవాలి. ఇంట్లో తక్కువ సమయం, కార్యాలయంలో ఎక్కువ సమయం ఉంటామని భార్యలకు చెప్పాలి. ఆదివారాలు మీతో పనిచేయించలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. మీతో అలా పనిచేయించగలిగితే... నాకు సంతోషం. ఎందుకంటే నేను ఆదివారాలు పనిచేస్తున్నాను' అంటూ ఉద్యోగులతో అన్నారు. ఈ వ్యాఖ్యలు నెట్టింట్లో వైరల్ కాగా... నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. భార్య ప్రస్తావన తీసుకువస్తూ ఆయన మాట్లాడిన మాటలను కొందరు తీవ్రంగా విమర్శించారు. గతంలో నారాయణమూర్తి ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లో ఉత్పాదకత తక్కువని అన్నారు. అందుకే దేశ యువత మరిన్ని గంటలు అధికంగా శ్రమించాలన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలాగైతే కష్టపడ్డాయో... మనమూ అలా శ్రమించాలన్నారు.

భోపాల్ సెంట్రల్ జైలులో చైనా డ్రోన్ కలకలం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. భోపాల్‌లోని సెంట్రల్ జైలులో ఓ చైనా డ్రోన్ కలకలం సృష్టించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... అండా సెల్‌గా పిలిచే ఈ జైలులో భయంకరమైన గూండాలు, ఉగ్రవాదులు ఉంటారు. బుధవారం రాత్రి హైరిస్క్ సెల్ వెలుపల ఓ డ్రోన్ ఉండటాన్ని పెట్రోలింగ్ గార్డ్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన గార్డ్ పైఅధికారులకు సమాచారమిచ్చారు. ఆ డ్రోన్ చైనాకు చెందినదిగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అంతేకాకుండా అందులో రెండు లెన్సులు కలిగిఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ డ్రోన్ ఎక్కడి నుంచి వచ్చింది... ఎవరికి చెందినది అనే విషయాన్ని సాంకేతిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. భోపాల్ సెంట్రల్ జైలు దేశంలోని అత్యంత ప్రమాదకరమైన జైళ్లలో ఒకటి. ఇందులో వివిధ ఉగ్రవాద సంస్థలకు చెందిన 70 మంది ఉగ్రవాదులు హైసెక్యూరిటీ సెల్‌లో ఉన్నారు. గణతంత్ర దినోత్సవం సమీపిస్తున్న వేళ ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం అందరినీ భయాందోళనకు గురిచేస్తుంది. అధికారులు అప్రమత్తమయ్యారు.

సమాఖ్య స్ఫూర్తికి 'జమిలి' వ్యతిరేకం

జేపీసీ మొదటి భేటీలో ఎంపీల భిన్నవాదనలు

న్యూదిల్లీ: జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తొలి సమావేశం వాడివేడిగా జరిగింది. ఎంపీల మధ్య మాటలయుద్ధం చోటుచేసుకుంది. ఈ బిల్లులపై ప్రతిపక్ష ఎంపీలు అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల ఖర్చు తగ్గుతుందన్న ప్రభుత్వ వాదనను నిలదీశారు. రాజ్యాంగ మౌలిక నిర్మాణంపైన, సమాఖ్య వ్యవస్థపై దాడి చేసే ఉద్దేశంతోనే దేశంలో అన్నిస్థాయిలలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన తీసుకువచ్చారని ప్రతిపక్ష ఎంపీలు దుయ్యబట్టారు. జమిలి ఎన్నికల బిల్లులను తీవ్రంగా వ్యతిరేకించారు. అనేక రాష్ట్రాలలో అసెంబ్లీలను గడువుకు ముందుగానే రద్దుచేయడం, లోక్‌సభ పదవీ కాలంతో అన్ని అసెంబ్లీల పదవీకాలాలనూ ముడిపెట్టడం ద్వారా 'ఒకేదేశం ఒకే ఎన్నికలు' ప్రతిపాదన రాజ్యాంగ విలువలను అవహేళన చేస్తోందని విపక్ష ఎంపీలు విమర్శించారు. బీజేపీ ఎంపీలు ఈ వాదనను తోసిపుచ్చారు. ఈ రెండు బిల్లులపై ప్రశంసలు కురిపించారు. కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ప్రభుత్వ తరపు ఎంపీల వాదనలను తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ బిల్లులు సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమైనవని పునరుద్ఘాటించారు. ఈ రెండు బిల్లులనూ క్షుణ్ణంగా పరిశీలించడానికి, వివిధ కోణాలలో అభిప్రాయాలు నమోదు చేయడానికి కనీసం ఏడాది గడువు ఉండాలని కొంతమంది ఎంపీలు జేపీసీ చైర్మన్, బీజేపీ ఎంపీ పీపీ చౌధురిని డిమాండ్ చేశారు. కాగా, ఆరంభంలో జమిలి ఎన్నికల బిల్లులను రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఎదుట సమర్థించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి... ఈ సమావేశంలో అనేక ప్రశ్నలు లేవనెత్తారు. పోలింగ్ కేంద్రాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల స్థానంలో బ్యాలట్ పత్రాలు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికలు ప్రాంతీయపార్టీల ప్రాధాన్యతను తగ్గించేస్తాయని, వాటిని పక్కకు నెట్టేస్తాయని, ప్రాంతీయ పార్టీలు నామమాత్రంగా మిగిలిపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల పార్లమెంటులో బహుళ పార్టీల ప్రాతినిధ్యానికి గండిపడుతుందని, స్థానిక సమస్యలు చర్చకు వచ్చే అవకాశమే లేదని తెలిపారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు ఓటర్లతో అనుబంధం కొనసాగించే ఆవశ్యకతను ఈ జమిలి ఎన్నికల విధానం పలుచన చేస్తుందని, రెండు లేదా మూడు జాతీయపార్టీలు మాత్రమే చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తే ప్రజాప్రతినిధులకు, ఓటర్లకు మధ్య అనుబంధం తెగిపోతుందని ఆయన అన్నారు. ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలు ఈ మొదటి సమావేశంలో రాజ్యాంగ సవరణ బిల్లు (129వ సవరణ), కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు రెండింటినీ తీవ్రంగా విమర్శించారు. బిల్లులో ఉన్న లోపాలను ఎత్తిచూపారు. జేపీసీలో లోక్‌సభ నుండి 27 మంది, రాజ్యసభ నుండి 12 మంది ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న ఎంపీ లందరికీ 18 వేల పేజీలతో కూడిన నివేదికల ప్రతులను అందజేశారు. వీటిల్లో ఒకటి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదిక తాలూకూ హిందీ, ఇంగ్లీషు ప్రతులు కాగా, మరో 21 అనుబంధ పత్రాలు ఉన్నాయి.

ఆ మూడు గ్రామాలకు బట్టతల ముప్పు

ముంబై: జుట్టు అందానికి అదనపు ఆకర్షణ. అందుకే ప్రతి ఒక్కరూ జుట్టును అపురూపంగా పెంచుతారు. అందమైన, ఒత్తైన జుట్టు కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. కాస్త జుట్టు రాలుతున్నట్టు కనిపించినా అసలు తట్టుకోలేరు. ఆందోళనతో రకరకాల ఆయిల్స్, షాంపూలు మార్చేస్తూ జుట్టును కాపాడుకునే చిట్కాల కోసం వెతుకుతూ ఉంటారు. వాస్తవానికి వెంట్రుకలు రాలిపోవడానికి, పల్చబడటానికి జీవనశైలి, కాలుష్యం, ఒత్తిడి వంటివి ఎన్నో కారణాలున్నాయి. వంశపారంపర్యంగానూ చాలా మంది బట్టతల సమస్యతో బాధపడుతూ ఉంటారు. పై సమస్యలేవీ లేకపోయినా ఉన్నపళంగా ఒకే సమయంలో వందలాదిమందికి ఇలాంటి సమస్య ఎదురైన విచిత్రమైన ఘటనే మహారాష్ట్రలో జరిగింది. స్త్రీలు, పురుషులు అన్న తేడా లేకుండా మూడు గ్రామాల్లో నివసించే ప్రజలందరికీ విపరీతంగా జుట్టురాలిపోతోంది. ఒక వ్యక్తికి, ఏకంగా వారంలోనే బట్టతల వచ్చేసింది. ఈ ఉదంతం చూసి అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏం చేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందో తెలియక మదనపడుతున్నారు. వివరాల్లోకి వెళితే... మహారాష్ట్రలోని బుల్దానా జిల్లా బోర్గావ్, కల్వాడ్, హింగ్నా గ్రామాల్లోని ప్రజల్లో అకస్మాత్తుగా జుట్టు రాలే సమస్య మొదలైంది. గత కొన్నాళ్లుగా ఈ సమస్య పట్టి పీడిస్తోంది. ఒక వ్యక్తికి వారంలోనే ఉన్న జుట్టంతా ఊడిపోయి బట్టతల వచ్చేసింది. దీంతో ప్రజల్లో భయం నెలకొంది. ఎందుకిలా వెంట్రుకల కుదుళ్లు బలహీనంగా మారి విపరీతంగా రాలిపోతున్నాయో అక్కడి వారికి అర్థం కాక ప్రభుత్వ ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వెంట్రుకలు రాలే సమస్య అందరిలో వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో దీన్ని 'బట్టతల వైరస్' అని స్థానికులు పిలుస్తున్నారు. ప్రజల అభ్యర్థన మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. వారంలోనే బట్టతల వచ్చిన వ్యక్తిని, ఇదే సమస్యతో బాధతో పడుతున్న మరో 50 మందిని పరిశీలించారు.

ఈ ఘటనపై ఆరోగ్య బృందంలో షెగావ్ ఆరోగ్య అధికారి డాక్టర్ దీపాలి రహేకర్ మాట్లాడుతూ... బహుశా ఎరువుల వల్ల కలుషితమైన నీరు, ఆరోగ్య సమస్యలు ఇందుకు కారణం కావచ్చని వెల్లడించారు. బాధితుల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించామని చెప్పారు. ఈ ఫలితాలు ఆధారంగా త్వరమైన కచ్చితమైన కారణాన్ని గుర్తించి తెలియజేస్తామని అన్నారు.

ఉత్తరాదిని వణికిస్తున్న చలి

న్యూదిల్లీ: ఉత్తరాది రాష్ట్రాలను చలి వణికిస్తోంది. మరోసారి దిల్లీలో గాలి నాణ్యతలు (ఏక్యూఐ) పడిపోయాయి. గురువారం ఉదయం 7 గంటలకు దిల్లీలో 299 వద్ద ఏక్యూఐ నమోదైందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ఆదివారం నుంచి వరుసగా దిల్లీలో వాయునాణ్యతలు పడిపోతున్నాయి. దీంతో దిల్లీని పొగమంచు కమ్మేసింది. రహదారులు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ఈరోజు ఉదయం 5.30 గంటలకు 6.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లో దట్టమైన మంచు కురిసింది. 7.30 గంటలకు లక్నోలో 7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ప్రయాగ్‌రాజ్‌లో 7.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఐఎండీ తెలిపింది. హర్యానా, అంబాలాలో జనవరి 14 వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. జమ్మూకశ్మీర్‌లో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. గురువారం 8.30 గంటలకు -3.2, గుల్మార్గ్ -4.6, పహల్గామ్‌లో -10.3, బనిహాల్ 4.8, కుప్వారాలో -3.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది.

ఐక్యత లేకపోతే 'ఇండియా' ఎందుకు?

ఆప్, కాంగ్రెస్‌పై ఒమర్ అబ్దుల్లా అసంతృప్తి

న్యూదిల్లీ: ఇండియా ఐక్య సంఘటన భాగస్వామ్య పార్టీలు ఐక్యంగా ఉండాల్సిన తరుణంలో వేర్వేరుగా ఎన్నికల్లో పోటీ చేయడంపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వెలిబుచ్చారు. ఎవరికి వారు విడిగా పోటీ చేస్తే ఐక్యసంఘటనకు అర్థమేమిటని ప్రశ్నించారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వేర్వేరుగా పోటీ చేయడంపై ఆయన గురురవారం స్పందించారు. కలసికట్టుగా లేనందున కూటమికి ముగింపు పలకాలని వ్యాఖ్యానించారు. 'కేంద్రంలోని ఎన్డీయే సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా ఏర్పడిన విపక్ష 'ఇండియా' ఐక్యసంఘటనకు సంబంధించి ప్రస్తుతం ఏ సమావేశం జరగకపోవడం బాధాకరం. ఇప్పుడు ఈ కూటమికి ఎవరు నేతృత్వం వహిస్తారు?దీని అజెండా ఏంటి?అసలు కూటమి ఎలా ముందుకుసాగుతుంది?ఈ అంశాలపై చర్చలే జరగడం లేదు. 2024 ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా మెజార్టీ రాకుండా చేసేందుకు శక్తికి మించి కృషి చేసిన ఈ కూటమి భవిష్యత్తుపై ఇప్పుడు స్పష్టత లేకుండాపోయింది. మనమంతా ఐక్యంగా ఉంటామా లేదా అనే విషయంపై స్పష్టత లేదు' అని ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. 'దిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమిలోని భాగస్వామ్య పార్టీలన్నీ సమావేశం కావడానికి సిద్ధం కావాలి. లోక్‌సభ ఎన్నికల కోసమే కూటమి ఏర్పడినట్లయితే... ఇక పొత్తుకు స్వస్తి పలకండి. ఇండియా ఐక్యసంఘటనను మూసేయండి. అలాకాకుండా అసెంబ్లీ ఎన్నికల్లో కూడా విజయం సాధించాలంటే కలసికట్టుగా ఉండాలి. దీనిపై చర్చలు జరిపి ఒక స్పష్టతకు రావాలి' అని ఒమర్ అబ్దుల్లా పిలుపునిచ్చారు. కాగా.. త్వరలో దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇండియా ఐక్యసంఘటనలో భాగమైన కాంగ్రెస్, ఆప్ పొత్తుకు దూరంగా ఒంటరి పోరుకు సిద్ధమయ్యాయి. అంతేకాకుండా ఈ రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది.

విశాలాంధ్ర హైదరాబాద్

ఇళ్లపై హైటెన్షన్ విద్యుత్ వైర్లను తొలగించండి

ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు శ్రీకాంత్ కాలనీ వాసుల వినతి

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలోని శ్రీకాంత్ కాలనీలో ఇండ్లపై ఉన్న ఐటెన్షన్ విద్యుత్ లైన్ తొలగించాలని గురువారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆమనగల్లు మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో శ్రీకాంత్ కాలనీవాసులు వినతి పత్రం అందించారు. సుమారు దశాబ్దాల క్రితం ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములు ఉండేవని, ప్రస్తుతం కాలనీగా ఏర్పడి నివాసాలు ఏర్పరచుకొని నివసిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. విద్యుత్ హై టెన్షన్‌తో ఎంతోమందికి తీవ్ర గాయాల పాలైనట్లు, ఇంటిలోని గృహోపకరణ వస్తువులు దగ్ధమైనట్లు దృష్టికి తీసుకువెళ్లారు. తమ ఇళ్లకు అవరోధంగా ఉన్న కరెంటు లైన్ తొలగించి, మా సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు ఉప ముఖ్యమంత్రిని వేడుకున్నారు. స్పందించిన ఆయన వెంటనే విద్యుత్ అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, కాలనీ వాసులు ఉన్నారు.

జలమండలికి 141 మంది జూనియర్ అసిస్టెంట్లు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలికి కొత్తగా 141 మంది జూనియర్ అసిస్టెంట్స్ (పీ అండ్ ఏ, ఎఫ్ అండ్ ఏ) వచ్చారు. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 పరీక్షల్లో ఉద్యోగం సాధించిన వీరిని ప్రభుత్వం జలమండలికి కేటాయించింది. నేటి నుంచి రెండు రోజుల పాటు వీరికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. గచ్చిబౌలిలోని ఈస్కి క్యాంపస్‌లో జరుగుతున్న ఈ శిక్షణ తరగతుల్ని ఎండీ అశోక్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ 1.3 కోట్ల జనాభా కలిగిన హైదరాబాద్ మహానగరానికి జలమండలి తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ సేవలు అందిస్తోంది. ఇలాంటి మహత్తరమైన సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలన్నారు. ఓఆర్ఆర్ వరకు విస్తరించిన జలమండలిలో చేరబోతున్న మీరంతా ప్రజలకు సేవలందించడమే పరమావధిగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి ఎలాగైతే కష్టపడ్డారో అలాగే నిజాయతీగా కష్టపడి జలమండలికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా గ్రూప్-4లో ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి పెద్దపల్లిలో నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ఈస్కి డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు, సీజీఎంలు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రభు, పద్మజ పాల్గొన్నారు.

సింగరేణి కాలనీ బస్తీల్లో సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సైదాబాద్ సింగరేణి కాలనీలో ఉన్న బస్తీని, ఇందిరమ్మ ఇళ్లను పరిసర ప్రాంతాలను విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపకులు యెచ్చు సునీల్ తదితరులు గురువారం పరిశీలించారు. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను అక్కడ ఉన్న వారు సునీల్‌కి వివరించారు. చెత్తతో కాలనీ దుర్గంధబరింతగా మారి స్థానికులు ఇబ్బందులకు లోనవుగున్న పరిస్థితిని పరిశీలించిన అధికారుల తీరును వారు తప్పుపట్టారు. ఇల్లు మధ్య చెత్త నిండిపో దోమలు, ఈగలకు ఆవసంగా తయ్యారైందని, అయినా ఈ ప్రాంతంపై జిహెచ్ఎంసి అధికారులు దృష్టి సారించకపోవడం దారుణమని సునిల్ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక ఇక్కడ చీకటి అయితే గంజాయి బ్యాక్‌లు ఎక్కువ అవుతున్నాయని, గంజాయి తాగిన మత్తులు అనేక గొడవలకు కారణమవుతున్నాయని ఆయన తెలిపారు. ఇలాంటి సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా జిహెచ్ఎంసి అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గంజాయి బ్యాచ్‌లపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.హెచ్.ఎం.సి అధ్యక్షులు మహేష్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఇజ్జగిరి కమలాకర్, జి.హెచ్.ఎం.సి కార్యదర్శి గోగికర్ అనిల్, హెచ్.ఎం.సి సంయుక్త కార్యదర్శి నందాల అనిల్ కుమార్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. 43.37 కోట్ల పనులకు ఏకగ్రీవ ఆమోదం

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సర్వ సభ్య సమావేశం గురువారం కౌన్సిల్ సమావేశ మందిరంలో బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఇట్టి సమావేశంలో పలు డివిజన్‌లలో నూతన డ్రైనేజి నిర్మాణాలకు, నూతన బిటి, సి.సి.రోడ్ల నిర్మాణాలకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు సుమారు 43.37 కోట్ల రూపాయల పనులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం జరిగినది. ఇట్టి సమావేశంలో స్థానిక మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. అదే విధంగా ఇట్టి సమావేశానికి కమీషనర్ జి.రామలింగం, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నగర పాలక సంస్థ వివిధ శాఖాధిపతులు ఇతర శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

టికెట్ ఏదైనా యాప్ ఒక్కటే...

"మీ టికెట్" యాప్‌ను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇక నుంచి టికెట్ ఏదైనా 'మీ టికెట్' యాప్ ఒక్కటీ మీ దగ్గరుంటే చాలు. ఆర్టీసీ, మెట్రో టికెట్లు, తెలంగాణలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో దర్శనం, ఇతర సేవలకు సంబంధించిన టికెట్లు, పార్కులు, ఇతర పర్యాటక స్థలాల్లో క్యూలైన్లలో నిరీక్షించాల్సిన అవసరం లేకుండా ఎంట్రీ టికెట్లను ఒకే ఒక్క క్లిక్‌తో మీ సేవ రూపొందించిన టికెట్ యాప్‌లో బుక్ చేసుకోవచ్చు. తెలంగాణా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరీ (ఈఎస్డీ) రూపొందించిన ఈ 'మీ టికెట్' యాప్‌ను ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు గురువారం సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'ప్రజలకు సుపరిపాలన అందించాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. టెక్నాలజీ సాయంతో పౌర సేవలను ప్రజల ముంగిటకు చేరవేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియలో సంబంధిత నిపుణులను భాగస్వామ్యం చేస్తున్నామని, అన్ని రకాల టికెట్ బుకింగ్స్‌ను ఒకే ప్లాట్ ఫాంపైకి తెచ్చేందుకు వీలుగా ఈ యాప్‌ను రూపొందించామని, రాబోయే రోజుల్లో ఇలాంటి తరహా యాప్ లను మరిన్ని అందుబాటులోకి తీసుకొస్తాం' అని వివరించారు. 'ఈ యాప్‌లో తెలంగాణలోని 15 ప్రముఖ దేవాలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్ ప్రదేశాలు, జూ, మెట్రో, ఆర్టీసీ, మ్యూజియాలు, ప్లే అండ్ ఎంటర్ టైన్ మెంట్ జోన్స్‌కు సంబంధించిన టికెట్లను తీసుకోవచ్చని, జీహెచ్ఎంసీ పరిధిలోని కమ్యూనిటీ హాళ్లు, జిమ్‌లు, స్పోర్ట్ కాంప్లెక్స్‌లను బుకింగ్ చేసుకోవచ్చని, మీరు ఎంచుకున్న లొకేషన్‌కు సమీప ప్రాంతాల్లోని చూడదగిన ప్రదేశాలుంటే ఆ సమాచారం కూడా యాప్‌లో ఆటోమేటిక్‌గా కనిపిస్తుందని తెలిపారు. 'ఈ యాప్‌ను చాలా సులువుగా వినియోగించుకోవచ్చని, యూపీఐ ద్వారా చెల్లింపులు చేయోచ్చని, ఇతర ప్లాట్ ఫాంల మాదిరిగా ఈ యాప్‌లో అదనంగా ఎలాంటి ఛార్జీలను వసూలు చేయమని వివరించారు. కార్యక్రమంలో మీ సేవ కమిషనర్ రవి కిరణ్, పరిశ్రమల శాఖా కమిషనర్ డా.జి.మల్సూర్, జూపార్క్ డైరెక్టర్ డా.సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ బీసీ, సాధారణ

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎస్సీ ఎస్టీ బీసీ సాధారణ గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. 2025 -26 విద్యా సంవత్సరంలో వివిధ తరగతులలో ఆంగ్ల మాధ్యమం ప్రవేశానికి ఫిబ్రవరి 1 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తులను www.tgcet.cgg.gov. in ఆన్‌లైన్ ద్వారా కాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. కులం, ఆదాయం, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు, ఫోటో సమర్పించవలసి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో ఐదవ తరగతిలో ప్రవేశాలు, ఎస్టీ గురుకులాల్లో ఆరు నుండి 9వ తరగతిలో ప్రవేశాలు, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ ఎస్ గౌలిదొడ్డి, అలుగునూరు సిఓఈ లలో 9వ తరగతిలో ప్రవేశాలు కలవు, టీజీటీడబ్ల్యూఆర్ఈఎస్, ఖమ్మం, పరిగి ఎస్ఓఈలలో 8వ తరగతి ప్రవేశాలు కలవు, టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్గిరి ఫైన్ స్కూల్‌లలో ఆరవ తరగతిలో ప్రవేశాలు కలవని కలెక్టర్ తెలిపారు. సర్టిఫికెట్స్ సత్వర జారీ కోసం జిల్లా కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడ పత్రికలను జిహెచ్ఎంసి కమిషనర్ ఐలంబర్తి తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. బహిరంగంగా చెత్తను కాల్చడంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కమిషనర్ అభిప్రాయపడ్డారు. బహిరంగ స్థలాలో వ్యర్థాలను కాల్చడం గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వాయు కాలుష్యానికి ముఖ్యమైన కారణమన్నారు. బహిరంగంగా కాల్చే వ్యర్థాల నుండి వచ్చే హానికరమైన గాలి నాణ్యతను దిగజార్చడమే కాకుండా గుండె జబ్బులు, ఇతర ఆరోగ్య సమస్యలు కలిగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారులు టీ.జి.పి.సి.బి. బి.నాగేశ్వరరావు, ఆర్.క్రాంతి పాల్గొన్నారు.

బోలక్‌పూర్, బౌద్ధనగర్‌లలో పర్యటించిన మేయర్

సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గురువారం బోలక్ పూర్, బౌద్ధ నగర్ డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి శానిటేషన్, రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, నాలాలను పరిశీలించారు. ఈ పర్యటనలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవికిరణ్, సిఈ భాస్కర్ రెడ్డి, ఎస్.ఈ రత్నాకర్, కార్పొరేటర్లు మొహమ్మద్ గౌస్, కంది శైలజ, స్థానికులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడమే కాకుండా, స్థానికులు తమ సమస్యలను మేయర్ దృష్టికి తీసుకురావడంతో సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపేలా మేయర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా శానిటేషన్, మంచినీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రాధాన్యతని, సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ అన్ని వేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. ఆయా డివిజన్లలో సమస్యలపై స్థానికులతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ ఆదేశాలు జారీ చేశారు. బోలక్‌పూర్‌లో ఇంటర్ లింక్ రోడ్లకు, రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓపెన్ గ్రౌండ్ కమ్యూనిటీ హాల్ పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. స్ట్రీట్ లైట్స్ కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా, వెంటనే ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.

బౌద్ధ నగర్‌లో...

రోడ్లు, బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. నాలా కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సంబంధించి నివేదికను ఇవ్వాలని కోరారు. ఈ పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రజల నుంచి (పాజిటివ్) మంచి స్పందన లభించింది. మేయర్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు క్షేత్ర పరిధిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: గచ్చి బౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో రూ.43.00 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం, కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం 3 కోట్ల రూపాయల లక్షల రూపాయలతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని, దానిలో భాగంగా నల్లగండ్ల హుడా కాలనీలో 43 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీల వాసులకు ఉపశమనం లభించింది అని, మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు. అదేవిధంగా గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ ఈరోజు సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాల సంతోషకరం అని అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని, అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు.

స్లాటర్ హౌస్‌ను తక్షణమే ఆధునీకరించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: జియాగూడ స్లాటర్ హౌస్‌ను ఆధునికీకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆరెకటిక మండేదార్ అసోసియేషన్, చర్మకష్ వర్కర్స్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆరెకటిక పలు సంఘాల ప్రతినిధులతో కలిసి ఆరెకటిక మండేదార్ అసోసియేషన్ అధ్యక్షులు కే.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీ.అశోక్‌కుమార్, చర్మకష్ సంఘ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీ. శశికాంత్‌రావు, ప్రధాన కార్యదర్శి పీ.దర్శన్‌లు మాట్లాడుతూ జియాగూడ స్లాటర్ హౌస్ మేకలు, గొర్రెలు ప్రధాన వర్గాలకు ఎస్సీ, ఎస్టీ, ఖుర్షి-ముస్లిం ప్రజల అట్టడుగు వర్గాల జీవనాధారం అని తెలిపారు. స్లాటర్ హౌస్, మండిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 20000 మంది ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. జియాగూడ స్లాటర్ హౌస్‌లో లైవ్ మేకలు, గొర్రెలు, పార్కింగ్ విక్రయానికి రుసుము ద్వారా జీహెచ్ఎంసీకి సంవత్సరానికి మూడు కోట్ల పైగా ఆదాయం వస్తుందని తెలిపారు. రోడ్లు శుభ్రం చేయడం, వర్షపు నీటి బురద తొలగించడం వంటి సౌకర్యాలు లేవని జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అణగారిన వర్గాల ప్రజలు తమ ప్రాథమిక అవసరాలు తీర్చుకుంటున్న కబేలా వద్ద జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేయకుండానే మూడు కోట్ల పైగా ఆదాయం వస్తుందని చెప్పారు. జియాగూడ స్లాటర్ హౌసును ఆధునికరించాలని గతంలోని ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాగ్దానాలు చేసి హామీలను నిలబెట్టుకోకపోవడం చాలా విచారకరమని అన్నారు. గత 20 ఏళ్లుగా చెప్పలేనంత ఆర్థిక, శారీరక మానసిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వమే ఆధునిక స్లాటర్ హౌస్ నిర్మాణం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని వేడుకున్నారు. ఈ సమావేశంలో ఆరెకటిక ఆఫ్ఫాల్స్ అసోసియేషన్, ఏకే. గోట్ అండ్ షిప్ హెడ్ రోస్టర్స్ అసోసియేషన్, ఏకే ఆఫ్ఫాల్స్ క్లీనర్ అసోసియేషన్, ఏకే రిటైర్డ్ మీట్ వెండర్స్ అసోసియేషన్ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నేడు

జిల్లా ఉపాధి కల్పన అధికారి వందన

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిరుద్యోగ యువత కోసం నేడు శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఏ.వందన ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 10న ఉదయం 11.00 గంటల నుంచి నిర్వహించు జాబ్ మేళాలో విశాల్ మెగా మార్ట్ వారు ఎస్ఎస్సి విద్యార్హత జీతం 12000 వయోపరిమితి 35 సంవత్సరాల, టాటా స్ట్రైవ్ వారు పదవ తరగతి నుండి డిగ్రీ విద్యార్హత, జీతం 15000, 30 సంవత్సరాలలోపు గల పురుషులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 10, 2025 రోజున ఉదయం 11.00 గంటలకు ఉపాధి కల్పన కార్యాలయం హైదరాబాద్, ఐటిఐ క్యాంపస్, మల్లెపల్లి, నైస్ హాస్పిటల్ దగ్గర హాజరు కాగలరని ఆమె తెలిపారు.

స్పోర్ట్స్ డే ను ప్రారంభించిన గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఈఆర్ స్టేడియంలో సెయింట్ ఇసాక్ అడ్వెంట్ హై స్కూల్ వారి రూబీ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా నిర్వహించిన స్పోర్ట్స్‌డే కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మాజీ ఎంపీ మహమ్మద్ అజారుద్దీన్‌లు కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ సెయింట్ ఇసాక్ అడ్వెంట్ హై స్కూల్ వారి ఆధ్వర్యంలో రూబీ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా నిర్వహించిన స్పోర్ట్స్‌డే కార్యక్రమం నిర్వహించడం చాలా అభినందించదగ్గ విషయం అని, టగ్ ఆఫ్ వార్, త్రో బాల్, ఖో ఖో, క్రికెట్, రన్నింగ్ వంటి ఆటలు నిర్వహించడం జరుగుతుంది. పిల్లలలో దాగిన సృజనాత్మకతను బయటకి వెలికితీయడానికి ఎంతగానో తోడ్పడుతుందని, పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ఎంతగానో ముఖ్యం అని, క్రీడలతో శారీరక శ్రమతో పాటు మానసిక ఉల్లాసం కలుగును అని, పిల్లలు చదువులతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని అప్పుడే మంచి భావిపౌరులుగా దేశానికి సేవలు అందిస్తారు అని, తల్లిదండ్రులకు, దేశానికి మంచి సేవలు అందించాలని, విద్య అభివృద్ధి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, గణేష్ ముదిరాజ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, అక్బర్ ఖాన్, సరేందర్ బల్లా, సెయింట్ ఇసాక్ అడ్వెంట్ హై స్కూల్ ఇసాక్ లజర్స్, ప్రిన్సిపాల్ కమర్ జాన్ ఇసాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొదలగు వారు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - ఆమనగల్లు: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆమనగల్లు, కడ్తాల్ మండల కేంద్రాలలో కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. నాగర్ కర్నూల్ జిల్లాలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు వెళుతున్న ఆయనను స్వాగతం పలికి సన్మానించారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ సభ్యుడు బాలాజీ సింగ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇండస్ఫుడ్ 2025లో తెనాలి డబుల్ హార్స్ గ్రూప్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ఢిల్లీ ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్‌లో జరిగిన ఇండస్ఫుడ్ 2025లో ప్రీమియం వంట సామాగ్రి ఉత్పత్తుల్లో అగ్రగామి తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ పాల్గొంది. ఈ ఎక్స్‌పో జనవరి 8న ప్రారంభమైంది. ఈనెల 10వ తేదీ వరకు జరగనుంది. ఈ ఎక్స్‌పోలో 20 దేశాల నుంచి ఆహార ప్రాసెసింగ్ సంస్థలు, 1,800 పైగా ప్రదర్శకులు, 5,000 పైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ఆహార పదార్థాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో ఈ వేదిక కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఇండస్ఫుడ్ మన గ్రామీణ ఆహార సంస్కృతి గొప్పతనాన్ని, సంప్రదాయాలను ముందుకు తీసుకువెళ్ళే అవకాశాన్ని అందిస్తుందని చెప్పారు. ఇది మన గ్రామీణ వైద్యాన్ని గ్లోబల్ మార్కెట్లకు తీసుకువెళ్ళే ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. గత రెండేళ్లుగా ఇండస్ఫుడ్‌లో పాల్గొంటున్నామని తెలిపారు. ఆరోగ్యంపై మక్కువ కలిగిన వినియోగదారులు, భోజనప్రియులను ఆకట్టుకునే ఉత్పత్తులను ఈ అంతర్జాతీయ వేదిక ద్వారా ప్రదర్శించామని చెప్పారు. గ్రామీణ ఆహారాన్ని, పోషక విలువను అంతర్జాతీయ భోజనాల్లోకి తీసుకురావడమే మా లక్ష్యమని తెలిపారు.

జలమండలి అధికారులతో ఎండీ, ఈడీ సమీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : వేసవిలో నీటి డిమాండ్ ను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత వేసవిలో అధికంగా ట్యాంకర్లు బుక్ చేసుకున్న ప్రాంతాల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది ట్యాంకర్ బుకింగ్, నీటి సరఫరా, డెలివరీ తదితర వివరాలను పరిశీలించారు. ఈసారి నీటి డిమాండ్‌ను మరింత సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు. అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్లు, నీటి మోతాదు పెంచుతామని చెప్పారు. గతంలో అధికంగా ట్యాంకర్లు బుక్ చేసిన వినియోగదారులను సర్వే చేసి గుర్తించారు. వీరి ప్రాంగణాల్లో బోర్లు, భూగర్భ జలాలు ఎండిపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఇలాంటి వినియోగదారుల ఇళ్లల్లో సర్వే చేపట్టామని తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వారు ట్యాంకర్ల యజమానులతో సమావేశమయ్యారు. వేసవిలో ట్యాంకర్ల పరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా కావాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, సీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ పొదుపులను ప్రేరేపిస్తున్న జార్

Jar

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : జార్, ఒక వినూత్న వెల్త్ టెక్ ప్లాట్ఫారమ్, వినియోగదారుల కోసం పొదుపు, బంగారంలో పెట్టుబడిని విప్లవాత్మకంగా మారుస్తోందన్నారు. సంపద నిర్మాణాన్ని అందరికీ అందుబాటులోకి తెస్తోందన్నారు. రోజువారీ చిన్న మొత్తాలను ఆదా చేయడానికి వినియోగదా రులను అనుమతిస్తుందన్నారు. జార్ సౌలభ్యంపై దృష్టి పెడుతుందని, పెద్ద, ఒక పర్యాయ పెట్టుబడుల ఒత్తిడి లేకుండా కాలక్రమేణా సంపదను కూడబెట్టు కోవడానికి వీలు కల్పిస్తుందన్నారు. యాప్ యొక్క రోజువారీ పొదుపు ఫీచర్ మధ్యతరగతి కుటుంబాలు అప్రయత్నంగా పొదుపు చేయడాన్ని సాధ్యం చేసింది. వారి ఆర్థిక లక్ష్యాలను అతుకులు లేకుండా వినియోగదారు స్నేహపూర్వక పద్ధతిలో సర్దుబాటు చేస్తుందన్నారు. యుపిఐ 2.0ని ఉపయోగించడం ద్వారా, ఆటోమేటెడ్ రౌండ్-అప్ల వంటి ఫీచర్లను ప్రారంభించడం ద్వారా, రోజువారీ లావాదేవీలను విలువైన పెట్టుబడులుగా మార్చడానికి మేము వినియోగదారులను శక్తివంతం చేస్తామని జార్ వ్యవస్థాపకుడు సిఈఓ నిశ్చయ్ అన్నారు. అతుకులు లేని ఉపసంహరణ ప్రక్రియ ఒకసారి నా ఇంటికి గంటల వ్యవధిలో అద్దాన్ని పొందడంలో సహాయపడింది! నాకు, జార్ పొదుపును ఒక ఎంపికగా కాకుండా, మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి అవసరమైనదిగా పునర్నిర్వచించారు అని ఆయన చెప్పారు.

మాదిగ విద్యార్థి యువగర్జన

కరపత్రం విడుదల చేసిన మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మాదిగలకు తెలంగాణ రాష్ట్రంలో 12శాతం రిజర్వేషన్ కల్పించాలని అదేవిధంగా జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రధాన డిమాండ్‌తో మాదిగ విద్యార్థి, మాదిగ సంఘాల ఐకాసా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2 ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో చేపట్టిన మాదిగ విద్యార్థి యువగర్జన బహిరంగ సభ కరపత్రాన్ని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో విడుదల చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి, మాదిగ, రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు వక్కలగడ్డ చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నంద్రు నరసింహ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, దళిత ప్రజా సంఘం అధ్యక్షులు తీగల యాదగిరి, మాదిగ జేఏసీ నాయకులు బోర్ర సురేష్, అంకపాక సంపత్, కొత్తపల్లి కృష్ణ, జోగు గణేష్, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఎస్‌హెచ్‌జీల ఏర్పాటుపై ఫోకస్ పెట్టండి

రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎల్ఆర్ఎస్ (అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం) దరఖాస్తు పరిష్కారం, కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో రాష్ట్రంలోని 142 పురపాలక సంఘాల కమిషనర్‌లతో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్ సమావేశం నిర్వహించి ఎల్ఆర్ఎస్, రెవెన్యూ, రెవెన్యూయేతర పన్ను వసూలు లక్ష్యం, ఇప్పటి వరకూ సాధించిన లక్ష్యం, ఇంకా చేయాల్సిన పన్ను వసూళ్లు, భువన సర్వే, మెప్మా కార్యకలాపాల ప్రగతి, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తు పరిష్కారం వేగవంతం చేసేందుకు క్లియర్ పట్టా భూములు ఉండి, అనుమతులు లేని లే అవుట్‌లను వేగంగా క్రమబద్ధీకరణ చేసేందుకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పాదదర్శకంగా, మార్చి నెల చివరికల్లా ఈ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. అర్హమైన ప్రతి మహిళను స్వయం సహాయక సంఘంలో చేర్పించాలని ప్రభుత్వం ఏజెండాగా పెట్టుకుందన్నారు. మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3000 కోట్ల రూపాయలను బ్యాంక్ లింకేజి కింద ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకుంటే, ఇప్పటి వరకూ 2500 కోట్ల రూపాయలను సంఘాలకు అందించడం జరిగిందన్నారు. ఫలితంగా ప్రభుత్వం బ్యాంక్ లింకేజ్ లక్ష్యంను 5000 కోట్లకు పెంచిందన్నారు. మిగతా 2500 కోట్లను సంఘాలకు అందించేందుకు మున్సిపల్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. పురపాలిక పరిధిలో అర్హత ఉండి సంఘంలో సభ్యులు లేని ప్రతి మహిళను కొత్తగా సంఘాలను ఏర్పాటు చేసి సభ్యులుగా చేర్పించాలని చెప్పారు. వచ్చే మార్చిలోగా 50 శాతం, జూన్‌లోగా మిగతా 50 శాతం మందిని మొత్తం 100 శాతం మహిళలను 6 నెలల్లోగా సభ్యులుగా చేర్పించాలని చెప్పారు. సంఘ మహిళల్లో ఎంటర్ ప్రెన్యూర్ షిప్ స్కిల్‌లను పెంపొందించాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) ద్వారా ఏర్పాటు చేసే సౌర విద్యుత్తు ప్లాంట్ల టెండర్లను త్వరలో ప్రభుత్వం ఖరారు చేయనున్న నేపథ్యంలో మెప్మా స్వయం సహాయక సంఘాల ద్వారా పట్టణాల పరిధిలోని ఖాళీ స్థలాలు, రిజర్వాయర్‌లు, వాటర్ ట్యాంక్‌లపై సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాట్లకు ప్రతి పాదనలు సిద్ధం చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో శాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం వచ్చే 6 నెలల్లో 48 మున్సిపల్ కమిషనర్‌లు, 300 టౌన్ ప్లానింగ్ అధికారులను నియమించనుందన్నారు. భువన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పురపాలక శాఖ కమిషనర్ డాక్టర్ టి.కే.శ్రీదేవి మాట్లాడుతూ పురపాలిక పన్నుల వసూళ్లకు కమిషనర్‌లు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం ముఖ్య కార్యదర్శి, కమిషనర్ పురపాలక శాఖ వాల్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి, ఆలేరు, జనగామ స్టేషన్లలో

ముంబై రైలు నిలిపేలా ప్రయత్నిస్తాం

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ముంబై కి వెళ్లే రైలును భువనగిరి, ఆలేరు, జనగామలలో నిలిపే విధంగా అధికారులతో మాట్లాడతానని, కురుమ సంఘం ముంబై వారికి అండగా ఉంటానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ముంబైలోని బాంద్రాలో కురుమ సంఘం ముంబై 2025 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఇక్కడ నివాసం ఉంటున్న వారంతా ఆలేరు, జనగామ పరిసర ప్రాంతాల వారని వారికి ముంబైకి వచ్చిపోయేందుకు గాను రైలును భువనగిరి, ఆలేరు, జనగామ రైల్వే స్టేషన్లలో ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారని వారి కోరిక మేరకు రైల్వే మంత్రితో మాట్లాడి ఆయా రైల్వేస్టేషన్లో ముంబై రైలు నిలిచేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా ఇక్కడ నివాసం ఉంటున్న వారి సమస్యలను బాంద్రా స్థానిక ఎమ్మెల్యేతో పాటు ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైన అన్ని పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రధానంగా ముంబై నగరంలో కురుమ కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని ఆయా కుల ధృవీకరణ పత్రాలు మంజూరయ్యేలా చర్చిస్తాను అన్నారు. నల్గొండ జిల్లా గౌర్రె కాపరుల సహకార సంఘం ఉపాధ్యక్షులు మంగ సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రే జహంగీర్లు మాట్లాడుతూ కుర్మ సంఘం ముంబై శాఖ వారు ప్రత్యేకంగా క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో చేపట్టడం సంతోషకరం అన్నారు. ఎమ్మెల్సీ అనిల్ మాట్లాడుతూ ముంబై నగరంలో నివాసముండే కురుమలకు పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటానని, కురుమ సంఘం కార్యాలయానికి స్థలాన్ని అందించేందుకు ప్రభుత్వంతో మాట్లాడతానని హామీని ఇచ్చారు. నల్గొండ జిల్లా గౌర్రె కాపరుల సహకార సంఘం ఉపాధ్యక్షులు మంగ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రే జహంగీర్, కురుమ సంఘం ముంబై గౌరవ అధ్యక్షులు పుప్పాల సత్తయ్య, జట్ట కృష్ణ, కుండే చంద్రయ్య, జూకంటి రామ్ చందర్, అధ్యక్షుడు గవ్వల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కెమిడి అనిల్, ఉపాధ్యక్షుడు ఐల చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి మోటెసిద్దులు, కోశాధికారి కంచర్ల గణేష్, సలహాదారులు మలగ వెంకటేష్, గాదరి మల్లేష్, పుప్పాల చిన్న సత్తయ్య, నోముల రమేష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల శ్రద్ధతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

అథ్లెట్ శంకర్ నాయక్

విశాలాంధ్ర- కొత్తూరు : పాఠశాలలో యాజమాన్యం, ఉపాధ్యాయులు వారికి తోడుగా విద్యార్థుల తల్లిదండ్రుల కృషి చేస్తేనే చిన్నారి విద్యార్థులకు బంగారు భవిష్యత్తు నిర్మించవచ్చని అంతర్జాతీయ స్థాయి అథ్లెట్ ఇండియా పి.శంకర్ నాయక్ అన్నారు. నందిగామ మండలం, రంగాపూర్ గ్రామ శివారులో గల హిప్పో క్యాంపస్ పాఠశాలలో గురువారం నిర్వహించిన రెండో వార్షికోత్సవం, ఒలంపిక్ ఒడిస్సి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం శంకర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మాణం అవుతుం దని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు ఇష్టంగా కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలని అన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను యాజ మాన్యం, తల్లిదండ్రులు గుర్తించి వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో చిన్నారులు అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని ఆయన అన్నారు. క్రీడల పట్ల ఆసక్తి చూపే విద్యార్థులు చదువుల్లో కూడా ముందుంటారని అన్నారు. చక్కటి చదువుతోనే భవిష్యత్తు ఉంటుందని, అదేవిధంగా క్రీడ మైదానంతోనే గొప్ప లీడర్‌గా ఎదిగే అవకాశం ఉంటుందని చెప్పుకొచ్చారు. విద్యార్థులు ఆన్లైన్ బోధన కోసం చూసే ఫోన్లపై తల్లిదండ్రులు గ్రహించి వారికి సరైన సమయా ల్లోనే అప్పగించాలని, నిర్లక్ష్యం వహిస్తే అదే ఫోన్ ద్వారా వారి భవిష్యత్తు బజార్ పాలు అవుతుందని అవగాహన కల్పించారు. తాను చదువుకున్న సమయంలో ఆర్థిక ఇబ్బందులతో తన తల్లిదండ్రులు తనకు చదువుకు సహకరించుకున్న తన సొంత టాలెంట్‌తో చదువుకొని కష్టపడి జిల్లా జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి గొప్ప పేరు సాధించానని గుర్తు చేశారు. ఈ వేడుకల్లో చిన్నారి విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరు లను ఆకట్టుకున్నాయి. సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎమ్మెస్ లలిత రెడ్డి, కరస్పాండెంట్ పూజ రామ్ చందాని, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి పాఠశాల అడ్మినిస్ట్రేటర్ శ్రావణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ హఫీజ్‌పేట్ డివిజన్ అధ్యక్షులుగా కైతాపురం జితేందర్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి చేతుల మీదుగా భారతీయ జనతా పార్టీ హఫీజ్ పేట్ డివిజన్ అధ్యక్షులుగా ఎన్నికైన పత్రాన్ని కైతాపురం జితేందర్ స్వీకరించారు. హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులుగా ఎన్నికైన కైతాపురం జితేందర్ మాట్లాడుతూ హఫీజ్పేట్ డివిజన్ బిజెపి అధ్యక్షులుగా ఎన్నిక చేసినందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు సామ రంగారెడ్డికి, శేర్లింగంపల్లి నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవి కుమార్ యాదవ్‌కి, శేరిలింగం పల్లి అసెంబ్లీ సీనియర్ నాయకులకు, బీజేపీ అధిష్ఠానం నాపై నమ్మకం ఉంచి హఫీజ్ పేట్ డివిజన్ బిజెపి అధ్యక్షులుగా ఎన్నిక చేసినందుకు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు, డివిజన్‌లో బీజేపి పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని, డివిజన్‌లోని సమస్యలపై పోరాటం చేస్తూ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఈ సందర్భంగా బిజెపి హఫీజ్ పేట్ డివిజన్ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అని అన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు జరపాలి

ఎంపీ ఆర్ కృష్ణయ్య

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా బిసి రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతంకు పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చట్టం చేసి 42 శాతం పెట్టవచ్చని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్షలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి అధ్యక్షతన 20 బీసీ కుల సంఘాల ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారని, వెంటనే ఇప్పుడు 13 కార్పొరేషన్లకు తోడుగా మరో 40 కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న 11 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలన్నారు. పార్లమెంట్‌లో బిసి బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బిసిలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బిసిల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలన్నారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. పంచాయతీరాజ్ సంస్థలో బిసి రిజర్వేషన్లను 50 శాతంకు పెంచి, ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలన్నారు. బిసిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్‌పై ఉన్న క్రీమీ లేయర్ ను తొలగించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు నందగోపాల్, పగిళ్ల సతీష్, రాందేవ్, మల్లేష్, రమేష్ వీరన్న, రఘుపతి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి పాటుపడాలి : కొలను

విశాలాంధ్ర-దుండిగల్ : హైందవ ధర్మాన్ని కాపాడుతూ ఆలయ అభివృద్ధికి పాటుపడాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 డివిజన్ జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మి వెంకటేశ్వరాస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ చారీ, రవీందర్, రాజు, వేణు గౌడ్ నియమితులైన సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ కొలను హన్మంత్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మ రెడ్డి, క్రిష్ణ గౌడ్, రషీద్, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: మౌలిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయమని కార్పొరేటర్ రషీదా మహ్మద్ రఫీ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి 128 చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదా మహ్మద్ రఫీ గురువారం జిహెచ్ఎంసి అధికారులతో కలిసి రోడా మెస్త్రీ నగర్-బి లో పాదయాత్ర కార్యక్రమం చేపట్టి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రషీదా మహ్మద్ రఫీ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై దృష్టి సారించి రోడ్లు, మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరిచే దిశగా తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిరీష, ఏఈ. నాగరాజు, హెచ్‌డబ్ల్యు ఎంఎస్ మేనేజర్ ఝాన్సీ, ఏంటమలజీ ఏఈ అరుణ్ కుమార్, ఈయఫ్ఏ అశోక్, సాయి, ఎస్ఎస్ఏ గోపాల్, జీవన్, ఎలక్ట్రీషియన్ నరేష్, వాటర్ లైన్ మ్యాన్ గంగాధర్, బిఆర్ఎస్ పార్టీ సభ్యులు, స్థానిక నాయకులు షఫీ భాయ్, సర్వర్ భాయ్, యూసుఫ్ భాయ్, హనీజ్ భాయ్, వాహిద్ భాయ్, షబ్బీర్ భాయ్, నయీమ్ భాయ్, వాహబ్ భాయ్, సలీం భాయ్, సిద్ధిక్ భాయ్, ముజాహిద్ భాయ్, అజర్ భాయ్, ఏజాజ్ భాయ్, సాయి కిరణ్ గౌడ్, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడానికి కృషి చేస్తా



విశాలాంధ్ర - మేడిపల్లి: ఇక్కుర్తి గ్రామ అభివృద్ధి ప్రదాత పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి తమ స్వగ్రామాన్ని అన్ని రంగాలలో ముందు ఉంచి విద్యా రంగాన్ని మెరుగుపరచడానికి, నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తానని అన్నారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ చక్కగా చదువుకోవాలని, మీకు అవసరమైన అన్నిరకాల వసతులు సమాకూరుస్తానని, 10వ తరగతిలో మంచి గ్రేడ్ తెచ్చుకొని ఉపాధ్యయులకు, తల్లిదండ్రులకు, ఊరికి మంచిపేరు తేవాలని తెలిపారు. ఉపాధ్యాయుల కొరతను తీరుస్తూ, విద్యవాలంటీర్‌లను కొనసాగిస్తానని తన పుట్టిన ఊరి ఋణం తీర్చుకోవడానికి నాకు ఒక గొప్ప అవకాశంగా భవిస్తున్నని తెలిపారు. అదే విధంగా పాఠశాలలో విద్యా వాలంటీర్‌కు గురువారం ఉదయం సాలరీని ప్రధానోపాధ్యాయులు సమక్షంలో అందించారు. అనంతరం గ్రామ వాస్తవ్యులు కోరుటూరి బాలరాజు అనారోగ్యంతో బాధపడటంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమరేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసచార్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

ఎర్రజెండా అండతోనే పేదలకు న్యాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-బ్యూరో తిరుపతి: ఎన్నికల హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటం చేస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రకటించారు. ఎర్రజెండా నీడన ఉంటేనే పీడిత వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండు చేస్తూ తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం సీపీఐ అధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వేలాదిగా పేదలు తరలివచ్చారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల డబ్బు ఇవ్వాలన్నారు. ఇది సీపీఐ డిమాండ్ కాదని... సాధారణ ఎన్నికల సందర్భంగా నాటి ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ అని రామకృష్ణ గుర్తు చేశారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే రాష్ట్రంలోని 26 జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఒకరోజు ముందుగా తిరుపతిలో ఈ కార్యక్రమం చేపట్టామని, మిగిలిన 25 జిల్లాల్లో శుక్రవారం నిరసనలు కొనసాగుతాయని రామకృష్ణ చెప్పారు. ప్రభుత్వానికి నిధుల కొరత లేదని, బడ్జెట్ సైతం రూ.2.94 లక్షల కోట్లు ప్రతిపాదించారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అర్హులైన మహిళలకు నెలకు రూ.1,500 వంతున ఆర్థిక సాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆయన అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా హామీలు అమలు చేయలేదన్నారు. చంద్రబాబు మాట తప్పడం మామూలేనని రామకృష్ణ విమర్శించారు. చంద్రబాబు అధికారంలో లేనపుడు ఒకమాట... అధికారంలోకి వచ్చాక ఒకమాట చెబుతారన్నారు. ఏమైనా నిలదీస్తే నిధులు లేవని, జగన్ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసిందని చంద్రబాబు చెబుతున్నారన్నారు. ఖజానా విషయం తమకు తెలియదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చా లన్నారు. ఇళ్ల స్థలాలు సాధించే వరకు ఎర్రజెండా వదలకూడదని ఆయన పేదలకు పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ జగన్ హయాంలో పట్టణ ప్రాంతాల్లో ఒక సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంటు వంతున ఇచ్చిన స్థలాలు ఎందుకు కొరగాకుండా పోయాయన్నారు. ఎన్డీయే నేతల హామీ మేరకు పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు వంతున స్థలాలు ఇవ్వాలన్నారు. ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీ గుర్తు చేయడానికే ఈ నిరసన చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే గ్రామ, వార్డు సచివాలయాలు, మండల స్థాయిల్లో ఇంతకుముందు పేదలతో వినతిపత్రాలు అందజేశామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు నిరంతర పోరాటం చేయాల్సి ఉందన్నారు. పోరాటం చేస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని హరినాథరెడ్డి స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు మాట్లాడుతూ తిరుపతిలో లక్ష పేద కుటుంబాలు ఉన్నాయని, వారందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఇంటి స్థలాలపై చంద్రబాబు ఇచ్చిన హామీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయలక్ష్మి, శివారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు డాక్టర్ జనార్దన్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, ప్రభాకర్, రాధాకృష్ణ, నదియా, నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, చంద్రశేఖర్ రెడ్డి, చలపతి, ఉదయ్, రామకృష్ణ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం వల్లే సాగునీటి కష్టాలు: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-పాలకొండ(పార్వతీపురం మన్యంజిల్లా): శ్రీకాకుళం జిల్లాకు జీవనాడి అయిన వంశధార నదీ జలాల వినియోగంపై పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రాంతం సాగునీటి కష్టాలు ఎదురుకోవాల్సి వస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు కాట్రగడ్డ బి వద్ద వంశధార ప్రాజెక్టుకు నీటి మళ్లింపు స్థలాన్ని గురువారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశధార నదిలో 115 టీఎంసీలు నీరు ఉండగా 1977లో జరిగిన ఒప్పందం ప్రకారం రెండు రాష్ట్రాలు నదిలో ఉన్న నీటిని చెరో సగ భాగం వినియోగించుకోవాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్ల పార్వతీపురం మన్యం జిల్లా బామిని మండలం నేరేడు గ్రామం వద్ద కట్టవలసిన డ్యాము నిర్మాణం చేయకపోవడంతో ముంపుకు గురవుతున్న భూభాగాన్ని చూపుతూ ఒడిశా ప్రభుత్వం కోర్టుకు వెళ్లి అనేక అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. ట్రిబ్యునల్ తీర్పు యిచ్చిన పాలకులు పట్టించుకోపోవడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా రైతులు వివరించిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతామని తెలిపారు.

ఎత్తిపోతల పథకం నిర్మాణం అడ్డంకిగా ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని, లేదంటే ఉద్యమం తప్పదని ఈశ్వరయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు భోగాపురం అప్పలనాయుడు, మండల అధ్యక్షులు గుళ్లపిల్లి పెద లక్ష్మీనాయుడు, కార్యదర్శి కూర బాబురావు నాయుడు, రైతులు భూపతిరావు, ప్రభాకర్‌రావు బోధిపు శేషగిరినాయుడు, నాయుడు గౌడ్‌నాయుడు, గిరిజన సంఘం జిల్లా నాయుకులు కె మన్మధరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయుకులు టీ జీవన్, గరుగుబిల్లి సూరయ్య, గోపి పాల్గొన్నారు.

ఏకంగా వైకుంఠానికే పంపుతారా...

షర్మిల ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైకుంఠద్వార దర్శనం కోసం వెళ్తే ఏకంగా వైకుంఠానికే పంపుతారా... గోవింద నామాలు ప్రతిధ్వనించాల్సిన చోట మృత్యుఘోష నెలకొందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా కనీస ఏర్పాట్లు చేయకపోవడం పాలన యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమని గురువారం ఎక్స్‌వేదికగా ఆమె ట్వీట్ చేశారు. ఆరుగురు మృతిచెందిన ఘటనపై నైతిక బాధ్యత ప్రభుత్వం వహించాలని, మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం తగదని పేర్కొన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.కోటి పరిహారం ప్రకటించాలని, వారి ఇంట్లో ఒక్కొక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఎం చంద్రబాబును ఆమె డిమాండ్ చేశారు. మొన్న లడ్డు కల్తీ, నేడు తొక్కిసలాట సంఘటనలు కోట్లాది హిందువుల ఆరాధ్య దేవుడు వెంకన్న క్షేత్రానికి మచ్చ తెచ్చి పెట్టాయని తెలిపారు. తొక్కిసలాట ఘటనపై వెంటనే విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

'వలంటీర్లకు వేతనాలు చెల్లించండి'

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లకు బకాయిపడిన గౌరవ వేతనాలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు అధ్వర్యంలో ఆటోనగర్ నిర్మాన్ భవన్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయాల రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం వలంటీర్లతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ శివరామకృష్ణకి వినతి పత్రం అందజేశారు. రాజేంద్ర బాబు, గోవిందరాజులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తూ రూ.పదివేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఆగస్టు 21న సాక్షాత్తు డైరెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించి మరీ వలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుందని చెప్పారని, నేడు మంత్రులు బాల వీరాంజనేయ స్వామి, లోకేశ్... వలంటీర్ల వ్యవస్థపై అవాకులు చవాకులు పేలడం సరికాదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి వలంటరీ వ్యవస్థను కొనసాగించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి జి.మమత, దమ్ము రమేష్, టీ శైలజ, షేక్ భాజీ, ఎం.అనిల్ కుమార్, ఎం. వేగేష్, ఎస్‌కే షబానా, అంజలి, దుర్గ, పీ నరేష్, పీ నాగ పార్వతి, షైనీ, తులసి దేవి, డీ స్వప్న పాల్గొన్నారు.

పోలీసుల వైఫల్యంతోనే దుర్ఘటన

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి: జగన్

విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి: తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో పోలీసుల వైఫల్యం ఉందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీటీడీ పాలకమండలి, అధికారులు బాధ్యత వహించాలని అన్నారు. తిరుపతిలో జరిగిన దుర్ఘటనపై బాధితులను పరామర్శించేందుకు జగన్ గురువారం సాయంత్రం పద్మావతి వైద్య కళాశాలకు చేరుకున్నారు. క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. వైకుంఠ ఏకాదశి 10వ తేదీన జరుగుతుందని తెలిసినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలో మూడురోజుల పర్యటన పెట్టుకున్నారని ఆరోపించారు. దీంతో పోలీసు యంత్రాంగం మొత్తం బాబు పర్యటనలో నిమగ్నమయ్యారని చెప్పారు. తిరుపతిలో పద్మావతి పార్క్ వద్ద భక్తుల తొక్కిసలాటకు పోలీసుల నిర్లక్ష్యం, తగిన బందోబస్తు లేకపోవడమే కారణమని స్పష్టం చేశారు. ఈ దుర్ఘటనలో చనిపోయిన కుటుంబాలకు 50 లక్షల రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి ఐదు లక్షల రూపాయలు అందజేయాలని డిమాండ్ చేశారు. భక్తులకు కనీస వసతులు కల్పించడంలో విఫలమైన టీటీడీ అధికారులు, జిల్లా కలెక్టర్, పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జగన్ వెంట మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్కే రోజా, వైసీపీ నాయకులు ఉన్నారు.

ఉద్యోగుల వైద్య సేవలు పునరుద్ధరించండి: ఏపీటీఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు తమ దీర్ఘకాలిక, అత్యవసర వ్యాధుల చికిత్స కోసం వెళ్తే ఆయా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) కార్డులపై వైద్యం నిరాకరిస్తున్నారని, వెంటనే సమస్య పరిష్కరించి వైద్యం పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో తమ బకాయిలు చెల్లించాలని కొన్ని రోజులుగా హాస్పిటల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అన్ని రకాల చికిత్సలను నిలుపుదల చేయడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నిత్యం కొనసాగే కిడ్నీ డయాలసిస్ చికిత్సలు, అత్యవసర తదితర చికిత్సల విషయంలో ఈహెచ్ఎస్ కార్డులను అంగీకరించమని హాస్పిటల్ యాజమాన్యాలు చెబుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం చొరవ చూపి, సమస్యలను వెంటనే పరిష్కరించి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో కార్డులకు వైద్యం అంగీకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శాస్త్రీయ అవగాహనకు 'విశ్వం' దోహదం

మండలి బుద్ధప్రసాద్

విశాలాంధ్ర-విజయవాడ రూరల్: భూమి చుట్టూ ఆవరించుకుని... దానికి ఆలంబనగా నిలిచిన అంతరిక్షాన్ని, దానితో కూడిన విశ్వాన్ని అధ్యయనం చేయడం, ఆదిమానవుడి నుంచి నేటి వరకూ చాలా ఆసక్తికరమైన విషయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఎనిమిదో రోజు గురువారం రామోజీరావు సాహితీ వేదికపై ఘంటా సత్యకుమార్ రచించిన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించిన 'విశ్వం' పుస్తకాన్ని బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి టి.మనోహర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని మాట్లాడుతూ విద్యార్థులకు ఖగోళంపైనా, విశ్వంపైనా ఆసక్తికలిగేలా చేసి ఎందరో శాస్త్రవేత్తలను తయారు చేయటానికి 'విశ్వం' పుస్తకం దోహదం చేస్తుందని అన్నారు. విశ్వంపై, అంతరిక్షంపై నేటి తరానికి దగ్గర చేయడానికి, మూఢనమ్మకాలను దూరం చేయడానికి ఈ రచన ఉపయోగపడుతుందన్నారు. విశ్రాంత అధ్యాపకులు గుమ్మా సాంబశివరావు పుస్తకాన్ని పరిచయం చేస్తూ విశాల విశ్వానికి సంబంధించిన ఖగోళ వివరాలను సామాన్య పాఠకులకు అర్థమయ్యేలా ఈ రచన సాగిందన్నారు. తెలుగు అధ్యాపకులు కప్పగంతు రామకృష్ణ పుస్తకాన్ని సమీక్షించారు. భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, సాంస్కృతిక సేవకుడు గోళ్ల నారాయణరావు, విశ్రాంత అధ్యాపకులు ఘంటా రామప్రసాద్ ప్రసంగించారు.

గ్రంథాలయాల పునరుజ్జీవనానికి ఉద్యమం: గ్రంథాలయాల పునరుజ్జీవనానికి పౌరులు ఉద్యమించాలనీ, తెలుగువారిలో భాషా సంస్కృతి చైతన్యాన్ని పునరుజ్జీవింపజేయడానికి గ్రంథాలయ ఉద్యమం తప్పనిసరి అని మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పుస్తక మహోత్సవం సాహితీ వేదికపై సాహితీవేత్త ఎస్.వెంకట నారాయణ అధ్యక్షతన గ్రంథాలయ పునర్వికాస సదస్సు జరిగింది. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు జాతి చైతన్యానికి, తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటానికీ గ్రంథాలయ ఉద్యమమే కారణమని చెప్పారు. పిల్లలలో పఠనాసక్తి పెంపొందింపజేసే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని, పుస్తకాలు చదివించడం విద్యావిధానంలో భాగం కావాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజల నుంచి వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సును పూర్తిగా గ్రంథాలయాల అభివృద్ధికే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. సాహిత్య అకాడమీ సభ్యులు ఎమెస్కో విజయకుమార్, వికీపీడియా కార్యకర్త రహమాన్, క్రియేటివ్ కామర్స్ శ్రీపతి, మనసు ఫౌండేషన్ బాధ్యులు మన్నెం రాయుడు ప్రసంగించారు. ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య, విశాలాంధ్ర విజ్ఞాన సమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోదనలతో మిన్నంటిన రుయా

- పద్మావతి, స్విమ్స్ ఆస్పత్రుల్లోనూ కన్నీటి వ్యథ
- తొక్కిసలాట మృతుల బంధువుల బాధ వర్ణనాతీతం

విశాలాధ్ర బ్యూరో-తిరుపతి: వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఏడుకొండల మీద కొలువుదీరిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే పుణ్యం ప్రాప్తిస్తుందనే ఆశ, ఆత్రుత ఆరుగురి ప్రాణాలు తీసింది. రుయా ఆస్పత్రి ఆవరణలో మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. పద్మావతి, స్విమ్స్ ఆస్పత్రుల్లోనూ ఇవే కన్నీటి వ్యథలు కనిపించాయి. అయిన వారు తమ కళ్లముందే ప్రాణాలు విడవడంతో... వారి బంధువులు దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు. వేంకటేశా..! ఏమిటిది స్వామీ...? అంటూ భక్తులు రోదిస్తుంటే చూపరులు సైతం కన్నీటి పర్యంతమయ్యారు. ఇంటి వద్ద ఏం సమాధానం చెప్పాలంటూ కొందరు దుఃఖిస్తుంటే పరామర్శకు వచ్చిన వారి మనసు చలించి పోయింది. తిరుమల చరిత్రలో ఏనాడూ జరగని ఘోర ఘటన చూసి భక్తులు తల్లడిల్లి పోయారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు గురువారం నుంచి సర్వదర్శనం టోకెన్లు ఇచ్చేందుకు తిరుపతిలోఎనిమిది ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ విషయం వార్తాపత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాల ద్వారా విపరీతంగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో వైకుంఠ ద్వార దర్శనం కోసం ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, కేరళతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వీరు నీళ్లు, తిండి కూడా చూసుకోకుండా టోకెన్లు ఇచ్చే కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. గురువారం తెల్లవారు జామునుంచి భక్తులకు టోకెన్లు ఇవ్వాలని టీటీడీ మొదట నిర్ణయించింది. అయితే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అర్ధరాత్రి 12గంటల నుంచే టోకెన్లు ఇవ్వాలని భావించింది. ఇందుకోసమే రాత్రి తొమ్మిది గంటల నుంచే భక్తులను క్యూలైన్లలోకి అనుమతించారు. ఈ క్రమంలో బైరాగిపట్టెడలో గల రామానాయుడు పాఠశాలలో గల కేంద్రం పక్కనే పద్మావతి పార్కులో వేచి ఉన్న భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించడానికి గేటు వద్దకు తోసుకు వచ్చారు. రాత్రి సుమారు 8.50గంటల ప్రాంతంలో మూసి ఉన్న గేటును భక్తులు తోసుకుటూ ఒక్కసారిగా వచ్చారు. గేటు తెరచుకోవడంతో నియంత్రణ కోల్పోయారు. ఈ కారణంగా అక్కడ తొక్కిసలాట జరిగింది.ఒకరినొకరు తొక్కుకుంటూ క్యూలైన్ల వైపు పరుగులు తీశారు. కింద పడిన భక్తుల హాహాకారాలు, ఆర్తనాదాలతో బైరాగిపట్టెడ హోరెత్తి పోయింది. పోలీసులు, టీటీడీ విజిలెన్సు విభాగం వారు భక్తులను నియంత్రించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ దుర్ఘటనలో 40మందికి పైగా గాయపడ్డారు. తమిళనాడు రాష్ట్రం సేలం ప్రాంతానికి చెందిన మల్లిక (50) అక్కడే దుర్మరణం చెందింది. తొక్కిసలాటలో గాయపడిన వారిని రుయా, స్విమ్స్, పద్మావతి ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఎస్. లావణ్య (30) (విశాఖ), బుద్దేటి నాయుడు బాబు (55) (నర్సీపట్నం), కందిపల్లి శాంతి (33) (విశాఖపట్నం), రజినీ (47) (విశాఖపట్నం), వి.నిర్మల (55) (బళ్లారి, కర్నాటక) అనే వారు మృతి చెందారు. మృతుల్లో ఏపీ వాసులు నలుగురు కాగా... తమిళనాడు, కేరళ రాష్ట్రానికి చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. తొక్కిసలాటలో గాయపడిన వారు కొందరు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కాగా... మరికొందరు ఇంకా చికిత్స పొందుతున్నారు. టీటీడీ, పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఈ దుర్ఘటన చోటుచేకుందని కొందరు అభిప్రాయ పడుతున్నారు.

రూ.5 కోట్ల కుంభకోణం...11 మంది అరెస్టు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: నకిలీ ధృవపత్రాలతో జీడీసీసీ బ్యాంకు ద్వారా రూ.5 కోట్ల కుంభకోణానికి పాల్పడిన కేసును గుంటూరు జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులను అరెస్టు చేశారు. చట్టం నుంచి నేరగాళ్లు తప్పించుకోలేరని గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వెల్లడించారు. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పశ్చిమ వీరాయపాలెం గ్రామానికి చెందిన ఉన్నగిరి లింగేశ్వరరావు పేరు మీద చిన్నకొండ్రుపాడు ప్రాథమిక వ్యవసాయ కోపరేటివ్ సొసైటీలో సుమారు రూ.6 లక్షల రుణం ఉందని తెలుసుకొని... 2024 సెప్టెంబర్ 18న ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన సీఐ శ్రీనివాసరావు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో 30 మంది నిందితులు నకిలీ రైతులను ఎంపిక చేసుకుని బ్యాంకులో వారి పేరు మీద రుణాలు తీసుకున్నారని తెలిపారు. వారిలో 11 మంది నిందితులను కనిపెట్టి విచారించగా వారు నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలు, 1బి అడంగల్, ఆధార్ కార్డులు, పాన్ కార్డులు, నకిలీ వరుస నెంబర్లు, విస్తీర్ణాలను వెబ్ లాండ్, ఇతర ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో ఎక్కిస్తుండేవారని, రుణం తీసుకున్న తర్వాత ఆ వివరాలను వెబ్‌సైట్లలో నుంచి తొలగించే వారన్నారు. మండ్రు సీతారామాంజనేయులు అనే వ్యక్తి నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేస్తుండగా, ఆవుల తిరుపతి రెడ్డి ఆధార్ కార్డులో అడ్రస్‌లు మారుస్తూ పాన్ కార్డులు సృష్టిస్తూ ఉండేవాడన్నారు. రుణాల మంజూరుకు అవసరమైన నకిలీ రైతులను తిరువీధుల యోగయ్య, తురుమెల్ల వెంకట సందీప్ సమకూర్చారన్నారు. వీరికి జీడీసీసీ ప్రత్తిపాడు బ్రాంచ్ మాజీ మేనేజర్ బొల్లినేడి రవికుమార్, మాచవరం మాజీ తహసీల్దార్ గర్నెపూడి లేవీ సాంకేతిక సలహాలు, సూచనలు ఇస్తుంటారన్నారు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంట రుణాలు మాఫీ అనే పథకాన్ని ఆసరాగా చేసుకుని... తీసుకున్న నకిలీ రుణాలు మాఫీ అవుతాయనే కోణంలో పల్నాడు జిల్లాలో ప్రాథమికంగా ఈ ఆర్థిక నేరానికి/కుంభకోణానికి పాల్పడినట్లు ఎస్పీ వివరించారు. తద్వారా ఈ నెట్‌వర్క్ ఇతర జిల్లాలకు విస్తరించినట్లు విచారణలో తెలిసిందన్నారు. ఈ కేసులో సోమేపల్లి నాగరాజు, జిల్లెళ్లమూడి ప్రభాకర్, తిరువీధుల యోగయ్య, మండ్రు సీతా రామాంజనేయులు, సుంకర వెంకటేశ్వర్లు, తురుమెళ్ల వెంకట సందీప్ కుమార్, నేమలపురి శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, బత్తుల లక్ష్మీనారాయణ, ఆవుల తిరుపతి రెడ్డి, గర్నపూడి లేవీని అరెస్టు చేశామన్నారు. ఈ కేసును సవాల్‌గా తీసుకొని 11 మంది నిందితులను అరెస్టు చేయడంలో దిశానిర్దేశం చేసిన సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, ప్రతిపాడు సీఐ శ్రీనివాసరావు, పెదనందిపాడు, కాకుమాను ఎస్‌ఐలు మధు పవన్, ఏక్‌నాథ్, వారి సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారు.

బాలసుబ్రమణ్యంకు డీజీపీ హోదా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్.బాల సుబ్రమణ్యం (1994 బ్యాచ్)కు ప్రభుత్వం డీజీపీ హోదా కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత టీడీపీ హయాంలో బాల సుబ్రమణ్యం రవాణా శాఖ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనను రవాణా శాఖ కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి ఆర్‌టీజీఈ ప్రగతికి సీఈవోగా ప్రభుత్వం నియమించింది. మరలా ఆ పదవి నుంచి కూడా తప్పించి డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఆయన దీర్ఘకాలిక సెలవు పెట్టి అమెరికా వెళ్లిపోయారు. ఆ తర్వాత వైసీపీ సర్కార్ అదనపు డీజీ రైల్వేస్‌కి బదిలీ చేసింది. ఆ తర్వాత అదనపు డీజీ (ఆర్గనైజేషన్)లో కొనసాగుతుండగా ప్రభుత్వం డీజీపీ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ఆరుగురి మృతికి... పాలనా వైఫల్యమే: అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు భక్తుల మృతికి చంద్రబాబు పాలనా వైఫల్యమే కారణమని మాజీ మంత్రి, వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తిరుపతిలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం ద్వారా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని అన్నారు. శ్రీవారి సేవే పరమావధిగా పనిచేయాల్సిన టీటీడీ కాస్తా టీడీపీ సేవలకు పరిమితమైందని విమర్శించారు. టీటీడీ చరిత్రలో ఇంతటి ఘోర ప్రమాదం జరగలేదని, వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనంకు వచ్చే భక్తులకు టోకెన్లు జారీ చేసే కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించడం, పెద్ద సంఖ్యలో గాయపడటం బాధాకరమని తెలిపారు. చనిపోయిన ఒక్కో బాధిత కుటుంబానికి రూ.కోటి చొప్పున ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సినీ గాయకుడు జయచంద్రన్ కన్నుమూత



తిరువనంతపురం: ప్రముఖ సినీ గాయకుడు పి. జయచంద్రన్ (80) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన కేరళ రాష్ట్రం త్రిస్సూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించారు. కేరళకు చెందిన జయచంద్రన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జయచంద్రన్ మలయాళం, తెలుగు, తమిళం, కన్నడ, హిందీలో 16 వేలకు పైగా పాటలు పాడారు. జయచంద్రన్ తెలుగులో గానం చేసిన అనేక పాటలు ప్రేక్షకాదరణ పొందాయి. రోజావే చిన్ని రోజావే (సూర్యవంశం), హ్యాపీ హ్యాపీ బర్త్‌డేలు (సుస్వాగతం), అనగనగా ఆకాశం ఉంది (నువ్వే కావాలి) వంటి పాటలు సూపర్ హిట్టయ్యాయి. తెలుగులో ఆయన పాడిన 'నా చెల్లి చంద్రమ్మ' (ఊరు మనదిరా) చివరి పాట 2002లో విడుదలైంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.